www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
మంగళవారం
17-12-2024
సంపుటి : 01 | సంచిక : 225 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

# మోదం వైపా? ఖేదం వైపా?

- నేడే లోక్‌సభ ముందుకు 'జమిలి' బిల్లు..
- ఎంపీలకు బీజేపీ విప్ జారీ
- బలం సాధించే దిశగా ఎన్డీయే సర్కార్ ప్లానేంటి?
- ఈ బిల్లుపై నేడు పార్లమెంటు జరిగే పరిణామాలపై సర్వత్రా ఆసక్తి

పార్లమెంట్ ముందుకు రానుంది. నిజానికి సోమవారం రెండు బిల్లులు ప్రవేశపెడుతారని భావించరంతా. కానీ ఒకవైపు ప్రతిపక్షాల నుంచి అభ్యంతరాలు.. మరోవైపు రాజ్యసభలో రాజ్యంగంపైన చర్చ నేపథ్యంలో బిల్లు నేటికి వాయిదా పడింది. మంగళవారం ఒకే దేశం ఒకే ఎన్నికల బిల్లు లోకసభలో ప్రవేశ పెట్టబోతున్నారు. మరి పార్లమెంట్‌లో మొగ్గు.. మోదం వైపా? ఖేదం వైపా? బలం సాధించే దిశగా ఎన్డీయే సర్కార్ ప్లానేంటి? అనేది ఆసక్తికరంగా మారింది.

**విశ్వంభర, నేషనల్ బ్యూరో**

లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశంఒకే ఎన్నిక' బిల్లు మంగళవారమే పార్లమెంటు ముందుకు రానుంది. ఈ మేరకు మంగళవారం లోక్‌సభ ముందు ప్రవేశపెట్టాల్సిన బిల్లుల జాబితాలో కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల బిల్లును చేర్చింది. నుకేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ లోక్‌సభలో మంగళవారం మధ్యాహ్నం ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం.జమిలి ఎన్నికల నిర్వహణపై అనేక అనుమానాలు నెలకొన్నవేళ దీనిపై విస్తృత సంప్రదింపుల కోసం బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీ కి పంపించేలా స్పీకర్‌ను కోరే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భాజపా తమ ఎంపీలంతా.. మిగతా2లో...



## శ్రీలంకకు లిక్విడ్ న్యాచురల్ గ్యాస్..

ప్రధాని నరేంద్రమోదీ ప్రకటన
ఇరుదేశాల మధ్య రక్షణ, ఇంధన, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలి
సమావేశంలో నిర్ణయం
2





## లగచర్ల ఘటనపై దద్దరిల్లిన అసెంబ్లీ

### బీఆర్ఎస్ సభ్యుల ప్లకార్డుల ప్రదర్శన..

- అసెంబ్లీ నడిచినన్ని రోజులు లగచర్ల ఘటనపై కొట్లాడుతాం
- ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పే వరకు పోరాటం చేస్తాం
- లగచర్ల రైతులకు బేడీల విషయంపై అసెంబ్లీ చర్చకు బీఆర్ఎస్ పట్టు
- శాసనసభ సమావేశాలు రేపటికి వాయిదా
- ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసిన బీఏసీ సమావేశం

**విశ్వంభర, హైదరాబాద్:**

శాసనసభలో విపక్ష సభ్యుల నినాదాల మధ్య సభ రేపటికి వాయిదా పడింది. సభా మర్యాదలు దెబ్బతీసేలా సభ్యులు వ్యవహరిస్తున్నారని స్పీకర్ ఆవేదన వ్యక్తం చేశారు. సభలో మంత్రి ప్రసంగిస్తున్న సమయంలో బీఆర్ఎస్ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించారు. దీంతో సభ్యుల వద్ద ప్లకార్డులను తీసుకురావాలని మార్షల్స్‌కు స్పీకర్ ఆదేశించారు. ప్లకార్డులను మార్షల్స్‌కు ఇస్తే మాట్లాడే అవకాశమిస్తామని స్పీకర్ సభ్యులకు సూచించారు. విపక్ష సభ్యుల నినాదాల మధ్య సభను రేపటికి వాయిదా వేశారు.సభా మర్యాదకు భంగం కలిగించడం సరికాదు.. శాసనసభలో బీఆర్ఎస్ నేతల తీరును ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులు ఖండించారు. పర్యాటక అంశంపై మంత్రి మాట్లాడుతుంటే అడ్డుకున్నారని మండిపడ్డారు. సభా సంప్రదాయాలను విపక్షసభ్యులు పట్టించుకోవట్లేదని ఆక్షేపించారు. సభా మర్యాదకు భంగం కలిగించడం సరికాదని భట్టి విక్రమార్క హితవుపలికారు. సభాపతిపై విపక్ష సభ్యులకు గౌరవం ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'జై జవాన్.. జై కిసాన్'.. మండలిలో ప్లకార్డులతో బీఆర్ఎస్

: శాసన మండలిలో పర్యాటక విధానంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వల్పకాలిక చర్చ ప్రారంభించిన కాసేపటికే బీఆర్ఎస్ సభ్యులు... మిగతా2లో...

## త్వరలో చైనా పర్యటనకు అజిత్ ధోబాల్ 2

## 'జై శ్రీరామ్' నినాదం ఎలా నేరం?

మసీదు లోపల నినాదాలు చేశారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తులపై విచారణ కొట్టివేత
సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



2

## మీరు జేఎన్‌యూలో చదివి ఉండవచ్చు..

- కానీ..ఆమె చర్యలు మాత్రం బాగాలేవు
- నిర్మలా సీతారామన్‌కు ఖర్గే కౌంటర్



3

## భూమిలేనివారికి రూ.6 వేలు

- సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ
- కేటీఆర్ ఈ-ఫార్ములా రేస్ నిధుల బదలాయింపుపై విచారణకు గవర్నర్ ఆమోదం
- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు
- ఈ-కార్ రేసు వ్యవహారంలో చట్టప్రకారమే దర్యాప్తు కొనసాగుతుంది
- కేటీఆర్ అరెస్టుపై నేనేమీ చెప్పలేను
- ఈ సమావేశాల్లో ఆర్వోఆర్ బిల్లు ప్రవేశపెడతాం
- ఇందిరమ్మ ప్రభుత్వంలో కక్ష సాధింపు ఉండదు
- మంత్రి పొంగులేటి

2



## ఘోర రోడ్డు ప్రమాదం..

ఏడుగురు మృతి..
పలువురికి గాయాలు!
ఛత్తీస్‌గఢ్‌లోని బలోద్ జిల్లాలో ఘటన
2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 101 | ₹ 123 |
| స్కిన్‌తో | స్కిన్‌లెస్ |
| ₹ 178 | ₹203 |

## తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

మార్చి 5 నుంచి 25వరకు నిర్వహిస్తాం
ఇంటర్ బోర్డు వెల్లడి

2




## పురుటి నొప్పులతోనే గ్రూప్-2 పరీక్ష రాసిన అభ్యర్థి

- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆసక్తికర ఘటన



**విశ్వంభర, నాగర్ కర్నూల్:** పురుటి నొప్పులతోనే ఓ అభ్యర్థి గ్రూప్2 పరీక్ష రాసిన ఆసక్తికర ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. బల్మూరు మండలం బాణాల గ్రామానికి చెందిన రేవతి అనే నిండు గర్భిణీ మహిళ నాగర్ కర్నూల్ పట్టిన జెడ్పీ హైస్కూల్‌లో గ్రూప్2 పరీక్ష రాసేందుకు వెళ్లారు. పరీక్ష రాస్తున్న సమయంలోనే ఆమెకు పురుటి నొప్పులు రాగా.. అప్రమత్తమైన పరీక్ష నిర్వహణ అధికారులు..ఆమెను హాస్పిటల్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధం అయ్యారు. అందుకు ఆమె అంగీకరించకుండా.. పరీక్ష రాస్తానని పట్టుబట్టారు. మరోవైపు ఆమె కాన్పు తేదీ కూడా ఇవాళే కావడంతో పరీక్ష నిర్వహణ సిబ్బంది కాస్త ఆందోళనకు గురయ్యారు. పురుటి నొప్పులు వస్తున్నా పరీక్ష రాస్తానని చెప్పడంతో అధికారులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పరీక్షా కేంద్రంలో 108 అంబులెన్స్‌ను కూడా సిద్ధంగా ఉంచారు. ఆ గర్భిణి కోసం ప్రత్యేక వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసి.. ఎప్పుడు తీవ్ర నొప్పులు వచ్చినా ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అన్నీ సిద్ధంగా ఉంచారు. పరీక్షా కేంద్రం వద్ద రేవతి భర్త, తల్లి అందుబాటులో ఉంచారు. ఆ నొప్పులతోనే అభ్యర్థి పరీక్షను పూర్తి చేశారు.

## పోలవరం ఏపీకి జీవనాడి..

2026 అక్టోబరు నాటికి పూర్తి చేయడమే లక్ష్యం
ప్రాజెక్టు వద్ద సీఎం చంద్రబాబు సుడిగాలి పర్యటన
రోడ్డు మార్గం ద్వారా నిర్మాణ ప్రాంతానికి వెళ్లి.. అక్కడి పనులు పరిశీలన

**విశ్వంభర, పోలవరం:**

పోలవరం ప్రాజెక్టును 2026 అక్టోబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. 2025 డిసెంబర్ నాటికి డయాఫ్రం వాల్ పూర్తి కావాలని అధికారులకు చెప్పానని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు వద్ద సీఎం చంద్రబాబు సుడిగాలి పర్యటన చేశారు. హెలికాప్టర్‌లో పోలవరం చేరుకున్న సీఎం.. వస్తూనే విహంగ వీక్షణం చేశారు. ఆ తర్వాత మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర అధికారులతో కలిసి వ్యూపాయింట్‌కు వెళ్లారు. పోలవరం గ్యాప్1 పనులను పరిశీలించి.. మిగతా3లో...



## శ్రీలంకకు లిక్విడ్ న్యాచురల్ గ్యాస్..

**ఢిల్లీ:** భారత పర్యటనలో ఉన్న శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే సోమవారం ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య ఉన్న రక్షణ, ఇంధన, వాణిజ్య సంబంధాలను భవిష్యత్ దృష్టికోణంలో మరింత బలోపేతం చేసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. త్వరలోనే రక్షణ సహకార ఒప్పందాన్ని కూడా కుదుర్చుకోవాలని, ఎలక్ట్రిసిటీ కనెక్టివిటీ, మల్టీప్రాడక్ట్ పెట్రోల్ పైప్‌లైన్‌లను ఏర్పాటుచేసి ఇంధన సంబంధాలను కూడా పెంచుకోవాలని సమావేశంలో చర్చించారు.
ఇరు దేశాల మధ్య ఆర్థిక భాగస్వామ్యానికి పెట్టుబడి ఆధారిత వృద్ధి అవసరమని ఇరుపక్షాలు నిర్ణయించాయి. ఫిజికల్, డిజిటల్, ఎనర్జీ కనెక్టివిటీ అనేవి ఇరుదేశాల ఆర్థిక సంబంధాలకు మూల స్తంభాలుగా ఉండాలని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రిసిటీ గ్రిడ్ కనెక్టివిటీ, మల్టీ ప్రొడక్ట్ పెట్రోలియం పైప్‌లైన్ ఏర్పాటుకు కృషి చేస్తామని, దీని ద్వారా శ్రీలంకకు లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ సరఫరా చేస్తామని చెప్పారు.
భారత్‌శ్రీలంక దేశాల మధ్య కనెక్టివిటీని పెంచేందుకు రామేశ్వరంతలైమానార్ మధ్య ఫెర్రీ సర్వీస్‌లను ప్రారంభించున్నట్లు మోదీ ప్రకటించారు. ఇరుదేశాల భద్రతా ప్రయోజనాలు పరస్పరం అనుసంధానించబడి ఉన్నాయని, అందుకే రక్షణ సహకార ఒప్పందాన్ని త్వరలో ఖరారు చేసుకోవాలని తాము నిర్ణయించామని, ఇప్పటికే హైడ్రోగ్రఫీ సహకారం కోసం ఒప్పందం కూడా కుదిరిందని ఆయన తెలిపారు.
ఇద్దరు దేశాధినేతల మధ్య మత్స్యకారుల సమస్యలు కూడా చర్చకు వచ్చాయి. మత్స్యకారుల జీవనోపాధికి సంబంధించిన అంశంలో మానవతా దృక్పథంతో ముందుకు సాగాలని ఇరువురు నేతలు అంగీకారానికి వచ్చారు. తమిళుల సమస్యలపైనా ఇరువురు నేతలు చర్చించారు. శ్రీలంక ప్రభుత్వం తమిళ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని భారత్ ఆశిస్తోందని మోదీ చెప్పారు.
భారత్ ఇప్పటివరకు శ్రీలంకకు 5 బిలియన్ డాలర్ల విలువైన గ్రాంట్లు, క్రెడిట్ లైన్స్ ఇచ్చిందని ప్రధాని వెల్లడించారు. దిసనాయకే మాట్లాడుతూ.. శ్రీలంక అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఇదే తన తొలి విదేశీ పర్యటనని, భారత్‌లో పర్యటించడం తనకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. పబ్లిక్ సర్వీస్‌లను డిజటలైజ్ చేయడంలో భారత్ అద్భుతమైన విజయాన్ని సాధించిందని, శ్రీలంక కూడా ఇదే బాటలో నడుస్తోందని చెప్పారు. శ్రీలంకకు భారత్ మద్దతు ఉంటుందని మోదీ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## 'జై శ్రీరామ్' నినాదం ఎలా నేరం?

**ఢిల్లీ:** జై శ్రీరామ్ నినాదాలు చేయడం నేరపూరిత చర్య ఎలా అవుతుందని సుప్రీం కోర్టు సోమవారం ప్రశ్నించింది. మసీదు లోపల నినాదాలు చేశారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తులపై విచారణను కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్‌ను సమీక్షిస్తూ న్యాయమూర్తులు పంకజ్ మిథాల్, సందీప్ మెహతా ఈ అంశాన్ని లేవనెత్తారు. మసీదు లోపల 'జై శ్రీరామ్' నినాదాలు చేసిన ఇద్దరు వ్యక్తులపై విచారణను రద్దు చేసిన కర్ణాటక హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన భారత అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది.
హైదర్ అలీ సిఎం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఒక నిర్దిష్ట మతపరమైన పదబంధాన్ని లేదా పేరును అరుస్తుంటే అది ఎలా నేరం అని బెంచ్ ప్రశ్నించింది. మసీదు లోపలికి వచ్చి నినాదాలు చేసిన వారిని ఎలా గుర్తించారని సుప్రీంకోర్టు ఫిర్యాదుదారుని ప్రశ్నించింది. విచారణ సందర్భంగా, పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్‌ను సుప్రీం కోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. ఈ ప్రతివాదులను ఎలా గుర్తిస్తారు? అవన్నీ సీసీటీవీలో రికార్డయ్యాయని అంటున్నారు. లోపలికి వచ్చిన వ్యక్తులను ఎవరు గుర్తించారని బెంచ్ ప్రశ్నించింది. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 503 లేదా సెక్షన్ 447లోని నిబంధనలను అభియోగాలు తాకడం లేదని హైకోర్టు గుర్తించిందని ధర్మాసనం పేర్కొంది.
భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 503 క్రిమినల్ బెదిరింపులకు సంబంధించిందని, అయితే సెక్షన్ 447 నేరపూరిత అతిక్రమణకు శిక్షను సూచిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఫిర్యాదును ప్రస్తావిస్తూ, ఎఫ్ఐఆర్ నేరాల ఎన్‌సైక్లోపీడియా కాదని కామత్ అన్నారు. మసీదులోకి ప్రవేశించిన అసలు వ్యక్తులను మీరు గుర్తించగలిగారా? దీనిపై రాష్ట్ర పోలీసులు వివరణ ఇవ్వాల్సి ఉంటుందని కామత్ అన్నారు. దీనిపై ధర్మాసనం పిటిషన్ కాపీని రాష్ట్రానికి ఇవ్వాలని పిటిషనర్‌ను కోరగా, కేసు తదుపరి విచారణను 2025 జనవరికి వాయిదా వేసింది.
తీవ్ర వ్యాఖ్యలు చేసిన హైకోర్టు..
అంతకుముందు సెప్టెంబర్ 13న, ఈ కేసులో ఇద్దరు వ్యక్తులపై క్రిమినల్ ప్రొసీడింగ్‌లను కర్ణాటక హైకోర్టు రద్దు చేసింది. ఎవరైనా 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేస్తే ఏ వర్గానికి చెందిన వారి మనోభావాలను ఎలా దెబ్బతీస్తారన్నది అర్థం కావడం లేదని కర్ణాటక హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రజా విఘాతం లేదా ఎలాంటి చీలిక ఏర్పడినట్లు ఎలాంటి ఆరోపణలు లేవని వ్యాఖ్యానించింది. ఐపిసి సెక్షన్ 506 ప్రకారం నేరపూరిత బెదిరింపు నేరానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఎవరో కూడా ఫిర్యాదుదారు చూపలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.
అసలు విషయం ఏమిటి?
మసీదులోకి ప్రవేశించి మతపరమైన నినాదాలు చేశారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌పై కర్ణాటక హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్, ప్రొసీడింగ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన 2023 సెప్టెంబర్ 24న జరిగింది. పుత్తూరు సర్కిల్‌లోని కడప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మసీదులోకి ప్రవేశించి 'జై శ్రీరామ్' నినాదాలు చేయడంతో బెదిరింపులకు దిగారని ఫిర్యాదుదారు ఆరోపించారు. ఎలాంటి ఆరోపణ చేసిన నేరాలకు సంబంధించిన ఆధారాలు లేకుండా, పిటిషనర్‌లపై విచారణ కొనసాగించడం చట్టపరమైన దుర్వినియోగం అవుతుందని, న్యాయపరమైన అనుచితానికి దారి తీస్తుందని హైకోర్టు నిర్ధారించింది.

## త్వరలో చైనా పర్యటనకు అజిత్ ధోబాల్

**ఢిల్లీ:** భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ త్వరలో చైనా లో పర్యటించనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల మధ్య కీలక దౌత్య సంబంధిత చర్చలు జరిగే అవకాశమున్నట్లు సమాచారం. గాల్వాన్ లోయ ప్రతిష్టంభన తర్వాత ఇటీవలే సరిహద్దు నుంచి భారత్, చైనా బలగాలు వెనక్కితగ్గిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఇరు దేశాల మధ్య చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇటీవల పార్లమెంట్ ఉభయసభల్లో విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ భారత్‌చైనా సంబంధాలపై మాట్లాడుతూ.. చైనా చర్యల వల్ల 2020లో సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతతలకు భంగం వాటిల్లిందని అన్నారు. అప్పటినుంచి ఇరుదేశాల మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్నాయని తెలిపారు. లాజిస్టికల్ సవాళ్లు, కొవిడ్ పరిస్థితులు ఉన్నప్పటికీ.. మన బలగాలు చైనాను కట్టడి చేశాయని చెప్పారు. అయితే, నిరంతర దౌత్య చర్చల ఫలితంగా ఇరుదేశాల మధ్య సంబంధాల్లో ఇటీవల కొంత మెరుగుదల కనిపించిందని వివరించారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించడం కోసం పొరుగుదేశంతో దౌత్యపరమైన చర్చలకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. దీంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయన్నారు. న్యాయమైన, సహేతుక, పరస్పర ఆమోదయోగ్య పరిష్కారం కోసం చైనాతో చర్చలు జరిపేందుకు భారత్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.



# మోదం వైపా? ఖేదం వైపా?

(మొదటి పేజీ తరువాయి)

తప్పనిసరిగా మంగళవారం లోక్‌సభకు రావాలని ఇప్పటికే విప్ జారీ చేసింది. లోక్‌సభలో కీలక అంశాలపై చర్చ జరగనున్నందున గైర్హాజరు కావొద్దంటూ మూడు లైన్ల విప్‌ను జారీ చేస్తూ లోక్‌సభలో బీజేపీ చీఫ్ విప్ డా సంజయ్ జైస్వాల్ ఓ లేఖను విడుదల చేశారు.
జమిలి ఎన్నికల బిల్లుకు సంబంధించి మరో ట్విస్ట్. లోక్‌సభ,అసెంబ్లీ ఎన్నికలకు దేశవ్యాప్తంగా ఒకే సారి నిర్వహించే విధంగా వన్ నేషన్ వన్ ఎలక్షన్ నినాదాన్ని తెరపైకి తెచ్చింది ఎన్‌డీఏ సర్కార్. ఇటీవలే జమిలి ఎన్నికల బిల్లును కేబినెట్ ఆమోదించింది. 129వ రాజ్యాంగ సవరణ, కేంద్ర పాలిత ప్రాంత చట్టాల సవరణ రెండు బిల్లులను సోమవారం ప్రవేశ పెడుతారనే చర్చ జరిగింది. కానీ లోక్‌సభ రివైజ్డ్ బిజినెస్ జాబితాలో ఆ రెండు అంశాల ప్రస్తావన లేదు. దాంతో వాయిదా అంశంపై తెరపైకి వచ్చింది. మంగళవారం విధిగా సభకు హాజరుకావాలని బీజేపీ ఎంపీలకు విప్ జారీ అయింది. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ మంగళవారం లోక్‌సభలో జమిలి ఎన్నికల బిల్లును ప్రవేశ పెట్టేందుకు రంగం సిద్ధమైంది.
జమిలి ఎన్నికలకు సంబంధించి రాజ్యాంగ సవరణలతో కూడిన బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు కనీసం 67 శాతం సానుకూల ఓట్లతో ఆమోదించాల్సి ఉంటుంది. అంతేకాకుండా.. ఎన్నికల అంశం ఉమ్మడి జాబితాలో ఉన్న నేపథ్యంలో ఈ బిల్లుకు దేశంలోని కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోద ముద్రవేయాలి. అంటే 543 స్థానాలున్న లోక్‌సభలో కనీసం 67 శాతం అంటే.. 362 ఎంపీలు ఈ బిల్లుకు అనుకూలంగా ఓటువేయాలి. దీంతోపాటు రాజ్యసభలో 245 సీట్లలో 67 శాతం అంటే 164 మంది సభ్యులు ఈ బిల్లును సమర్థించాలి. దీనికి తోడు కనీసం 14 రాష్ట్రాల అసెంబ్లీలు బిల్లును ఆమోదించాల్సిన అవసరం ఉంది. అయితే లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది ఎంపీల మద్దతు వుంటే, ఇండియా కూటమికి 235 మంది ఎంపీలున్నారు. అయినా సరే బిల్లు పాస్ అవుతుందనే ధీమాతో ఉంది ఎన్‌డీఏ సర్కార్. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే.. పార్లమెంట్‌లో ఆమోదం పొందితే.. 2029నుంచే జమిలి ఎన్నికలు జరగనున్నాయి.
జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశ పెట్టే వేళాయింది. నిజానికి ఇదే కొత్త కాదు. 1952, 1967లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించిన చరిత్ర వుంది. అయితే ఈసారి వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై విస్తృతంగా చర్చ జరుగుతోంది. మంగళవారం పార్లమెంట్‌లో ఎలాంటి పరిణామాలు ఉంటాయన్నది ఇపుడు ఆసక్తికరంగా మారింది. జమిలి బిల్లు పాస్ కావడం ఖాయమని ధీమాగా వుంది ఎన్డీఏ. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు సంబంధించి ఎన్డీయేలోని అన్ని భాగస్వామ్య పార్టీలతో చర్చలు జరిపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కేవలం రాజకీయ కారణాలతోనే ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ బిల్లును పార్లమెంటరీ కమిటీకి పంపేందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదు.
ఒకే దేశం ఒకే ఎన్నికల బిల్లు లక్ష్యం దాని పేరులోనే ప్రతిబింబిస్తుంది. ఈ బిల్లు ద్వారా దేశవ్యాప్తంగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలని ఎన్‌డీఏ ప్రభుత్వం కోరుతోంది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం వెనుక అనేక రకాల వాదనలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఏ కొత్త పథకాన్ని అమలు చేయడానికి వీల్లేదు. ప్రవర్తనా నియమావళి సమయంలో, కొత్త ప్రాజెక్ట్‌లు, కొత్త ఉద్యోగాలు, కొత్త విధానాలను ప్రకటించలేరు. ఇది అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతుంది. దేశం అభివృద్ధిలో అడ్డంకులు ఎదుర్కోవాలి. ప్రతి రోజు దేశంలోని వనరులు ఖర్చు చేయడం జరుగుతుంది. దీంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులకు రికరింగ్ ఎలక్షన్ డ్యూటీ నుంచి కూడా విముక్తి లభిస్తుందని పేర్కొంటున్నారు.
భారతదేశంలో, 1967 సంవత్సరం వరకు, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, కొత్త రాజ్యాంగం ప్రకారం దేశంలో మొదటి సాధారణ ఎన్నికలు 1952 సంవత్సరంలో జరిగాయి. ఆ తర్వాత రాష్ట్ర అసెంబ్లీలకు కూడా ఏకకాలంలో ఎన్నికలు జరిగాయి. అయితే 1957 ఎన్నికల తర్వాత కేంద్ర ప్రభుత్వం అక్కడ రాష్ట్రపతి పాలన విధించినందున, 1957లో కేరళలో వామపక్ష ప్రభుత్వం ఏర్పడటంతో ప్రత్యేక ఎన్నికల ధోరణికి బ్రేక్ పడింది. 1960లో కేరళలో మళ్లీ ఎన్నికలు జరిగాయి. అయితే.. ఒకే దేశం.. ఒకే ఎన్నికలు అంటూ పలు రాష్ట్రాల్లో అసెంబ్లీని ముందస్తుగా రద్దు చేస్తారని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# లగచర్ల ఘటనపై దద్దరిల్లిన అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళనకు దిగారు. వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో రైతులకు బేడీలు వేసిన అంశంపై మండలిలో చర్చించాలని వారు డిమాండ్ చేశారు. రైతులకు బేడీలు వేసిన ఘటనపై చర్చకు తీసుకురావాలని బీఏసీలో కోరామని.. ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అంశంపై ప్రభుత్వం స్పందిస్తుందని మండలి ఛైర్మన్.. బీఆర్ఎస్ సభ్యులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. సభ్యులు వారి స్థానాల్లో కూర్చోవాలని ఛైర్మన్ సూచించినప్పటికీ బీఆర్ఎస్ సభ్యులు సభలో నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు పట్టుకొని జై జవాన్.. జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య మండలి ఛైర్మన్ సభను వాయిదా వేశారు.
సభా సమయం వృథా చేయడానికి ప్రయత్నిస్తున్నారు :..
మరోవైపు శాసనసభలో బీఆర్ఎస్ నాయకులు ప్లకార్డులు ప్రదర్శించడాన్ని మంత్రి శ్రీధర్‌బాబు తప్పుపట్టారు. సభా సంప్రదాయాలను విపక్షాలు గౌరవించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ ఆదేశాలను సభ్యులు పక్కనపెట్టడం సరికాదన్నారు. విపక్షాలు లేవనెత్తిన ప్రతి అంశంలో ప్రభుత్వం జవాబిస్తుందన్నారు. బీఏసీ భేటీలో విపక్షాలు అభిప్రాయాలు తీసుకున్నారని తెలిపారు. విపక్షసభ్యులు సభా సమయం వృథా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.
అసెంబ్లీ నడిచినన్ని రోజులు లగచర్ల ఘటనపై కొట్లాడుతాం..
తమ భూమి తమకే ఉండాలని కొట్లాడిన పాపానికి లగచర్ల రైతులను జైల్లో పెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. వారి మీద కేసులు పెట్టడమే కాకుండా వారిపై థర్డ్ డిగ్రీ ఉపయోగిస్తున్నారన్నారు. లగచర్ల ఘటనపై చర్చ పెడదాం అంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. పురుషులను జైల్లో పెట్టి.. ఆడవారిని ఇంటికి వెళ్లి బెదిరిస్తున్నారన్నారు. కొడంగల్ ప్రజలకు తాము అండగా ఉంటామన్నారు. ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పే వరకు పోరాటం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. శాసన సభ నడిచినన్ని రోజులు లగచర్ల ఘటనపై కొట్లాడుతామన్నారు.
దుర్మార్గమైన, నికృష్టమైన పాలనను ప్రజలు గమనిస్తున్నారని.. తమ భూమి తమకు కావాలని అడ్డు పడితే రైతులను లాఠీలతో కొట్టారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రైతుల మీద చర్చ పెడదాం అంటే.. పర్యాటక శాఖ మీద చర్చ పెట్టారన్నారు. మీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో రెండే పర్యాటకాలు అని.. ఒకటి ఢిల్లీకి ఎక్కే పర్యాటకం, రెండూ దిగే పర్యాటకం అంటూ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి, మంత్రులు 70 సార్లు ఢిల్లీకి పోయారన్నారు. కొడంగల్ రైతుల మీద చర్చ పెడదాం అంటే అసెంబ్లీని వాయిదా వేసుకొని పారిపోయారంటూ ఎద్దేవా చేశారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ కేసీఆర్ పోరాటం చేస్తారని కేటీఆర్ చెప్పారు. పరారీలో ఉన్న వారిని ఇంకా వేధిస్తున్నారని ఆయన అన్నారు. 14 వేల ఎకరాలు గత ప్రభుత్వం సేకరిస్తే రైతులకు భూములు తిరిగి ఇస్తాం అన్నది మీరు అంటూ.. రైతులకు న్యాయం చేసి ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పే వరకు వదిలిపెట్టేది లేదని కేటీఆర్ చెప్పుకొచ్చారు. లగచర్ల రైతులు 40 రోజులుగా జైల్లో ఉన్నారన్నారు. రైతు వీర్య నాయక్‌కు గుండె పోటు వస్తే బేడీలు వేసి ట్రీట్మెంట్ చేసిన దిక్కుమాలిన ప్రభుత్వమంటూ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు.
లగచర్ల రైతులకు బేడీల విషయంపై అసెంబ్లీ చర్చకు బీఆర్ఎస్ పట్టు..




లగచర్ల రైతులకు బేడీల విషయంపై అసెంబ్లీ చర్చకు బీఆర్ఎస్ పట్టుబట్టింది. పర్యాటక శాఖపై కాకుండా లగచర్ల రైతులకు బేడీల విషయంపై చర్చ చేపట్టాలని బీఆర్ఎస్ శాసనసభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్లకార్డులు పట్టుకొని బీఆర్ఎస్ శాసన సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఇదేం రాజ్యం అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. రైతులకు బేడీలు వేసిన ఫోటోలతో కూడిన ప్లకార్డులతో.. ఇదేమీ రాజ్యం.. దొంగల రాజ్యం.. దోపిడి రాజ్యం అంటూ నినాదాలు చేశారు. సభలో బీఆర్ఎస్ నిరసనల మధ్య సభను స్పీకర్ గడ్డం ప్రసాద్ రేపటికి వాయిదా వేశారు.
అసెంబ్లీ రేపటికి వాయిదా...
బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళనతో శాసన సభ లాబీలో భారీగా మార్షల్స్ మోహరించారు. అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బయటకు పంపించేందుకు యత్నించారు. లగచర్ల అంశంపై ఎందుకు చర్చ చేపట్టడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. లగచర్ల అంశంపై చర్చ చేపట్టేందుకు సర్కారు సుముఖంగా లేకపోవడంతో సభను రేపటికి వాయిదా వేశారు.
ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసిన బీఏసీ సమావేశం ..
మరోవైపు స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీఆర్ఎస్, ఎంఐఎం వాకౌట్ చేశాయి. ఎన్నిరోజులు సభ నడుపుతారో చెప్పడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. బీఏసీ లేకుండానే రెండు బిల్లులు చర్చపెట్టడం సంప్రదాయ విరుద్ధమన్నారు. సభ కనీసం 15 రోజులు నడపాలని కోరామని వెల్లడించారు. 3,4 రోజులు సభ నడుపుతామని ప్రభుత్వం చెబుతోందని హరీశ్‌రావు తెలిపారు. టీ షర్టులతో వస్తే ఎందుకు ఆపారని నిలదీశామన్నారు. టీష్టలతో పార్లమెంట్‌కు రాహుల్ వెళ్లట్లేదా అని నిలదీశారు.

# భూమిలేనివారికి రూ.6 వేలు

**విశ్వంభర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దాదాపు 5 గంటలకు పైగా కేబినెట్ సమావేశం జరిగింది. డిసెంబర్ 28న భూమిలేనివారికి రూ.6 వేలు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేసేలా మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. కేటీఆర్ ఈఫార్ములా రేస్ నిధుల బదలాయింపుపై విచారణకు గవర్నర్ ఆమోదం తెలిపారని ప్రభుత్వం వెల్లడించింది. న్యాయనిపుణుల సలహాలు తీసుకుని గవర్నర్ ఆమోదం తెలిపారని.. సీఎస్ ద్వారా ఏసీబీకి లేఖ పంపుతామని ప్రభుత్వం పేర్కొంది.



### ఈ-కార్ రేసు వ్యవహారంలో చట్టప్రకారమే దర్యాప్తు కొనసాగుతుంది

ఈకార్ రేసు వ్యవహారంలో చట్టప్రకారమే దర్యాప్తు కొనసాగుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కేటీఆర్‌ను విచారించేందుకు అనుమతి ఇప్పటికే లభించిందని, గవర్నర్ అనుమతి ఇస్తూ జారీ చేసిన దస్త్రాన్ని సోమవారం రాత్రి, లేదా మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏసీబీకి పంపిస్తారని చెప్పారు. చట్టప్రకారం ఏసీబీ దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "గవర్నర్ అనుమతిపై కేబినెట్‌లో చర్చ జరిగింది. ఈ వ్యవహారంలో జరిగిన దోపిడీపై కేబినెట్‌లో చర్చించాం. కేటీఆర్ అరెస్టుపై నేనేమీ చెప్పలేను. చట్టం తన పని తాను చేస్తుంది. బాంబు తుస్సుమందని ఇటీవల బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానించారు. అది తుస్సుమనేదైతే.. దిల్లీ చుట్టూ ప్రదక్షిణ ఎందుకు చేశారు? అసెంబ్లీలో ఎమ్మెల్యేల్లా కాకుండా గూండాల్లా ప్రవర్తించారు. మాట్లాడటానికి అంశం లేనందుకే ప్లకార్డులు, నినాదాలతో సభకు ఆటంకం కలిగించారు. ఈ సమావేశాల్లో ఆర్వోఆర్ బిల్లు ప్రవేశపెడతాం. ఇందిరమ్మ ప్రభుత్వంలో కక్ష సాధింపు ఉండదు. ప్రధానమైన అవినీతిని ప్రజల ముందు ఉంచుతున్నాం" అని పొంగులేటి తెలిపారు.
వారి అహంకారపూరిత మాటలకు నిదర్శనం
కేటీఆర్ ను అరెస్టు చేస్తే రాష్ట్రం అగ్నిగుండం అవుతుందనడం వారి అహంకారపూరిత మాటలకు నిదర్శనమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్షంగా విమర్శలు చేయడంలో తప్పు లేదన్నారు. కక్ష పూరితంగా కాంగ్రెస్ వ్యవహరించడం లేదని.. తప్పులను బయటకు తీసి చర్చలో పెట్టామని మంత్రి పేర్కొన్నారు. ఐఏఎస్ అరవింద్ కుమార్‌పై కూడా చర్యలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

## తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు సోమవారం ఇంటర్‌బోర్డు వెల్లడించింది. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం రెండు విడతల్లో ప్రాక్టికల్స్ జరగనున్నాయి. జనవరి 29న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష జరగనుంది.




### ఇంటర్ మొదటి సంవత్సరం..

05032025 సెకండ్ లాంగ్వేజ్ పేపర్1
07032025 ఇంగ్లిష్ పేపర్1
11032025 గణితం పేపర్1ఏ; బోటనీ పేపర్1; పొలిటికల్ సైన్స్ పేపర్1
13032025 గణితం పేపర్ 2బి; జువాలజీ పేపర్1; హిస్టరీ పేపర్1
17032025 ఫిజిక్స్ పేపర్1; ఎకనామిక్స్ పేపర్1
19032025 కెమిస్ట్రీ పేపర్1; కామర్స్ పేపర్1
21032025 పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్1; బ్రిడ్జ్ కోర్సు గణితం పేపర్1 (బైపీసీ విద్యార్థులకు)
24032025 మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్1; జాగ్రఫీ పేపర్1

### ఇంటర్ ద్వితీయ సంవత్సరం

06032025 సెంకడ్ లాంగ్వేజ్ పేపర్2
10032025 ఇంగ్లిష్ పేపర్2
12032025 గణితం పేపర్2ఏ; బోటనీ పేపర్2; పొలిటికల్ సైన్స్ పేపర్2
15032025 గణితం పేపర్ 2బి; జువాలజీ పేపర్2; హిస్టరీ పేపర్2
18032025 ఫిజిక్స్ పేపర్2; ఎకనామిక్స్ పేపర్2
20032025 కెమిస్ట్రీ పేపర్2; కామర్స్ పేపర్2
22032025 పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్2; బ్రిడ్జ్ కోర్సు గణితం పేపర్2 (బైపీసీ విద్యార్థులకు)
25032025 మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్2; జాగ్రఫీ పేపర్2

## ఘోర రోడ్డు ప్రమాదం..

**- ఛత్తీస్‌గఢ్‌లోని బలోద్ జిల్లాలో ఘటన**

**దౌండీ:** ఛత్తీస్‌గఢ్‌లోని బలోద్ జిల్లాలో దౌండీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌యూవీ, ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఏడుగురు మరణించగా, ఆరుగురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. గాయపడిన వారిలో మహిళలు, పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు. వారిని మెరుగైన చికిత్స కోసం రాజ్‌నంద్‌గావ్ జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఒక ఎస్‌యూవీ, ట్రక్కు ఎదురుగా ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరుగగానే ఎస్‌యూవీలో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన ఏడుగురిని తొలుత స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే వారి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని రాజ్‌నంద్‌గావ్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన మరో వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు.
ప్రమాదంలో దుర్పత్ ప్రజాపతి (30), యువరాజ్ సాహు (30), నలుగురు మహిళలు సుమిత్రా బాయి కుంభకర్ (50), మనీషా కుంభకర్ (35), సగున్ బాయి కుంభకర్ (50), ఇమ్లా బాయి (55), ఏడుగురు మృతి చెందారు. అదే సమయంలో ప్రమాదంపై ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.





# పోలవరం ఏపీకి జీవనాడి..

(మొదటి పేజీ తరువాయి)

ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. ప్రాజెక్టు రోడ్డు మార్గం ద్వారా నిర్మాణ ప్రాంతానికి వెళ్లి.. అక్కడి పనులు పరిశీలించారు. డయాఫ్రం వాల్ నిర్మాణ పనులపై ఆరా తీశారు. అనంతరం అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి, పోలవరం ప్రాజెక్టు పనుల షెడ్యూల్‌ను ప్రకటించారు.

**పోలవరం ఏపీకి జీవనాడి..**

పోలవరం ప్రాజెక్టు ఏపీకి జీవనాడి అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 7.20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు అందుబాటులోకి వస్తుందన్నారు. 28 లక్షల మందికి తాగునీరు, 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి సాధ్యపడుతుందన్నారు. విశాఖ పారిశ్రామిక అవసరాలు, తాగునీటికి 23 టీఎంసీలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. “ పోలవరం, అమరావతి రాష్ట్రానికి రెండు కళ్లు. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం చేస్తే రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ అవుతుంది. పట్టిసీమ ద్వారా కృష్ణా నదికి అనుసంధానం చేశాం. రాబోయే రోజుల్లో నేరుగా కృష్ణా నుంచి నాగార్జున సాగర్ కెనాల్‌కు అనుసంధానం చేయాలి. గొల్లపల్లి రిజర్వాయర్ వస్తే చాలావరకు ఇబ్బంది ఉండదు. వెలిగొండ ఇరిగేషన్‌కు కూడా నీళ్లు ఇచ్చే పరిస్థితి వస్తుంది. అక్కడి నుంచి బనకచర్లకు నీటిని తీసుకెళ్లొచ్చు.

రాష్ట్ర మంతటికీ ఉపయోగం..

నేరుగా నీటిని విశాఖకు కూడా తరలించి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, అక్కడి నుంచి వంశధారకు వెళ్తుంది. ఈ పనులన్నీ పూర్తి చేయగలిగితే రాష్ట్రంలో అన్ని జిల్లాలకు ఉపయోగం ఉంటుంది. శ్రీకాకుళం నుంచి కర్నూలు, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి వరకు నీటి సమస్య ఉండదు. ప్రాజెక్టు ప్రాముఖ్యత చూస్తే 50 లక్షల క్యూసెక్కులు డిశ్చార్జ్ చేసే సామర్థ్యం ఉంది. 93 మీటర్లు డయా ఫ్రం వాల్.. అత్యంత ఎత్తైన స్పిల్ వే గేట్లు ఏర్పాటు చేస్తున్నాం. బహుళ ప్రయోజనాల కోసం వినియోగించే ప్రాజెక్టు పోలవరం” అని సీఎం చంద్రబాబు తెలిపారు.

రేయింబవళ్లు పని చేశాం..

“ 2014 నుంచి 2019 వరకు రేయింబవళ్లు పని చేశాం. ముందుజాగ్రత్త చర్యతో 2014లో సీఎం కాగానే ఏడు ముంపు మండలాలు ఇవ్వకపోతే ప్రమాణం చేయనని చెప్పా. మొదటి కేబినెట్ పట్టుకొని 7 మండలాలు ఇచ్చిన తర్వాతే పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేశారు. ఒక్క రోజులో స్పిల్ ఛానల్‌లో 32,215 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి గిన్నిస్ రికార్డు కూడా బ్రేక్ చేశాం. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు రెండూ పూర్తి చేశాం. డయాఫ్రం వాల్‌ను 414 రోజుల్లో పూర్తి చేశాం. 2కి.మీ పొడవుతో దాదాపు 100 మీటర్ల డయాఫ్రం వాల్‌కు కూడా శ్రీకారం చుట్టాం. ప్రతి పనిని పీపీఏ, సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతిస్తూ వచ్చారు. 72 శాతం పనులు పూర్తి చేశాం. 28 సార్లు క్షేత్ర పరిశీలన చేశా. 82 సార్లు వర్చువల్‌గా సమీక్షలు చేశా. సోమవారాన్ని పోలవరంగా చేసుకొని సమీక్షలు చేశాం. గత ప్రభుత్వం 2019లో అధికారంలోకి రాగానే పోలవరం కాంట్రాక్టర్‌ను మారుస్తామని చెప్పారు. బలవంతంగా 2019 జులైలో నోటీసులిచ్చి సైట్ నుంచి వెళ్లిపోవాలని ఆదేశాలిచ్చారు. 15 నెలల పాటు ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టును సర్వనాశనం చేశారు. 50 లక్షల క్యూసెక్కుల నీళ్లు డిశ్చార్జ్‌కు మనం నిర్మాణాలు చేశాం. ఆగస్టు, అక్టోబరులో వరదలకు డయాఫ్రం వాల్ పూర్తిగా దెబ్బతింది. దాని తర్వాత పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు. పట్టించుకోలేదు. అసమర్థత, అవగాహన రాహిత్యం, అవినీతి, కుట్ర, అన్నీ కలిపి ప్రాజెక్టును నాశనం చేశారు.” అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పంజాబ్ బీజేపీలో భారీ చర్య

**పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన నేతలు**

**మాజీ క్యాబినెట్ మంత్రితో సహా 12 మంది నేతల సస్పెండ్..**



**చండీగఢ్:** పంజాబ్ బీజేపీ చాలా మంది నేతలపై చర్యలు తీసుకుంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కారణంగా మాజీ క్యాబినెట్ మంత్రితో సహా డజను మంది నాయకులను 6 సంవత్సరాల పాటు పార్టీ నుంచి బహిష్కరించింది. వేటు పడిన వారిలో భగత్ చున్నీలాల్ కూడా ఉన్నారు. ఆయన పంజాబ్ ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు.

పార్టీ నుంచి సస్పెండ్ చేసిన నేతల పేర్లు...

1. భగత్ చున్నీ లాల్ (మాజీ క్యాబినెట్ మంత్రి, పంజాబ్ ప్రభుత్వం)
2. అర్జున్ టెహన్
3. అనుపమ్ శర్మ
4. సుఖ్‌దేవ్ సోను
5. హతీందర్ తల్వార్
6. హసన్ సోని
7. దినేష్ దువా (సన్నీ దువా)
8. సుభాష్ ధల్
9. అజయ్ చోప్రా
10. ప్రదీప్ వాసుదేవ
11. గుర్విందర్ సింగ్ లాంబా
12. బల్వీందర్ కుమార్
13. ఇంద్రపాల్ భగత్ (ఘుధా)

భారతీయ జనతా పార్టీ పంజాబ్ ఇన్‌ఛార్జి, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ, జాతీయ కార్యదర్శి, కోఇన్‌చార్జ్ నరేంద్ర రైనా, ఇతర సీనియర్ నాయకులు చర్చించిన తర్వాత.. ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నాయకులను తక్షణమే పార్టీ నుంచి బహిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా.. అక్టోబర్‌లో బీజేపీ మాజీ ఎమ్మెల్యే సత్కర్ కౌర్‌ను కూడా పార్టీ సస్పెండ్ చేసింది. పార్టీ నుంచి 6 సంవత్సరాల పాటు బహిష్కరించింది. డ్రగ్స్ కేసులో పంజాబ్ పోలీసులు సత్కర్‌ను అరెస్ట్ చేయడంతో బీజేపీ ఈ చర్య తీసుకుంది. అక్టోబర్ 23న పంజాబ్ పోలీసులు సత్కర్ కౌర్ డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తుండగా పట్టుకున్నారు. ఈ కేసులో మొహాలిలోని యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. అంతే కాదు, అరెస్ట్ తర్వాత మాజీ ఎమ్మెల్యే ఇంటిని కూడా ముట్టడించారు.

### కౌశిక్‌రెడ్డి మొబైల్‌ను

# తిరిగి ఇచ్చేయండి..

### పోలీసులకు హైకోర్టు ఆదేశం

**విశ్వంభర, హైదరాబాద్:** బంజారాహిల్స్ సీఐ విధులకు ఆటంకం కలిగించారంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై నమోదైన కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయన మొబైల్‌ను తిరిగి ఇచ్చేయాలని పోలీసులను ఆదేశించింది. దర్యాప్తులో భాగంగా అతడి ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా మొబైల్‌ను లాక్కున్నారంటూ కౌశిక్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. మొబైల్‌ను ఎఫ్ఎస్ఎల్‌కు పంపాల్సి ఉంటుందని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన కుట్రలు పన్నుతున్నారని వాదించారు. ఫోన్ సీజ్ చేయాల్సి వస్తే నిబంధనల ప్రకారం నోటీసులిచ్చి తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది.



# మీరు జేఎన్‌యూలో చదివి ఉండవచ్చు..



**దిల్లీ:** రాజ్యసభలో రాజ్యాంగంపై వాడీవేడి చర్చ కొనసాగింది. ఈ నేపథ్యంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై విమర్శలు చేసిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విరుచుకుపడ్డారు. నిర్మలా సీతారామన్ జేఎన్‌యూ నుంచి పట్టభద్రురాలు, ఆర్థిక నిపుణురాలు కావొచ్చు గానీ.. ఆమె చర్యలు మాత్రం బాగాలేవంటూ విమర్శించారు.

“బీజేపీ విభజన సూత్రాన్ని నమ్ముతోంది. ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం కావాలి. భాజపా పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. నెహ్రూ, ఇందిరాగాంధీలను భాజపా కించపరుస్తోంది. దేశం కోసం భాజపా ఎప్పుడూ పోరాటం చేయలేదు. అలాంటి వ్యక్తులు నెహ్రూ గురించి మాట్లాడటం విడ్డూరం. రాజ్యాంగానికి భాజపా అనుకూలమా? వ్యతిరేకమా? ప్రాథమిక సమస్యల పరిష్కారానికి భాజపాకు ఆసక్తిలేదు. జాతీయ జెండా, రాజ్యాంగాన్ని ఎప్పుడూ గౌరవించని వారు.. రాజ్యాంగంపై మాకు పాఠాలు చెబుతున్నారు. అవాస్తవాలతో దేశాన్ని తప్పుదోవపట్టిస్తున్నారు. గోబెల్స్ కంటే కూడా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ తెచ్చిన ఆహార భద్రత చట్టం కొవిడ్ సమయంలో పేదలను ఆదుకొంది. రాజ్యాంగం బలోపేతానికి ప్రధాని ఏం చర్యలు తీసుకున్నారు? ఏం సాధించామో ఎవరికి వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి” అన్నారు.

“మనుస్మృతి ఆధారంగా లేదని రాజ్యాంగాన్ని ఆరెస్సెస్ వ్యతిరేకించింది. రాజ్యాంగాన్ని, జాతీయ జెండాను వారు అంగీకరించలేదు. 2002 జనవరి 26న తొలిసారి ఆరెస్సెస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎగురవేయాల్సిన తప్పనిపరిస్థితి ఎదురైంది. ప్రధాని నరేంద్ర మోదీ అవాస్తవాలు చెబుతున్నారు. ప్రజలకు రూ.15లక్షలు చొప్పున వేస్తానని అవాస్తవాలు చెప్పారు. రాజ్యాంగాన్ని బలోపేతం చేసేందుకు గత 11 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ ఏం చేశారు? 1971లో పాకిస్థాన్‌ను భారత్ ఓడించి తూర్పుపాకిస్థాన్‌కు (నేటి బంగ్లాదేశ్) విముక్తి కల్పించిన రోజు (డిసెంబర్ 16న)ను విజయ్ దివస్‌గా చేసుకొంటున్నాం. బంగ్లాదేశ్‌లో మైనార్టీలను ఆదుకోవడంలో ఇందిరా గాంధీని భాజపా నేతలు స్ఫూర్తిగా తీసుకోవాలి” అని సూచించారు.

# బంగ్లాదేశ్‌లో దాడులపై భారత్ గళం విప్పాలి: ప్రియాంకా గాంధీ

**దిల్లీ:** బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, హిందువులపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిపై లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ మాట్లాడారు. ఆ దాడులపై భారత్ గళం విప్పాలని కోరారు.

“బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందూ, క్రిస్టియన్‌లపై జరుగుతున్న దాడులపై భారత ప్రభుత్వం గళం విప్పాలి. ఆ దేశంతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దేందుకు అక్కడి ప్రభుత్వాన్ని కోరాలి” అని అన్నారు. విజయ దివస్ సందర్భంగా 1971 యుద్ధంలో అమరులైన వారికి లోక్‌సభ వేదికగా సెల్యూట్ చేశారు. ఆనాటి తూర్పు పాకిస్థాన్ (నేటి బంగ్లాదేశ్) పరిస్థితిని ఇందిరాగాంధీ ధైర్యంగా చక్కదిద్దారని కొనియాడారు.

సోనియా తీసుకున్న నెహ్రూ లేఖలు అప్పగించండి : రాహుల్‌ను కోరిన పీఎం మెమోరియల్

ప్రియాంకా బ్యాగ్ అందరి దృష్టిని ఆకర్షించింది. దానిపై ‘పాలస్తీనా’ అని ఇంగ్లీష్‌లో రాసి ఉంది. ఇజ్రాయెల్ దాడులతో దుర్భర పరిస్థితులను అనుభవిస్తోన్న పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ఆమె దానిని తీసుకువచ్చారు. ఇదిలా ఉంటే.. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్‌హసీనా దేశం విడిచివెళ్లిన తర్వాత బంగ్లాలో హిందూ మైనార్టీలపై



దాడులు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టుతో పరిస్థితి మరింత దిగజారింది. ఆయనకు న్యాయసాయం అందించడంపై కూడా ఆందోళనలు నెలకొన్నాయి.దీనిపై ఇటీవల విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడుతూ.. దాడులను నివారించడానికి ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం మైనారిటీలు, హిందువుల భద్రతకు తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఈవిషయంపై ఇటీవల భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి నేతలతో చర్చలు జరిపారన్నారు.

### సోనియా తీసుకున్న

# నెహ్రూ లేఖలు అప్పగించండి

### - రాహుల్‌ను కోరిన పీఎం మెమోరియల్

**దిల్లీ:** భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రాసిన లేఖల ను తిరిగి అప్పగించాలని ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ లైబ్రరీ (ప్రధానమంత్రి సంగ్రహాలయ)కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి లేఖ రాసింది. వాటిని 2008లో పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తీసుకున్నారని, తిరిగి అప్పగించే విషయంలో సహకరించాలని కోరింది.



నా ఎదుగుదలకు, పతనానికి గాంధీ కుటుంబమే కారణం

చరిత్రక ప్రాముఖ్యత కలిగిన నెహ్రూ లేఖల ను జవహర్ లాల్ నెహ్రూ మెమోరియల్ 1971లో నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీకి అప్పగించింది. అయితే 2008లో 51 బాక్సుల్లో ప్యాక్ చేసిన వాటిని సోనియాగాంధీకి పంపారు. అప్పటినుంచి అవి ఆమె వద్దే ఉన్నాయి. వాటిని తిరిగి అప్పగించాలని సెప్టెంబర్‌లోనే పీఎంఎంఎల్ కోరింది. మరోసారి రాహుల్‌కు డిసెంబర్ 10న అదే తరహా అభ్యర్థన చేసింది. కనీసం ఫొటో కాపీస్ లేక డిజిటల్ కాపీస్ అయినా అందించాలని అడిగింది. ఈ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.నెహ్రూ, ఎడ్వినా మౌంట్‌బాటెన్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, జయప్రకాశ్ నారాయణ్, పద్మజా నాయుడు, విజయ లక్ష్మీ పండిట్, అరుణా అసఫ్ అలీ, బాబు జగ్జీవన్ రామ్, గోవింద్ వల్లభ్ పంత్ వంటి ప్రముఖుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు వాటిలో ఉన్నాయి. జాతి నిర్మాణంలో కీలకభూమిక పోషించిన ప్రధానుల జ్ఞాపకాలతో ప్రధాని సంగ్రహాలయాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.



ఊరె ధనుంజయ భారతమ్మ నివాసంలో ఊరె మధు, ఊరె అశోక్ నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతానికి వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రిక ఛైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ హాజరై స్వామివారి దీవెనలు తీసుకున్నారు. ఆయన వెంట కాసం శేఖర్, మిర్యాల సాయినాథ్, కృష్ణారెడ్డి, కూర రమేష్ ఉన్నారు.

- విశ్వంభర, హైదరాబాద్






# ఒక కవి.. ఒక ఇల్లు.. ఒక సంకలనం

> మనిషిది అవసరాల ప్రాతిపదిక, కవిది భావాల ప్రాతిపదిక. అవసరాల నుంచి మనిషి వృద్ధి పొందితే, భావాల నుంచి కవి రూపు దిద్దుకుంటాడు. మనిషి అనుభవ సంపన్నుడు. కవి అనుభవ, అనుభావ సంపన్నుడు. నిదానంగా చలించే కవులుంటారు. ఆవేశంగా స్పందించే కవులుంటారు. ఆరాటంగా జీవించే కవులుంటారు. క్షణక్షణం కవిత్వాన్ని ప్రేమించి, కవిత్వాన్నే శ్వాసించే కవులు కొందరే ఉంటారు. అరమరికలు లేకుండా కవుల్ని, కవిత్వాన్ని, జీవితాన్ని, స్నేహాల్ని, బంధాల్ని భావోద్వేగంతో పలవరించే కవి ఎపుడో తప్ప కనబడడు. అట్లాంటి అరుదైన కవి జంగ వీరయ్య. ఎవరి ఇల్లయినా, ఏవేళయినా తలుపు తట్ట గలిగే అమాయకత్వం, ఏకవితోనైనా గలగలా ధారాళంగా మాట్లాడే భోళాతనం, ఒళ్ళంతా ఆరాట మున్న ఒకానొక కవి జంగవీరయ్య.

కవిత్వం లోతులు తరచి చూడక పోవచ్చు. కవుల ఎత్తులు తూచి చూడక పోవచ్చు. భాషా సంపద ఆర్జించక పోవచ్చు.. భావపుష్టి దొరకొనక పోవచ్చు. కవిత్వం పట్ల వల్లమాలిన మమకారం, కవులపట్ల తనను మాలిన గౌరవం. మనసుపడిందంటే చాలు ఆ పూట వందల కిలోమీటర్ల ద్విచక్ర వాహనమ్మీద ప్రయాణించి సాహిత్య సభలో సేదదీరటం. నాకు కనబడినంతలో ఒక్క జంగ వీరయ్యకే సాధ్యం. క్యాలి మళ్ళిందంటే చాలు, రాత్రికి రాత్రి ఏ కవిదగ్గరకో వెళ్ళి విశ్రమించడం వీరయ్యకే చెల్లు. పుస్తకం వెయ్యాలంటే వెయ్యాలి పుట్టిన ఊళ్లో సభ పెట్టాలంటే పెట్టాలి. ఊరిని ఒక్కటి చెయ్యాలంటే చెయ్యాలి. ఊరు మండలం కావాలంటే కావాలి. తలంపు కలిగిందే తడవుగా సాధ్యం చెయ్యగలిగే అరుదైన సాధ్య కవి జంగవీరయ్య. పనికి మారు పేరు, పట్టుదలకు మరోపేరు, పలవరింతకు చెరగనిపేరు వీరయ్య.

**అతనికి మరొకరి పోలిక లేదు**

ఎక్కువ చదువుకునే అవకాశం చిక్కలేదు వీరయ్యకు. కనుకనే తేటగా ఉన్నాడేమో. తరిగొప్పులను ప్రేమించాడు. జనగామాను ప్రేమించాడు. హైదరాబాదును ఆశ్రయించాడు. పని ఏదైనా పనే అనుకున్నాడు. లారీక్లీనరుగా, ప్రైవేట్ టీచరుగా, వీడియోగ్రాఫర్గా, లిఫ్ట్ కంపెనీ వర్కర్ గా పనులు వెతుక్కున్నాడు. తృప్తి వెతుక్కోబోయాడు.

ఊరు వదిలి పోయినా గాయం మానలేదు. పరాయి చోట్ల కిరాయి ఇండ్లు గాయ పర్చాయి. "చోటుమారడం ఒకరకమైన మరణమే" అని రాసుకున్నాడు. దూరమైన ప్రేమలు పిలిచాయి. బంధాలు తిరిగిరమ్మన్నాయి. తిరిగొచ్చాడు తరిగొప్పులకు,తరిగొప్పులలో నిలబడాలనుకున్నాడు. నిలదొక్కుకున్నాడు. ఉ నికి చాటుకోవాలనుకున్నాడు. చాటుకున్నాడు. కవి ఉనికి, కవి ఉన్నతి చాటి చెప్పాడు. వీరయ్య పట్టుదల అట్లాంటిది. తరిగొప్పుల షావుకార్ల నడుమ, రాజకీయ నాయకులనుడుమ, కులపెద్దల నడుమ, కూలీల నడుమ "కవి వీరయ్య" అనిపించుకున్నాడు. తలెత్తుకునే ఔన్నత్యం అక్షరం చేకూర్చింది. తనకొక ఉనికి, ఊరికొక ఉనికి అదొక తృప్తి. తరిగొప్పుల మీద పాట రాశాడు. పాడించాడు. అది ఊరికే గొప్ప.

కుటుంబం కుదుటపడిందేమో. ఇల్లు కావాలనుకొన్నాడు. కిరాయి కొంపల నుంచి, కంపలనుంచి బయట పడాలనుకున్నాడు. కవిగదా, కవి వీరయ్య కలగన్నాడు. సొంతింటికల. అంటుమామిడి తోటలు ఎటూ లేవుగనుక అత్త గారిచ్చిన ఒక్కమేకను అమ్మి పని ప్రారంభించాడు. కవిత్వమొక కల. ఇల్లు మరొక కల. కవి కల కవిత్వం వంటి నీడ. కవిత్వం వంటి కుటీరం. తీరా కవికల నెరవేరేవేళకి కవి లేడు. ఇల్లు తయారయ్యే రోజుకు ఇంటి యజమాని లేడు. 'ఇక్కువ' ఇంటి కవిత్వం. ఇదీ వీరయ్య కలే. ఇల్లూ, ఇంటి కవిత్వం నిజమైన సమయానికి వీరయ్యలేడు. కలగన్న కవి వీరయ్య ఇక కనబడడు. గలగల మాట్లాడే వీరయ్య, ఏ వేళయినా తలుపు తట్టే వీరయ్య ఎటు వెళ్లాడు? ద్విచక్రవాహనం చెప్పగలదా? సహచరి కవిత కళ్లలో సుడితిరిగే కన్నీరైన చెప్పగలదా? ఆఖరుకు ఈ కవులైనా చెప్పగలరేమో?

మానవ జీవన పరిణామ క్రమంలో "ఇల్లు" అతిగొప్ప ఆవిష్కరణ. మానవచరిత్రలో ఇల్లొక చరిత్ర. ఎంత సుదీర్ఘమైందో అంత విశేషమైన చరిత్ర"ఇల్లు"ది. చెట్ల మీద "శయ్య", పైకప్పు, గడ్డిగుడిశె, తడికెల గూడు, మిద్దె, మేడ, పెంకుటిల్లు, డాబా, భవనం, హర్మ్యం, సౌధం, ఏడంతస్థుల మేడ, ఇవాళిటి ద్యూపెక్సులు, విల్లాల దాకా రూపాంతరమేదైనా అది "ఇల్లే". ఊర్లు, నగరాలు శోభాయమానమైనది ఇండ్లతోనే. ఇంటి చుట్టూసంస్కృతి, ఇంటి చుట్టూరా నాగరికత, మనిషి స్థిర జీవితానికి, చిర బంధాలకు వరుసలకు, వంశాలకు, వారసత్వాలకు, భద్రతకు, కుటుంబానికి ఉనికి, చిరునామా "ఇల్లు". కొన్నిసార్లు ఆధిపత్యం ప్రస్ఫుటించినా, ఆప్యాయతలు వెల్లి విరిసేది "ఇల్లే". ఇల్లా? అంగడా? అన్నారు. అంగడికి భిన్నమైంది ఇల్లు. అమ్మకం కొనుగోళ్లకు తావులేనిది, అనురాగాలకు నెలవైంది ఇల్లు. వీరయ్య 'ఇల్లునే కాదు, 'ఇల్లు 'మీద కవిత్వ సంకలనం తేవాలని భావించాడు. 'ఇంటిపండుగ రోజు "ఇంటి" కవిత్వం అక్కడే అదేవూళ్లో ఆవిష్కరించాలని ఆరాటపడ్డాడు. అట్లా సేకరించిన కవితలే "ఇల్లు".

కవితలు మూడు ప్రధాన ధోరణలుగా సాగినాయి. కిరాయి ఇళ్లలో ఎదురయ్యే ఇబ్బందులు ఒక ధోరణి. సొంతిల్లు కలలు, సొంతింటి నిర్మాణం, సొంతింటి గొప్పదనం, తృప్తి, నిర్మాణంలోని కష్టాలు రెండో ధోరణి. ఊరు, చిన్నప్పటి ఇళ్లు, అనుబంధాలు, జ్ఞాపకాలు, ఇప్పటికొత్త ఇళ్లల్లోని యాంత్రికత, మనుషుల నడుమ దూరం, ఊరుకు పట్టణానికీ నడుమ వ్యత్యాసాలు మూడో ధోరణి.

చాలాసార్లు ఒకే అంశం మీద సృజనాత్మకతను కుదిస్తే వైవిధ్యం కొరవడుతుంది కదా అని ఆలోచిస్తుంటాంగానీ, అటు వంటి ప్రత్యేక సందర్భాల్లో ఆ వస్తువులోని సూక్ష్మకోణాలు అనేకం ఆవిష్కారమవుతాయి. అంతకు ముందు తట్టనివి, చూపు చొరబడని కొత్త అనుభవాలు కవిత్వంలోకివస్తాయి. కవుల చూపుల్లో ఉండే వైవిధ్యం, అనుభవాల్లో తొణికే భిన్నత్వం, వ్యక్తీకరణల్లో రూపుదిద్దుకునే విశేషాలు ఏకాంశ సంకలనాల్లో కనిపిస్తాయి. వైవిధ్యం, భిన్నత్వం, విశేష వ్యక్తీకరణలు పుష్కలంగా ఉన్న సరికొత్త కవితా సంకలనం "ఇల్లు". ఇప్పటివరకు 'ఇల్లు' అనుభవాలతో కవితలు వచ్చాయి గానీ, కవితాసంకలనం రాలేదనుకునుకుంటాను. వీరయ్య సంకలించిన "ఇల్లు" విన్నూత్నం, విశేషం. సంకలనాల వరుసలో ఇల్లు కవిత్వ సంకలనమొక ఆణిముత్యం.

ఇల్లంటే నాలుగోడలు, రెండు గదులు, రెండు తలుపులు, ఒక పై కప్పు కాదు, ఉండటానికి ఇంత నీడ మాత్రమే కాదు. మామూలు మనుషులకు మామూలు అర్థంలో అయితే అదే కావచ్చు. కానీ కవులకుకాదు. అంతకు మించిన ఆత్మీయత. ఆత్మలను కలిపి ఉంచే రాగబంధం. అతిశయోక్తికి ఇల్లే స్వర్గం, "ఇల్లంటే మనకోసం నిరంతరం కొట్టుకునే గుండెకాయ "అంటాడు వెన్నెల సత్యం. "ఇల్లు ఒకరికొకరి ఎదురు చూపు, కష్టాల కన్నీళ్ళ పంపక కేంద్రం" అన్నాడు ఏనుగు నరసింహారెడ్డి. "ఇల్లంటే ఒక పేగు బంధం" (ఆకాశ్). "ఇల్లంటే మనిషి ఆత్మగౌరవం" (వనపట్ల సుబ్బయ్య), "ఇల్లంటే కలల కూరాడు కుండ" (వి. శంకర్), "ఆత్మగౌరవపు నీలి జెండా" (వల్లిపట్టు నాగరాజు), "ఇల్లంటే ఇడుముల బాపెడుతల్లి"(తుమ్మల భాస్కరయ్య), "ఇల్లు నా రెండో తల్లి" (రజాహుస్సేన్), "ఆడపిల్లలు తుర్తిపడే నిలువ నీడ" (నాగిళ్ళ రమేశ్), "సున్న గోడల జాజు పట్టెల కల్ప వృక్షం"(ప్పుల రాజిరెడ్డి), పూర్వీకుల ఆశయాలు పునః ప్రతిష్ఠ చేసుకున్న సజీవ దృశ్యకావ్యం"(పొన్నాల బాలయ్య). అట్ల కవుల భావుకతల్లో సాగి సాగి మనిషి చుట్టూ ఇల్లు తిరిగిందో, ఇల్లు చుట్టూ మనిషి తిరిగాడో "మనిషే ఇల్లు" అని రూపకం చేశాడు నలిమెల భాస్కర్. ఇంకా విస్తరించి "నా దేశమనే ఇల్లు" అని మరో రూపకం చేశాడు పొట్లపల్లి శ్రీనివాసరావు.

దేశాన్ని ప్రేమించని కవి ఉండనట్టే ఊరును ప్రేమించని కవి ఉండడు. ఊరును ప్రేమించని కవి ఉండనట్టే ఇల్లును ప్రేమించని కవి ఉండడు. కవితల నిండా కవి ప్రేమ విస్తరించింది. అలంకారాలకు మించిన అనుభవాలు, వర్ణనలకు మించిన అనుబంధాలు, పదచిత్రాలు అందుకోలేని జ్ఞాపకాలు, పరవశాలు, పరివేదనలు పంక్తులనిండా అల్లుకపోయాయి.

ఇంత అపురూపమైన మనుషులకు ఇల్లులేక పోవటం ఒకవిషాదం. 'ఇల్లు జీవిత సఫలతకు సర్టిఫికెట్టు' (వల్లభాపురం జనార్దన్) గా మారటం వల్ల కాస్తో కూస్తో స్థిరపడ్డ తరువాత ఇల్లొక స్వప్నంగా మారుతుంది. మరొక పక్క కిరాయి ఇంట్లో అవస్థలు ఇంటిల్లిపాదినీ గాయపరుస్తాయి. రకరకాల ఆంక్షలు. విచిత్రమైన వేధింపులు, సున్నిత మనస్కులు తట్టుకోలేరు. "వాళ్లకు కోపమొచ్చినా మనమే పోవాల్నాయె, మనకు కోపమొచ్చినా మనమే పోవాల్నాయె" (లగిశెట్టి ప్రభాకర్). దినదినచిత్రవధ, కలిస్తే ఒక తీరు. వికటిస్తే మరొక తీరు పొమ్మనలేక పొగ పొయ్యేదాక పొగ. పొరపాటున జబ్బుపడితే కష్టం. కిరాయి ఇంటికి శవాన్ని రానివ్వరు. శవానికి చోటులేదు. చస్తే శవాన్ని బజార్లో ఉంచాలి. "మనిషి లేకున్నా శవానికి ఇల్లు ఉండాలి కదా "అంటాడు కేతిరెడ్డి యాకూబ్ రెడ్డి. చనిపోవాలంటే, ప్రశాంతంగా చావుకర్మ కొనసాగాలంటే చనిపోయేలోపున స్వంత ఇల్లు కలిగిఉండాలి. ఇల్లు లేకపోతే చావుకూడా సాగదు. ఎంత దుఃఖం? మనిషి పోయిన దుఃఖంలో ఇల్లు లేని దుఃఖం? మరొక దుఃఖం పుట్టిపెరిగిన ఇల్లును పంచుకునే దుఃఖం. పాత గోడల నడమ కొత్త గోడలు, ఆత్మీయతలు పంచుకున్నచోట హద్దులు పంచుకోవటం.

"ఇల్లును నాలుగు భాగాలు చేస్తున్నారని అనుకున్న గానీ, అనుబంధాలను కూడా ముక్కలు చేస్తున్నారని తెలియదు" (జంగ వీరయ్య). పాతగోడలు పొక్కలు పడినాకొద్దీ మన్నుతో మెత్తుతుంటారు. ఆగేదా అది? "ఎంత మెత్తినా మనసులోంచి స్మృతులు పెల్లలు పెల్లలుగా రాలిపడుతనే ఉంటాయి" (వేముగంటి మురళీకృష్ణ). కూలటం మొదలయిన తర్వాత గోడలు ఆగవు. కూలటం మొదలయిన తర్వాత ప్రేమలు ఆగవు. తరచుగా దుఃఖం ఆగదు..

కొత్తగా పెళ్లయిన జంట పెండ వాసనున్నదని కొద్దిసేపు కూడా కాలు నిలుపకుండ పోయిన అవమానాలు ఆస్వాదించిన కవి వేల్పుల రాజు. ఇల్లలికితే పెండ వాసన పడదని పట్టణ పుట్టిల్లాలు ఆడబిడ్డ మీద అలిగిన అన్న, పేరంటానికి పిలువని రక్తబంధం. చెడిన ప్రేమ.

ఈ ఇల్లు నీ ఉనికికి మాత్రమే కాదు, నా దుఃఖానికి చిరునామా. ఇల్లు నన్ను పువ్వు నుంచి కత్తిగా మార్చిన కార్ఖానా (గీతాంజలి). భిన్న స్థితిగతుల మధ్య "స్వంత ఇల్లు" ఒకస్వప్నం. స్వీయ అస్తిత్వం. చిరవాంఛ. స్థిరాస్తి. ఇరుగు పొరుగు మధ్యన, సహచరుల మధ్యన ఇల్లు మనిషి ఉ నికి. చిరునామా, గుర్తింపు. ఆధార్ కార్డు. కవి కలల సౌధం.

ఇల్లు కల కనడమంటే అప్పుల పుట్టలో తలదూర్చడం (యాకూబ్ రెడ్డి). తెలిసి తెలిసి తప్పదు, తలదూర్చక తప్పదు. పెళ్ళి కావలిసిన కూతురు గుర్తు చేస్తున్నా, స్థిరపడని కొడుకు అడ్డం వస్తున్నా కలకోసం తలతాకట్టు తప్పదు.

ఇల్లు కట్టేటప్పుడు పనివాళ్ల సతాయింపులు, పైసలు అందక పనులు ఆగిపోవటాలు, కొడుకుకు ఇల్లు కావాలని కన్నవాళ్లు పడే వ్యథ, ధరలు పెంచే మార్కెట్లు, తడిసిమోపెడు కష్టాలు. 'ఇల్లుకట్టిచూడు అన్నారు అనుభవజ్ఞులు'.

"కొత్తింట్లకు పోతే అందరూ పాలను పొంగిస్తరుకదా, మేము కన్నీళ్లను పొంగించినం" అంటాడు తగుళ్ల గోపాల్. కవి కన్నీళ్లకు అందరం కన్నీళ్ళపర్యంతం కావల్సిందే. కన్నీళ్లతోనయినా కల నెరవేరవచ్చు. బ్యాంకులు ఆగవుకదా "ఎప్పుడో వానాకాలం పడే పిడుగు ఇప్పుడు నెత్తి మీద నెలనెలా పడ్తాంది."

వాయిదాలకు వడ్లకొండ దయాకర్ వ్యక్తీకరణ హృదయ విదారకరం. సంబురం తీరకముందే పిడుగు మీద పిడుగు. రుతువుతో సంబంధం లేని పిడుగులు మనుషులే తట్టుకోవాలి. కోరికలకేం? ఇల్లు విశాలంగా ఉండాలని కోరిక. ఇరుకు ఇండ్లు చూసి ఉన్నాడు. విశాలమైన ఇండ్లు కవికి ఇష్టం కావచ్చు. ఇరుకిరుకు ఎందుకని?

ఇల్లు మన హృదయంలా విశాలంగా ఉండాల్సిందే? (కందాళై రాఘవాచార్య). ఇల్లు మళ్ళా మళ్ళా కడతామా? అప్పులు మెల్లగా తీర్చుకోవచ్చు? హృదయమంత విశాలంగా ఉండాలనేది కలే. దానికి అప్పులూ, వాయిదాలూ చావులదాకా. మరొక కవిది మరో అనుభవం. 'ఇరుకు ' ఇంటికి సంబంధించిందా? మనసుకు సంబంధించిందా?. "ఇల్లు విశాలమైతేమి? ఇరుకైతేమి? ఇల్లు ఇరుకనేమో ఏ అహంకారాలు మామధ్య అడ్డుగోడలు కాలేదు, సూదంత సందున్న ప్రేమలు ఎట్లనో మనసులోకి చొరబడాతాయి" ఆకాశ్ అనుభవమది. ప్రేమ అంటూ ఉండాలిగాని ఇల్లూ, మనసూ సర్దుకోవచ్చు. ఇల్లు విశాలమైన మనసు ఇరుకయితే కష్టం. ఇల్లు పెద్దదనే అహంకారంతోనే కష్టం. అందుకే జాబేరు పాషా అంటాడు, "కొత్తగా కట్టుకున్న రెండంతస్తులు హెూదానైతే పెంచాయి మనశ్శాంతి మాత్రం ఆ యింటితోపాటే మరణించింది." బిల్ల మహేందర్ హృదయ వేదన అటువంటిదే. కవికి కొత్తిల్లొక్కటే తృప్తినివ్వదు.

"బాపు బస్టాండు లో ఇల్లైతే కట్టిండు గని, ఎక్కడా మట్టివాసన రాలేదు, పలకరిద్దామంటే ఓ చెట్టూ పిట్టా లేదు". వారాల ఆనంద్ ఇలాంటి అనుభవమూ విచారకమైందే. 'ఇంట్లో గాలి ఆడదు. అంతా వైఫై పరచుకొని ఉంటుంది. నేనేమో నా యింట్లోనే భయం భయంగా ఓ మూలన కాల్రెక్కలు ముడుచుకొని కూచున్న." అని సాంకేతికత మనిషిని బాధించేతీరు వర్ణించాడు. "పాతిల్లు ఎంత నిమ్మలం గుండెదనీ గిప్పుడు గీ కొత్తింట్ల ఎన్ని సౌలతులున్నా నిమ్మలమైతే లేదు" అంటాడు పెట్లోజు సోమనర్సింహాచారి.

'నిమ్మలం' మనసుకు సంబంధించింది. అది పాతింట్లో, ఊరింట్లో, పుట్టింట్లో ఉండేది. శుభకార్యాల్లో సంతోషించడం, విషాదాల్లో రోదించడం, ఆడపిల్లను సాగనంపి దిగులు పడటం, కోడళ్ళను ఆహ్వానించి పరవశించటం ఆ ఇంటి స్వభావం. అది మానవ స్వభావం. ఊరి స్వభావం. డబ్బు చూసి మురవడం, హెూదా చూసి వస్తువులు చూపించి పరవశించటం, పోల్చుకొని గర్వించటం, తోటివారిని వెక్కిరించటం. స్వీయమోహం నగరస్వభావం, సరుకు స్వభావం. గతంలో ఇల్లువేరు. అంగడివేరు. అంగడి కంటే ఇల్లు గొప్ప. వర్తమానం మారింది. ఇల్లే అంగడి. అంగడి ఇంట్లో తిష్టవేసింది. ఇంట్లో విలసిల్లాల్సిన ప్రేమలు బజారున పడ్డాయి. రణగొణ ధ్వనుల్లో దేన్నో గాలిస్తున్నాయి.

జ్ఞాపకంలో ఉన్న ఇల్లు ఒకటి. వాస్తవంగా ఉంటున్న ఇల్లు మరొకటి. రెంటి నడుమ కవి రెప రెపలాడుతున్నాడు. ఇల్లు ముందు అరుగులు మరి ముందు వాకిలి. వాకిలి ఆనుకుని కోళ్ల గూడు, వాకిలి పక్కన కోళ్ళు అటుపక్కన కొన్నిసార్లు పశువులదొడ్డి, మరి కొన్ని చోట్లు మేకలుగొర్లు తరుచుగా వాటి అరుపులు ఎదురుగా రెండు నీడ చెట్ల అల్లన గాలిఊగే గూడు, గూటికి చేరే కిలకిల పిట్టలు, ఇంటెనుక రెండు పూల చెట్లు మధ్యాహ్నమో, సాయంత్రమో జిగేల్ మనే రంగులు, సువాసనలు, ఒకటో అరో కూరగాయల తీగలు, మరో రెండు పండ్ల చెట్లుఅయిందా? నిమ్మలమయిందా? అనుకుంటే కూకట్ల తిరుపతి మరింత చేర్చాడు. "సుట్టాలూ, పక్కాలూ, కట్టనిట్టూరాల కల బోతలు, అచ్చెగాళ్ల, బిచ్చగాళ్ల దీవనార్లులు". ఇవన్నీ గుర్తు కొస్తుంటే కవి హృదయ జీవి గదా, నిమ్మలంగా ఉండగలడా? కలత పడకుండా మనగలడా ? కలత పడకుండా కవి కాలేదు. కలవరించకుండా ఉండలేడు కవి. ఇల్లయినా ఊరయినా దేశమయినా కలతలోంచే ప్రేమ. కలత నుంచే కవిత. "ఇల్లు" జంగ వీరయ్య కోరిక. ఇంటిపని, సంకలనం పని పూర్తి చేసి పరవశించాలనుకున్నాడు. కవులను కొత్త ఇంటికి ఆహ్వానించి కొత్తపుస్తకం అందించాలనుకున్నాడు. కాలానికి కన్నుకుట్టింది. వీరయ్య కలలను చెదరగొట్టింది.. వీరయ్య ఇంటికలను కుటుంబం పూర్తిచేసింది. 'ఇల్లు' సంకలన కలను కవి బలగం సాకారం చేస్తున్నది. అక్షరాలు ఒలికే ప్రేమల్ని ఆత్మీయులు దోసిట పడుతున్నారు. తడిసి తన్మయమవుదాం. మన పనుల్లో, పదాల్లో వీరయ్య మెరుస్తాడు. తప్పక మురుస్తాడు.

కలను సాకారం చేసిన కవి మిత్రులకు సంపాదక మండలికి, సహృదయులకు, సంఘాలకు, శాఖలకు, కార్యదక్షులకు అభినందనలు. జంగ వీరయ్యకు నిజంగా ఇది అచ్చమైన నివాళి. అచ్చరమైన నివాళి.






- నందిని సిధారెడ్డి,
తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు హైదరాబాదు.




మేథో మథన

# ప్రతిఫలమే కవిత్వం

"శక్తివంతములైన భావములు సహజంగా ఉప్పొంగుటయే కవిత్వం" (Poetry is the spontaneous over flow of powerful feelings) అని వర్డ్స్ వర్త్ చెప్పారు. కాబట్టి కవిత్వం బొత్తిగా హృదయ గతమైన ప్రక్రియ. కవిత్వం ఒక కళాత్మకమైన నిర్మాణం. కవి ఒక సన్నివేశంతో గానీ, ఒక సంఘటనతో గానీ, ఒక వస్తువుతో గానీ సంలీనం చెందితేనే కవిత్వం పెల్లుబుకుతుంది. ఆ పరంపరలోనే యువకవి గంటె సాంబమూర్తి యాదవ్ కూడా తన జీవితానుభవాలను, అనుభూతులను కవితా కుసుమాల మాలగా కూర్చాడని చెప్పవచ్చు. ఈయన అల్ప అక్షరాలలో అనల్ప భావాలను చాలా చక్కగా చెక్కాడు. పదాలనే వాక్యాలుగా పేర్చిన తీరు ఆకట్టుకుంటుంది. సులభమైన మాటలతో సులువుగా కవిత్వం చెప్పాడు కూడా. కవిత్వం అనే మాటకు మాటలల్లుట అనే అర్థం ఉంది. అంటే మాటలను లేక పదాలను అర్థవంతంగా, ఆలోచనాత్మకంగా, ఆకర్షణీయంగా, క్రమబద్ధంగా పొదగడమే కవిత్వం. కఠినమైన,జటిలమైన సంస్కృత సమాస భూయిష్టమైన పదాలతో, పదబంధాలతో కవిత్వం రాసినవారూ ఉన్నారు. రాస్తున్నవారు కూడా ఉన్నారు. అలాంటి రచనలు పండితుకు మాత్రమే పరిమితం. దాంతో కవిత్వ ప్రయోజనం నెరవేరకపోవచ్చు. కానీ అలతి అలతి పదాలతో లలిత మనోహరంగా సాంబమూర్తి యాదవ్ చేసిన అక్షరాల అల్లికనూ ఆధునిక వచన కవిత్వరూపమని చెప్పవచ్చు. ఇదే అసలు సిసలైన కవిత్వం. అందరికీ చేరువయ్యే కవిత్వం. ఇలాంటిదే అత్యాధునిక కవిత్వం. సూటిగా, స్పష్టంగా ఉన్న రచనలు అందరికీ, ఇట్టే అర్థమవుతాయి. సాంబమూర్తి యాదవ్ రచనా శైలి సరళమైనది. ఈయన రచనలు సామాన్య పాఠకులకు అలవోకగా చేరువవుతాయి. ఇవి పాఠకులను ఆలోచింప చేస్తాయి. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నడుచుకోవడానికి ప్రేరేపిస్తాయి కూడా. దీంతో సామాజిక ప్రయోజనాన్ని అల్కగనే సాధించవచ్చు.

తన ఆలోచనలను, అభిప్రాయాలను పంచుకోవడానికి సాంబమూర్తి యాదవ్ "మినీ కవితా" రూపాన్ని ఎంచుకున్నాడు. మినీ కవిత అంటే ఏదైనా ఒక అంశాన్ని కొసమెరుపుతో చెప్పడం. వ్యంగ్యంగా, చురకలతో తక్కువ పంక్తుల్లో చెప్పడమే మినీ కవిత. ఈ ప్రక్రియ పాఠకుల్లో ఆలోచణాదృకృథాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తుంది. సాంబమూర్తి యాదవ్ కవిత్వం సమాజానికి దర్పణం పడుతుంది. సంఘాన్ని ప్రభావితం చేస్తుంది. మేలుకొలుపుతుంది. మెరుగైన సమాజ నిర్మాణానికి పురికొల్పుతుంది. ఈ చిరు పొత్తంలో మొత్తం 86 కవితలు ఉన్నాయి. ఇందులో 44 తెలుగు మిని కవితలతో పాటు 42 ఆంగ్ల కవితలు ఉండటం విశేషం. సాంబమూర్తి యాదవ్ శాంతిభద్రతలను కాపాడే పోలీసు వృత్తిని దైవ సమానంగా నిర్వర్తిస్తూనే, మరోపక్క సమాజానికి ఆనందం, సందేశాలను అందించే రచనా ప్రవృత్తిని కలిగి ఉండటం అభినందనీయం. సాంబమూర్తి యాదవ్ సమాజాన్ని అధ్యయనం చేసినట్టే, ఆధునిక వచన కవిత్వాన్ని ఇంకా లోతుల్లోకి వెళ్ళి తరచి చూడాల్సిన అవసరముందని భావిస్తున్నాను. ఇది ఆయన తొలి పుస్తకం కాబట్టి గుణదోషాలను ఎత్తి చూపాల్సిన పని లేదు. మునుముందు సాంద్రత గలిగిన, గాఢతతో కూడిన కవిత్వ సంపుటులు వెలువరించగలడనే విశ్వాసం నాకుంది. ఆయనకున్న పట్టుదలకు, అధ్యయనశీలతకు, సాహితీ పిపాసకు ఈ పుస్తకమే ఒక నిదర్శనం. సాన బెడితేనే వజ్రం వెలుగులీనుతుంది కాబట్టి కవిత్వం చదువడం, రాయడం ఈ కవికి నిత్య కృత్యం కావాలని కోరుకుంటున్నాను. యువ పోలీసు కవి గంటె సాంబమూర్తి యాదవ్ కు తెలుగు సాహితీ లోకంలోకి స్వాగతం పలుకుతున్నాను.

సెలవిప్పటికీ, స్నేహమెప్పటికీ.



- కూకట్ల తిరుపతి
రాష్ట్ర ఉపాధ్యక్షులు, తెలంగాణ రచయితల వేదిక.
సెల్: 9949247591

# సీఆర్పీల క్రమబద్ధీకరణకు మోక్షం వచ్చేనా ?

- జాడలేని సమాన పనికి-సమాన వేతనం
- సిఎం హామీ ఇచ్చిన పరిష్కారం కాని సమస్యలు
- ప్రజా ప్రభుత్వంలో కూడా మారని జీవితాలు



చాలీ చాలని వేతనాలతో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సర్వీసు క్రమబద్ధీకరణ కోసం ఆందోళన బాట పడుతున్నారు. ఏళ్ల తరబడి సమగ్ర శిక్ష విభాగంలో చాలీచాలని వేతనాలకు పనిచేస్తున్న తమ సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు.



**విశ్వంభర, హైదరాబాద్:** విద్యాబుద్ధులతో సమాజ అభివృద్ధి సాధ్యం అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం వందల కోట్లు వెచ్చిస్తున్నాయి. విద్యాశాఖలో పనిచేసే ఉపాధ్యాయులకు కార్యాలయ సిబ్బందికి భారీగా వేతనాలు ఉద్యోగ భద్రత కల్పిస్తుంది.వారితో పాటే ..అక్కడ విధులు నిర్వహిస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్లపై కనికరం చూపడం లేదు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 20011 లో కాంగ్రెస్ ప్రభుత్వం వున్నప్పుడే విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్షా పథకం కింద 2032 మంది సిఆర్పిలుగా నియామకం కాబడ్డారు . తెలంగాణ రాష్ట్రంలో తమకు మంచిరోజులొస్తాయని భావించిన లాభం లేదని,గత ముఖ్యమంత్రి కెసిఆర్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశాడని సీఆర్పీలు గగ్గోలు పెడుతున్నారు.ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు 13,సెప్టెంబర్ ,2023 లో హన్మకొండలో జరిగిన సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మెకు మద్దత్తు తెలుపుతూ సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు కేసిఆర్ ను గద్దెదించడానికి ప్రతి రోజూ గంట అదనంగా పనిచేయాలని ,మేము అధికారంలోకి వస్తే 100 రోజుల్లో మీ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని,సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని,భవిష్యనిది,మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు వంటి సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.ప్రభుత్వం తలుచుకుంటే మీ సంఘాలతో మీటింగ్ పెట్టి పరిష్కరించే గలిగె సమస్యలను చాయ్ తాగే లోపు జీవో ఇచ్చి పరిష్కరించి పంపవచ్చు అన్నారు.కాని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేరలేదని వాపోతున్నారు. తాము శ్రమ దోపిడీకి గురవుతున్నామని చాలీచాలని వేతనాలతో బతుకు బండి లాగాల్సి ఉన్న పరిస్థితి తలెత్తుతుందన్నారు. తమకు ఎటువంటి ఉద్యోగ భద్రత కల్పించకపోగా సుప్రీంకోర్టుతీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమ జీవితాలను బుగ్గిపాలు చేయకుండా దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.2011లో ఎమ్మార్పీ వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం విద్య హక్కు చట్టం సెక్షన్ 25(1),25(2) ప్రకారం పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు బోధనేతర పనులు చేయడానికి వీలులేదు. సెక్షన్ 27 మినహా జనాభా లెక్కలకు, ఎన్నికల నిర్వహణ,అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఉపాధ్యాయుల సేవలను ప్రభుత్వం వినియోగించుకుంటుంది. అందువల్లనే ఎమ్మార్పీ వ్యవస్థను రద్దు చేసి సిఆర్పిల వ్యవస్థను ప్రభుత్వం సర్వశిక్షాభియాన్ ద్వారా సిఆర్పిలను నియమించడం జరిగింది. ఈ వ్యవస్థలో పనిచేసే సీఆర్పీలను నియమించడానికి డిగ్రీతో పాటు బిఇడి లేదా టిటిసి,టెట్ ఉన్న వారిని నియమించడం జరిగింది.వీరి వేతనాలను కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వం 60:40 నిష్పత్తిలో చెల్లించాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చే నిధుల నుండి మాత్రమే గౌరవ వేతనం చెల్లిస్తున్నారు.సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమాన పనికి సమాన వేతనం సీఆర్పీలకు అమలు చేయడం లేదు . సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం క్లస్టర్ రిసోర్స్ పర్సన్లకు స్కూల్ అసిస్టెంట్ లతో సమానంగా వేతనం ఇవ్వాల్సి ఉంది కానీ కాంగ్రెసు ప్రభుత్వం ?19500/- మాత్రమే ఇస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.ఒక్కో కాంప్లెక్స్ లో సుమారు 18 పాఠశాలలు ఉంటాయి.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 1817 కాంప్లెక్సులు ఉండగా 2032 మంది సీఆర్పీలు పనిచేస్తున్నారు.

**సీఆర్పీ విధులు :**

బడి బయట పిల్లల సర్వే చేసి ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం ద్వారా పిల్లలను బడిలో చేర్పించడం, పాఠశాలలను సందర్శించి నివేదికను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, ఎంఇఓలకు అందజేయడంతో పాటు సమాచారం ఆన్లైన్లో పొందుపరుస్తారు. ప్రతినెలా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించి,కాంప్లెక్స్ పరిధిలోని అన్ని రకాల రిజిస్టర్లను అందుబాటులో ఉంచుతారు. ఏకోపాధ్యాయ పాఠశాల ఉపాధ్యాయులు హాజరు కాని పక్షంలో ఆ రోజు పాఠశాల విధులను సీఆర్పీలు నిర్వర్తిస్తారు. పాఠశాల సంసిద్ధత కార్యక్రమాల అమలు తీరు,మధ్యాహ్న భోజనం పనితీరును ప్రతినిత్యం పరిశీలించాలి .మరుగుదొడ్లు, స్కూల్ జీఐఎస్ ఛాయాచిత్రాలను అప్లోడ్ చేయడం విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్, పరీక్ష పేపర్లు అందేలా చూడటం వీరి బాధ్యత, గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "మన ఊరు-మన బడి" కార్యక్రమం,ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనితీరు,అభివృద్ధి పనులు,పేరెంట్స్ టీచర్ల మీటింగ్ల పర్యవేక్షణ,చదువు-ఆనందించు-అభివృద్ధి చెందు(రీడ్) కార్యక్రమం పర్యవేక్షణ, స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం,స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల ప్రతి 2 నెలలకు నిర్వహించడం, ఎంఈఓ మరియు డిఈఓ కార్యాలయాలకి ఎప్పటికప్పుడు రిపోర్ట్ లు అందజేస్తుంటారు. హరిత హారం,సమగ్ర కలగణన సర్వే వంటి కార్యక్రమాలలో సీఆర్పీలు చురుకుగా పాల్గొంటున్నారు . విధి నిర్వహణలో భాగంగా సీఆర్పీలు పాఠశాలలు పర్యవేక్షిస్తూ సమాచారం సేకరిస్తూ ఎమ్మార్సీ నుండి కాంప్లెక్స్ నుండి పాఠశాలకు ప్రతినిత్యం చక్కర్లు కొట్టాల్సి ఉంది.ప్రతిరోజూ 20-30 కిలోమీటర్లు కాంప్లెక్స్ పరిదిలో సీఆర్పీలు ప్రయాణం చేయాల్సి ఉంది.ఉపాధ్యాయులకు ప్రతినిత్యం చరవాణి ద్వారా మెసేజ్ లో మరియు సంభాషణ ద్వారా సమాచారం అందిస్తూ ఉంటారు.గతంలో ఎమ్మార్పీ వ్యవస్థ ఉన్నప్పుడు వారికి రవాణా భత్యం , ఫోన్ బిల్లులు చెల్లించేవారు. కానీ ఇప్పుడు సీఆర్పీలకు చెల్లించడం లేదు.అనేక రకాల పనులు చేస్తున్న సీఆర్పీలకు వేతనం తక్కువగా చెల్లించడం, రవాణా భత్యం(టీఏ),ఫోన్ బిల్లులు చెల్లించకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా విధి నిర్వహణలో 15 మంది క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు చనిపోగా అందులో 8 మందికి రోడ్డు ప్రమాదాలు జరగగా 4 సీఆర్పీలు చనిపోగా,మరో నలుగురుకి తీవ్ర గాయాలయ్యాయి.మిగితా వారు కరోనా సమయంలో మరియు ఇతర అనారోగ్య కారణాలతో మరణించారు.కాని ప్రభుత్వం నేటికీ ఏ ఒక్కరిని ఆదుకోలేదు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయి. అందరూ చదవాలి- అందరూ ఎదగాలి అంటున్న సమగ్ర శిక్షాలో సీఆర్పీల జీవితాలను బుగ్గిపాలు చేయకుండా దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్న సీఆర్పీల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం తీర్పు ప్రకారం పదకొండో పీఆర్సీ పేస్కేలును అమలు చేసి వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## సీఆర్పీలకు బేసిక్ పే అమలు చేయాలి



ప్రభుత్వం ఎన్నికల ముందు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీలిచ్చింది. కాని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం పథకం పేరిట సీఆర్పీలను రెగ్యులర్ చేయకుండా కాలం వెళ్లదీస్తున్నారు.సీఆర్పీలను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని కోరుతున్నాం.అప్పటి వరకు మినిమం టైం స్కేల్ అమలు చేసి,ఉద్యోగ భద్రత కల్పించాలని,భవిష్యనిధి నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలి.

– తిరందాస్ సంతోష్ కుమార్, తెలంగాణ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అసోసియేషన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

## వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి



కేజీబివి కాంట్రాక్టు ఉద్యోగులకు ఇచ్చిన మాదిరిగానే సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులకు కూడ 6 నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు,మహిళా ఉద్యోగులకు 27 రోజుల సాధారణ సెలవులు ఇవ్వాలి.

– నవనీత రెడ్డి, టీసీఆర్పీఏ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు

## అక్షర ఫౌండేషన్ కార్యవర్గం ఎన్నిక





**విశ్వంభర, సూర్యాపేట:** అక్షర ఫౌండేషన్ సూర్యాపేట కార్యవర్గం 2025 ఎన్నికలు అక్షర ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షులుగా ఉప్పు నాగయ్య' ప్రధాన కార్యదర్శిగా రుద్రంగి కాళిదాసు, కోశాధికారిగా యాస శృతి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అక్షర ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి తెలిపారు. అక్షర ఫౌండేషన్ 2008 సంవత్సరంలో స్థాపించామని, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కార్యవర్గం ఎన్నికలు ఉంటాయని, ఈ కార్యవర్గం రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని తెలిపారు. మా అక్షర ఫౌండేషన్ విద్య,వైద్య, క్రీడా,సాంస్కృతిక,సామాజిక, పర్యావరణ రంగాలలో సేవలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యవర్గ సమావేశంలో నరాల తిరుమలరెడ్డి, నెల్లుట్ల పాపయ్య, వై.సుభాష్ చంద్రబోస్, వీర్లపాటి వెంకన్న, సోల్లేటి ఉపేంద్ర చారి, షేక్ నజీర్ బాషా, మదూరి హనుమాచారి, కె సైదులు ధరావత్ లకుపతి, ధరావత్ వీరాసింగ్, రాచకొండ నాగయ్య, మద్ది వినయ్ రెడ్డి షేక్ యూసఫ్, అనుమల వెంకటేశ్వర్లు మొదలగువారు పాల్గొన్నారు.

# ఘనంగా వాసవి గ్రూప్స్ అధినేత యెర్రం విజయ్ కుమార్ జన్మదిన వేడుకలు

**బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రి వద్ద అన్నదానం చేసిన వామ్ జాతీయ సలహాదారు కౌటికే విఠల్**





**విశ్వంభర, బంజారాహిల్స్:** ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆల్ ఇండియా విభాగం ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, వాసవి గ్రూప్స్ అధినేత, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జాతీయ నాయకులు యెర్రం విజయ్ కుమార్ 60వ జన్మదినాన్ని పురస్కరించుకొని బసవ తారకం క్యాన్సర్ హాస్పిటల్ బంజారాహిల్స్ వద్ద క్యాన్సర్ భాధితులకు, బాధిత కుటుంబ సభ్యులకు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జాతీయ సలహాదారులు, కౌటికే విఠల్ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత హాజరై అన్నదానంలో పాల్గొని పలువురికి వారి చేతుల మీదుగా దగ్గరుండి భోజనం వడ్డించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వ్యాపార పరంగానే కాకుండా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ఎంతోమందికి అండగా ఉంటూ వైశ్యులలోనే కాకుండా ఇతర కులాలకు దగ్గరగా ఉంటూ అందరిని ఆదుకునే వ్యక్తి అని కొనియాడారు. ఇలాంటి సామాజికవేత్త, వ్యాపారవేత్తగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ముందుకు సాగుతూ తన జీవన ప్రయాణంలో 60వ వసంతంలో అడుగుపెడుతున్న సందర్భంగా వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే యెర్రం విజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని రోగులకు, ఇతరులకు అన్నదానం చేయడం చాలా సంతోషంగా ఉందని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జాతీయ సలహాదారులు, కౌటికే విఠల్ అన్నారు. వ్యాపారవేత్తగానే కాకుండా ఎంతోమంది దీనులకు, అభాగ్యులకు అండగా ఉండి ఆదుకోవడం, ఎన్నో స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు చేస్తూ వైశ్యులలో గొప్ప స్థాయిలో ఉండడం గర్వించదగిన విషయమన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో చేసుకోవాలన్నారు. అన్నదాన కార్యక్రమంలో వెయ్యి మందికి పైగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

- టీఎఫ్టీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ ముట్టడి
- అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్



**విశ్వంభర, మహబూబ్ నగర్ :** అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ముందు టీఎఫ్టీయూ ఆధ్వర్యంలో నాయకులు ముట్టడి చేశారు. ఈ సందర్భంగా టీఎఫ్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ఖలీల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 2012లో 523 సర్వే నంబర్లలో ప్రభుత్వం పట్టాలిచ్చిందన్నారు. అలాగే 2018లో డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ఇంటి పట్టా సర్టిఫికెట్స్ స్వాధీనం చేసుకొని అర్హులుగా ప్రకటించిన 586 మందికి తక్షణమే డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి ఇళ్లు నిర్మాణం చేసి ఇవ్వాలన్నారు. అలాగే అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారులతో పాటు నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు న్యాయం చేయాలని, పేదలను ఆదుకోవాలని తహసీల్దార్ కార్యాలయం ముట్టడించారు. 523 సర్వే నంబర్లు ప్రభుత్వం నివాస స్థలం పట్టా సర్టిఫికెట్లు మంజూరు చేసింది. అనేక ఇబ్బందులను సహించి ఎన్నో రకాలుగా ఎన్నోసార్లు విచారణ జరిపి అర్హులుగా ప్రకటించిన అప్పటి జిల్లా కలెక్టర్ రోనాల్డ్ రోస్ ఆదేశాలు మేరకు పట్టా సర్టిఫికెట్లు స్వాధీనపర్చాలని సందేశం ఇచ్చారు. పట్టాలు పొందిన ప్రజలు ఇళ్లు పొందుటకు అర్హత ఉన్న 886 మందిని నిర్ధారిస్తూ జాబితా విడుదల చేశారు. వీరికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. దివిటిపల్లి, వీరన్నపేట, క్రిస్టియన్ పల్లి గ్రామాలలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం జరిగిందని, వాటి పంపకంలో ప్రాధాన్యత కలిగిన అర్హులకు కాకుండా అవినీతి అక్రమాలకు పాల్పడి అప్పటి మంత్రి, ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై ఎలాంటి విచారణ జరపకుండా సొంత ఆస్తి మాదిరిగా అర్హత లేని వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే అదునుగా అధికారులు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేశారన్నారు. పట్టా సర్టిఫికెట్లు ప్రభుత్వానికి స్వాధీనపరిచి నివాస స్థలం కోల్పోయిన పేదలు దీనంగా న్యాయం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో తమకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశ పెట్టుకున్న పరిస్థితి ఉందన్నారు. ప్రజలు, దళిత, బహుజన శ్రామిక వర్గాల కుటుంబాలు పాల్గొన్నారు. అర్బన్ తహసీల్దార్ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని అర్హత లిస్టు ప్రకటించిన వారందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఃటిఎస్టియు జిల్లా అధ్యక్షులు పి విజయకుమార్, జి ఘటన చైతన్య, మహిళా సంఘం జిల్లా నాయకులు శ్రీదేవి, జలాల్ పాషా, బి కృష్ణయ్య, ఎండి బషీర్, లలిత, లక్ష్మీదేవి, మాధవి, గాయత్రి, యాదమ్మ, లక్ష్మి, అరిఫా బేగం, షరీఫా బేగం, నాగరాజు, కవిత, నాగమణి, ఎస్కే మాధవి, పావని, జ్యోతి, ఫర్జానా బేగం, సత్తెమ్మ, ఎంఈఓ బజీద్, శ్రీను నాయక్, పాండయ్య గౌడ్, పరశురాం, ఎస్ బాలరాజు, బి సరిత, డి ఆంజనేయులు మమత, సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు.

## బోయి భీమన్న ఘన నివాళి



**విశ్వంభర, కర్నూలు:** ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా మంత్రాలయం లోని పరిమళ విద్యా నికేతన్ లో నిర్వహించిన కళా వేదిక 142వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, పద్మభూషణ్ బోయి భీమన్న వర్ధంతిని పురస్కరించుకుని కవులు, రచయితలు భీమన్న చిత్రపటానికి పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కళా వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ సామాజిక దృక్పథంతో మానవీయ కోణంలో చైతన్యం ఉద్భవించేలా సామాన్య వాడుక భాషలో కవిత్వం రాయాలని అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ కార్యదర్శి ఫిజిక్స్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ శ్రీ శ్రీ మహాప్రస్థానం వచ్చి 75 వసంతాలు అయ్యాయని,అయినా శ్రీ శ్రీ సాహిత్యం కొన్నితరాలకు కొన్ని దశాబ్దాలుగా స్ఫూర్తినిస్తూనే ఉందని, మహాప్రస్థానం పుస్తకాలను నేటితరం విద్యార్థులకు బహుమతులుగా అందజేయాలని అన్నారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కవులు సామాజిక కోణంలో తమ గళాన్ని వినిపించారు. కర్నూలు జిల్లా కమిటీ వారు కవులందరికీ శాలువా, జ్ఞాపిక మరియు ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కత్తిమండ ప్రతాప్, ఈశ్వరీ భూషణం, డా.పార్థసారథి, ఫిజిక్స్ అరుణ్ కుమార్, రాకేష్, డా.నాయకంటి నర్సింహ శర్మ, మళేకర్ నాగ జ్యోతి, సువర్ణ జోషి, డా.బల్లారి ఉమాదేవి, కేశవయ్య దాసరి, నాగేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి నుంచి రేషన్ కార్డుల పంపిణీ

- తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు
- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కీలక ప్రకటన

**విశ్వంభర, హైదరాబాద్:** కొత్త రేషన్ కార్డుల కోసం తెలంగాణ ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో చాలా ఏళ్లుగా రేషన్ కార్డులు మంజూరు చేయకపోవటంతో కుటుంబాలు వేరు పడిన వారు, కొత్తగా పెళ్లిళ్లు చేసుకున్న వారు రేషన్ కార్డులు ఎప్పుడెప్పుడు ఇస్తారా..? అని ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో అమలయ్యే దాదాపు అన్ని ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు లింక్ ఉండటంతో వాటి కోసం నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో రేషన్ కార్డుల మంజూరుపై తాజాగా సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక అప్డేట్ ఇచ్చారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మండలిలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు మంత్రి ఉత్తమ్ బదులిచ్చారు. అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ ప్రక్రియ త్వరలోనే చేపడుతామని.. సంక్రాంతి నుంచి రేషన్ కార్డుల మంజూరీ ఉంటుందని చెప్పారు. ఇప్పటికే రేషన్ కార్డుల మంజూరు విషయంపై క్యాబినెట్ సబ్ కమిటీ వేసినట్లు గుర్తుచేశారు. దాదాపు తెలంగాణ వ్యాప్తంగా 36 లక్షల మందికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేసే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు. కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వటమే కాకుండా సన్నబియ్యం కూడా ఇస్తామని మంత్రి ఉత్తమ్ అసెంబ్లీ వేదికగా ప్రకటించారు.రేషన్ కార్డుల మంజూరుపై శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కీలక సూచనలు చేశారు. అవసరం ఉన్నవారికి మాత్రమే రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. అసలైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కొందరు అనర్హులు కూడా రేషన్ కార్డులు పొంది ప్రభుత్వ ఆదాయానికి గండిపెడుతున్నారని అన్నారు. సివిల్ సప్లయ్ అధికారులు సమగ్ర విచారణ జరిపి అవసరం లేని వారి కార్డులను తొలగించాలన్నారు. పేదరికం అనుభవిస్తున్న వారికి మాత్రమే ప్రభుత్వం సరుకులు పంపిణీ చేయాలని మండలి ఛైర్మన్ గుత్తా ప్రభుత్వానికి సూచించారు. కాగా, ప్రస్తుతం తెలంగాణలో 89.96 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి అదనంగా మరో 36 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు విడివిడిగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఇది వరకే ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా రేషన్ కార్డుల మంజూరుపై మంత్రి ఉత్తమ్ అసెంబ్లీ వేదికగా ప్రకటన చేయటంతో అర్హులైన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## ప్రజా సమస్యల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోతుంది

జగదీశ్ రెడ్డి ధ్వజం



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజా సమస్యల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు జగదీశ్ రెడ్డి అన్నారు. ఎంత తప్పించుకున్నా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై నిప్పులు చెరిగారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ప్రజలపై పడిందని విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేసిందని మండిపడ్డారు. మూసీ సుందరీకరణ పేరుతో బడాబాబులకు దోచిపెట్టే కుట్రకు తెరతీసిందని ఆరోపించారు. లగచర్ల రైతులపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోందని తెలిపారు. జైలులో ఉన్న లగచర్ల గిరిజన రైతులపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండెపోటు వచ్చిన రైతుకు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లారని అన్నారు. లగచర్ల ఘటనపై చర్చకు కోరితే ప్రభుత్వం పారిపోయిందని తెలిపారు.అసెంబ్లీ స్పీకర్ రాష్ట్ర ప్రభుత్వంలో భాగం కాదన్న విషయం గుర్తించాలని జగదీశ్ రెడ్డి సూచించారు. స్పీకర్ మా నోరు నొక్కుతున్నారని తిట్లు తిట్టేవారికే అవకాశం కల్పిస్తున్నారని ధ్వజమెత్తారు. లగచర్ల రైతుల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తిపై ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలన నుంచి పారిపోతోందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

## జాబ్ క్యాలెండర్ ప్రకారమే నోటిఫికేషన్లు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**విశ్వంభర, హైదరాబాద్:** జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగాల ఖాళీలు అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ప్రశ్నపత్రాల లీక్, మాల్ ప్రాక్టీస్ జరుగకుండా పారదర్శకంగా పరీక్షల నిర్వహణ చేపడుతున్నామని తెలిపారు. శాసన మండలిలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాల భర్తీ కోసమే జాబ్ క్యాలెండర్ ప్రకటించామని దశలవారీగా భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియామకాలు చేపడతామన్నారు.కాగా, 'అదిగో జాబ్ క్యాలెండర్.. ఇదిగో జాబ్ క్యాలెండర్' అంటూ నిరుద్యోగులను ఊరించిన రేవంత్‌రెడ్డి సర్కారు, ఈ ఏడాది ఆగస్టు 3న గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఖాళీల వివరాల్లేని.. నోటిఫికేషన్, పరీక్షల తేదీల్లేని జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉసూరుమనిపించింది. జాబ్ క్యాలెండర్‌లో మొత్తం 20 రకాల షెడ్యూళ్లను ప్రకటించగా వీటిలో అర్హత పరీక్ష అయిన టెట్ రెండు సార్లు ఉన్నది. మిగతా 18లో గ్రూప్-1, 2, 3 నోటిఫికేషన్లు గతంలో జారీ అయినవే కావడం గమనార్హం. పరీక్షలు మాత్రమే నిర్వహించాల్సి ఉన్న వీటిని కూడా కొత్త జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించి కాంగ్రెస్ సర్కారు తన ఖాతాలో వేసుకున్నది. యూపీఎస్సీ ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తుంది. నోటిఫికేషన్ తేదీ, దరఖాస్తు గడువు, రాత పరీక్ష తేదీ లాంటి పూర్తి వివరాలు అందులో పొందుపరుస్తుంది. కానీ రేవంత్ సర్కారు ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో ఇవేవీ లేవు. కేవలం ఫలానా నెలలో నోటిఫికేషన్ ఇస్తాం.. ఫలానా నెలలో పరీక్ష నిర్వహిస్తామన్న వివరాలు మాత్రమే ప్రకటించారు.

## దేవుళ్లపై ఒట్లు వేస్తేనే దిక్కు లేదు

- సంక్రాంతికి పథకాలిస్తామంటే ఎలా నమ్ముతారు
- భట్టి ప్రకటనపై కేటీఆర్ ఎద్దేవా



**విశ్వంభర, హైదరాబాద్:** శాసనసభలో పరిమితుల విధింపుపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్నేండ్లలో ఎప్పుడూ లేనివిధంగా మాజీ ఎమ్మెల్యేలను శాసనసభవైపునకు రాకుండా చేసిన తీరుపై మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యేలు వచ్చి మంత్రులు, ముఖ్యమంత్రిని కలిసే అవకాశం ఉండేదని ఆయన గుర్తుచేశారు. కానీ ఈ ప్రభుత్వం అసెంబ్లీలోకి ప్లకార్డులను సైతం తీసుకురాకుండా అడ్డుకుంటుందని మండిపడ్డారు. గతంలో ఇదే శాసన సభలోకి ఉరితాళ్లను, ఎండిన పంటలను, నూనె దీపాలు వంటి వాటితో పాటు అనేక రకాల అంశాలను తీసుకొచ్చి నిరసన తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు.శాసన సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కట్టడి చేసి తమ వైఫల్యాలను దాచుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ అన్నారు. మీడియా వద్ద కూడా శాసన సభ్యులను మాట్లాడనీయకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడటానికి వెళ్తే కాసేపు ఆపారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 2లక్షల మంది విద్యార్థులు బయటకొచ్చిన అంశంపై మాట్లాడకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. తమ వైఫల్యాలను దాచిపెట్టేందుకే ప్రభుత్వం ఇవన్ని ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. సభలో తాము ప్రశ్నిస్తేనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బయటకొచ్చి ప్రకటనలు చేశారని కేటీఆర్ అన్నారు. రైతు కూలీలకు రూ.12వేల ఆర్థిక సాయం అందిస్తామంటూ భట్టి చేసిన ప్రకటన అసెంబ్లీ వ్యవహారాలకు వ్యతిరేకమని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్నప్పుడు విధానపరమైన నిర్ణయాలను సభలోనే ప్రకటించాలన్న అంశాన్ని భట్టి విక్రమార్క మరిచిపోయారని విమర్శించారు. ఈ అంశాన్ని కూడా స్పీకర్ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. గతంలో డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసిన భట్టి విక్రమార్క.. శాసన సభ బయట ప్రకటన చేయడంపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో ఈ ప్రకటన చేస్తే తాము అడిగే ప్రశ్నలకు సమాధానం ఉండదని.. అందుకే ఇలా బయట ప్రకటన చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే సంక్రాంతి నుంచి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభిస్తామని చెబుతుందని అన్నారు. దేవుళ్లపై ఒట్లు వేసిన విషయానికే దిక్కులేదని.. అలాంటప్పుడు సంక్రాంతికి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రారంభిస్తామంటే రాష్ట్ర ప్రజలు ఎలా నమ్ముతారని ఎద్దేవా చేశారు.

## గురుకులాల ఏర్పాటులో నిర్లక్ష్యం

కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డ ఎమ్మెల్సీ కవిత



**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క బీసీ గురుకుల పాఠశాలను కూడా ఏర్పాటు చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. కనీసం గురుకులాలను ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ప్రభుత్వానికి లేకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు.సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేవలం19 బీసీ సంక్షేమ పాఠశాలలను మాత్రమే ఏర్పాటు చేసిందని తెలిపారు. కానీ పదేండ్లలో కేసీఆర్ 275 బీసీ పాఠశాలలను, 31 బీసీ డిగ్రీ కాలేజీలను, ప్రత్యేకంగా బీసీలకు రెండు వ్యవసాయ కాలేజీలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. బీసీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.14వేల కోట్లు విడుదల చేసిందని చెప్పారు. దీని ద్వారా 15 లక్షల విద్యార్థులకు లబ్ది జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా కొత్త బీసీ గురుకులాలు ఏర్పాటు చేయలేకపోవడం బాధాకరమని అన్నారు. కేసీఆర్ హయాంలో 2230 బీసీ విద్యార్థులకు విదేశీ విద్య కింద రూ. 450 కోట్లు ఖర్చు చేశామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం విదేశీ విద్యకు ఎలాంటి ప్రోత్సహకాలు అందించలేదని చెప్పారు. ఎందుకు ఇంత ఆలస్యమవుతుందని కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీశారు. గురుకులాల్లో మెనూ మార్చామని చెబుతున్నారని.. కానీ ఇంకా స్కూల్స్‌లో ప్రారంభించలేదని అన్నారు. కొత్త మెనూను ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి అయ్యాక రేవంత్ రెడ్డి నెలకు రెండు మూడు సార్లు ఢిల్లీకి వెళ్లారని కవిత అన్నారు. ఢిల్లీకి వెళ్లి కేంద్రమంత్రులను కలిసిన రేవంత్ రెడ్డి.. జిల్లాకొకటి రావాల్సిన నవోదయ విద్యాలయాలను ఎన్ని సాధించారని ప్రశ్నించారు. వెనుకబడిన జిల్లాలకు నిధులు సాధించారా అని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూ అదనంగా ఎన్ని నిధులు తీసుకొచ్చారని ప్రశ్నించారు.

## బీఆర్ఎస్ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం పారిపోయింది

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో 1913 జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళు ్లన్నాయని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. స్కూళ్లలో జీరో ఎన్‌రోల్‌మెంట్‌పై చర్చించాలని కోరామని అన్నారు. విద్యాలయాలపై తమ ప్రశ్నను చర్చకు అనుమతించలేదని పేర్కొన్నారు. గురుకులాలు అంటే ఈ ప్రభుత్వానికి కేసీఆర్‌నే కనిపిస్తున్నారని తెలిపారు.కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన గురుకులాల్లో 5 లక్షల మంది చదువుతున్నారని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో ఈ ఏడాది 2 లక్షల మంది తక్కువగా చేరారని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. కేవలం 10 మంది విద్యార్థులున్న దాదాపు 4 వేల స్కూళ్లు ఉన్నాయని చెప్పారు. 10 మందికి లోపు విద్యార్థులున్న స్కూళ్ల టీచర్లను వేరే చోటికి బదిలీ చేస్తున్నారని మండిపడ్డారు. దాదాపు 6 వేల స్కూళ్లు మూసివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. కేసీఆర్ హయాంలో విద్యార్థులకు మార్నింగ్ బ్రేక్‌పాస్ట్ ఇచ్చామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ ప్రభుత్వం మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్ ఎత్తిసిందని అన్నారు. విషాహారం, కుక్క, పాముకాట్లతో గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నారని సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై అసెంబ్లీలో బీఆర్ఎస్ అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం పారిపోయిందని అన్నారు. అటు అసెంబ్లీలో.. ఇటు బయట ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదని విమర్శించారు. మేం స్కూళ్లకు వెళ్లి చూస్తామంటే కూడా అనుమతించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమైందని పేర్కొన్నారు. విద్యారంగానికి సంబంధించి కాంగ్రెస్ 20 హామీలు ఇచ్చిందని తెలిపారు. కానీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని చెప్పారు. మూసివేయాలని చూస్తున్న స్కూళ్లపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించాలని సూచించారు.

## అసెంబ్లీ పాయింట్

### సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులపై హరీష్ వర్సెస్ సీతక్క

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు
- హరీష్ రావు అడిగిన ప్రశ్నకు మంత్రి సీతక్క సమాధానం
- హరీష్ వర్సెస్ సీతక్క మాటలతో దద్దరిల్లిన అసెంబ్లీ



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ల పెండింగ్ బిల్లులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హరీష్ రావు అడిగిన ప్రశ్నకు మంత్రి సీతక్క సమాధానమిస్తూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలన పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. దీంతో హరీష్ రావు వర్సెస్ సీతక్క వాదనలతో అసెంబ్లీ దద్దరిల్లింది. సర్పంచ్‌లకు చెల్లించాల్సిన రూ.691 కోట్లు గత ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని హరీష్ రావు గుర్తు చేశారు. నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిస్తే ఎక్కడికక్కడ సర్పంచ్ లను అరెస్టు చేశారని తెలిపారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించింది బడా కాంట్రాక్టర్లకు అన్నారు. బడా కాంట్రాక్టర్లకు రూ. 1200 కోట్లు.. చిన్న కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు మాత్రం ఒక్క పైసా కూడా అందలేదని తెలిపారు. పంచాయతీ ఎన్నికలకు ముందు పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, ఎప్పుడు క్లియర్ చేస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అనంతరం హరీష్ రావు అడిగిన ప్రశ్నకు మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు. పదేళ్ల బీఆర్ ఎస్ పాలనలో పంచాయతీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. 2014 నుంచి సర్పంచ్ ల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని, గత ప్రభుత్వం ఆ బిల్లులు ఎందుకు చెల్లించలేకపోయిందో సమాధానం చెప్పాలన్నారు. సర్పంచ్ బిల్లుల గురించి అప్పట్లో ఆర్థిక మంత్రిగా ఉన్న హరీశ్ రావుకు తెలియదా అని ప్రశ్నించారు. ఈ రోజు తమకేమీ తెలియనట్లు బీఆర్ఎస్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పల్లె ప్రగతి నిధులు విడుదల చేయకపోవడంతో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఎదురుదాడికి దిగారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ ల పెండింగ్ బిల్లులపై మంత్రి సీతక్క సరైన సమాధానం చెప్పలేదని బీఆర్ ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. వాకౌట్ అనంతరం తిరిగి అసెంబ్లీకి చేరుకున్న బీఆర్ఎస్ నేతలు ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు.

### రాష్ట్ర ప్రభుత్వం ఏ జిల్లానూ రద్దు చేయదు

మంత్రి పొంగులేటి



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ జిల్లానూ రద్దు చేయదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పాత జిల్లాలను రద్దు చేయాలన్న ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని చెప్పారు. శాసనమండలిలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం వద్దకు నిధుల కోసం తరచూ వెళ్తాయని.. వెళ్లిన ప్రతిసారీ నిధులు రావని చెప్పారు. గతంలో భారాస హయాంలో ఎన్ని నిధులు వచ్చాయో తెలుసని ఎద్దేవా చేశారు. ఇది పేదల ప్రభుత్వమని.. పేదల కోసం పని చేస్తుందని పేర్కొన్నారు.

### మళ్లీ అధికారంలోకి వస్తామన్న నమ్మకం కేసీఆర్‌కు లేదు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** ఐదుగురు ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా భట్టి విక్రమార్క రోజూ సభకు వచ్చారని.. 38 మంది ఉన్న బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్ ఎందుకు రావడం లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రి కంటే ఎక్కువ విలువ ప్రతిపక్ష నాయకుడికి ఉంటుందన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ఖతం అవుతుంది అని కేసీఆర్ ముందే తెలుసుకొని సభకు రావడం లేదన్నారు. అసెంబ్లీ లాబీల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తామన్న నమ్మకం కేసీఆర్‌కు లేదని.. అందుకే అసెంబ్లీ వస్తలేరు అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. కొడుకు , అల్లుడు , బిడ్డలను తాము పట్టించుకోమన్నారు. డీలిమిటేషన్‌లో 34 అసెంబ్లీ సీట్లు, 7 ఎంపీ సీట్లు పెరుగుతాయన్నారు. జమిలి డ్రాఫ్ట్ రెడీ అయిందన్నారు. మా సీఎం , మంత్రులు పబ్లిక్‌కి అందుబాటులో ఉంటున్నాము ప్రతిపక్ష హోదా లేకున్నా ఖర్గే, అదిర్ రంజన్ చౌదరి పార్లమెంట్‌కి వెళ్లారన్నారు. బడ్జెట్ సమావేశాల వరకు కొత్త మంత్రివర్గం రెడీ అవుతుందని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్‌లో మంత్రి వర్గ విస్తరణలో ఎవరికి పదవులు అనేది ఎవరు చెప్పలేరన్నారు. ఈ విషయం పార్టీ అధిష్ఠానం, సీఎందే తుది నిర్ణయమన్నారు. పాలమూరు నుంచి శ్రీహరికి కచ్చితంగా మంత్రి పదవి.. ఇది మాత్రం చెప్పగలనన్నారు. నల్గొండలో 2018లో భూపాల్ రెడ్డిని వికలాంగుడు అనే సానుభూతితో గెలిపించారంటూ మంత్రి విమర్శించారు. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ ఓడారు.. నేనెంత అంటూ వ్యాఖ్యానించారు. కల్వకుర్తిలో ఎన్టీఆర్ మీద చిత్త రంజన్ ఇంట్లో నుంచి గెలిచారన్నారు. తన మీద గెలిచేందుకు బూర నర్సయ్య రూ.80 కోట్లు ఖర్చు పెట్టారని.. అయినా తానే గెలిచానన్నారు. ప్రతిపక్ష ఎంపీగా ఎన్నో రోడ్ ప్రాజెక్టులు తీసుకొచ్చామన్నారు. గడ్కరీ నిన్న సీఎంకు చెబుతూ.. వెంకన్న నాకు చోటా బాయ్ అన్నారన్నారు.

### డ్రగ్స్ నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది

కేపీ వివేకానంద ఆగ్రహం

**విశ్వంభర, హైదరాబాద్:** కల్లు గీత వృత్తిని నిర్వీర్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉంటున్నాయని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. గీత కార్మికులపై అక్రమ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేపీ వివేకానంద మాట్లాడుతూ.. డ్రగ్స్ నియంత్రణ, నివారణపై కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.గ్రామగ్రామాన గల్లీగల్లీలో బెల్ట్ షాపుల బెడద ఎక్కువైందని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తెలిపారు. బెల్ట్ షాపులు ఎత్తివేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. కానీ బెల్ట్ షాపుల పేరిట గీత కార్మికుల ఇండ్లపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. గీత కార్మికులపై అక్రమ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. కల్లు గీత వృత్తిని నిర్వీర్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉన్నాయని విమర్శించారు. కిల్లీ బడ్డీల్లో కూడా డ్రగ్స్, గంజాయి దొరుకుతోందని కేపీ వివేకానంద తెలిపారు. డ్రగ్స్ నియంత్రణ, నివారణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు.

# పకడ్బందీగా అమలు చేయాలి

**సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్.చంటి ముదిరాజ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక**




**విశ్వంభర, రంగారెడ్డి:** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులుగా రామగళ్ళ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మల్లం శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా వేముల పుష్పలత, సంయుక్త కార్యదర్శిగా దీపక్ కులకర్ణి, గ్రేటర్ హైదరాబాద్ అధికార ప్రతినిధిగా రాసునూరి లక్ష్మణ్ ను నియమిస్తున్నట్లు సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలని, ఆర్‌టిఐ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలని, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు, ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48 గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలని అన్నారు. సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం అని ప్రజలతోపాటు అధికారులు కూడా ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ పంచాయతి నుండి మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని 30 రోజుల్లో సమాచారం తీసుకోవచ్చని అన్నారు. ఈ చట్టాన్ని ప్రజా ప్రయోజనాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలని దుర్వినియోగం చేయకూడదని అవసరమైన సమాచారం మేరకే ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకోవాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాక అధ్యక్షులుగా ఎన్నికైన రామగళ్ళ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మల్లం శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలుగా వేముల పుష్పలత, సంయుక్త కార్యదర్శిగా దీపక్ కులకర్ణి, గ్రేటర్ హైదరాబాద్ అధికార ప్రతినిధిగా రాసునూరి లక్ష్మణ్ లు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం గ్రామ పంచాయతీలు మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రతి పౌరుడు దరఖాస్తు చేసుకొని తనిఖీ చేయవచ్చున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెన్నెముక అయిన సమాచార హక్కు చట్టం 2005 కు సంబందించిన 4 (1) బి సంబంధించిన 17 అంశాల సమాచారం, రిజిస్టర్ 1, రిజిస్టర్ 2 న గల కాపీలను ఉచితంగా, స్వచ్చందంగా ప్రజలకు కోరినప్పుడు అధికారులు ఇవ్వాలని అన్నారు.మూడో వ్యక్తి సమాచారం విషయంలో ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే సమాచారం అయితే సెక్షన్ 11 (1) ప్రకారంగా దరఖాస్తుదారునికి అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇవ్వని అధికారులకు కనిష్టంగా 250 నుండి గరిష్టంగా 25 వేల వరకు జరిమానాలు సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ విధిస్తారు అని అన్నారు.సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సిబిఐ, సిఐడి, కోర్టు జడ్జిమెంట్, దేశ భద్రత సమాచారం, పోలీస్ స్టేషన్ భద్రత, ఆయుధాల సమాచారాన్ని మినహాయించబడిందన్నారు. ప్రతి ఒక్కరు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని బయటకు తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, తెలంగాణ మహిళా కార్యనిర్వహక అధ్యక్షురాలు జి.ప్రియ రెడ్డి, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి ఎర్రబెల్లి ప్రగతి,రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అంతటి అజయ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ముచ్చర్ల మల్లేష్ పాల్గొన్నారు.

## మరోసారి భాగ్యనగరంలో గుప్పుమన్న మత్తు మందు

**రూ. కోటి 25 లక్షల విలువ చేసే డ్రగ్స్ సీజ్**




**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ నార్కోటిక్ అధికారులు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నా.. హైదరాబాద్‌లో డ్రగ్స్ దందా మాత్రం ఆగడంలేదు. తాజాగా మీర్‌పేట్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడడం కలకలం రేపుతోంది. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు టాస్క్‌ఫోర్స్ పోలీసులు. వారి నుంచి 53 కేజీల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ విక్రయానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు పోలీసులు.రాచకొండ కమిషనరేట్ పరిధిలో భారీగా రక్షణ స్వాధీనం చేసుకున్నారు ఎల్బీనగర్ జోన్ ఎస్‌వోటీ పోలీసులు. మీర్‌పేట్ పోలీసులతో కలిసి సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. ఈ తనిఖీల్లో పెద్ద మొత్తంలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు నిందుతుల నుంచి కోటి 25 లక్షల రూపాయల విలువచేసే 53.5 కిలోల పప్పీస్ట్రా డ్రగ్ సీజ్ చేశారు రాచకొండ పోలీసులు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం ఈజీ మనీ కోసం అలవాటు పడిన నిందితులు నార్కోటిక్ డ్రగ్స్ ను విక్రయించాలని ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా రాజస్థాన్‌కు చెందిన మంగీలాల్, బిష్ణోయ్ మంకీలాల్ దాకా రామ్ ముగ్గురు నిందితులు మధ్యప్రదేశ్‌కు చెందిన పింటూ అనే వ్యక్తి నుంచి పప్పీస్ట్రా మాదకద్రవ్యాలని తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాదులో విక్రయిస్తున్నారు. పక్కా సమాచారం తెలుసుకున్న రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.అయితే ఈ మాదకద్రవ్యాలను లారీలు, బస్సులు, ట్రైన్ ద్వారా నగరానికి తీసుకువచ్చి కస్టమర్లకు అమ్ముతున్నారని రాచకొండ సీపీ తెలిపారు 2023లో మంకీలాల్ బిష్ణోయ్‌ను హయత్ నగర్ పోలీసులు డ్రగ్స్ కేసులో అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు. ఇతనిపై పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని సీపీ తెలిపారు. కాగా మెయిన్ పెడ్లర్ గా ఉన్న పింటూను పట్టుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అంతేకాకుండా మరో ముగ్గురు నగరంలో స్థానిక రిసీవర్సుగా ఉన్నారని, వారిని త్వరలో పట్టుకుంటామని రాచకొండ సీపీ తెలిపారు. అయితే ఈ పప్పీస్ట్రాను పాలు వాటర్, ఛాయ్‌లో కలుపుకుని తాగుతారు. మరోవైపు, ఈ కేసు ఇంకా విచారణలో ఉందని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని రాచకొండ సిపి సుధీర్ బాబు వెల్లడించారు.

## 16 నంబర్ బూత్ అధ్యక్షుడిగా శివరావు



**విశ్వంభర, హైదరాబాద్:** బూత్ స్థాయి నుండి పార్టీని పటిష్ట పరచాలని హైదరాబాద్ బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు అన్నారు. హైదరాబాద్ బిజెపి సెంట్రల్ జిల్లా పరిధిలో వివిధ డివిజన్లోని పెండింగ్ వున్న చోట కమిటీలు త్వరగా వేయాలని కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. నేడు అంబర్పేట నియోజకవర్గం బాగ్ అంబర్పేట డివిజన్ 16 నెంబర్ బూతు నేడు ఏర్పాటు చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు శివరావును ఏకగ్రీవంగా డివిజన్ అధ్యక్షులు చుక్కా జగన్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర కార్యాలయం ఇన్చార్జి ఉమాశంకర్ పరిశీలనలో జరిగింది. అనంతరం శివరావును గౌతమ్ రావు, నాయకులు సత్కరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ హరి చరణ్ శ్యామ్ రాజు, ఎడెల్లి అజయ్, పాపారావు, గోవర్ధన్ రెడ్డి, పుట్ట పాండురంగయ్య రామ్ రెడ్డి, ప్రవీణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ సుమిత్రకు సీఐటీయూ నేతల నివాళులు



**విశ్వంభర, వనస్థలిపురం:** కార్మికోద్యమ నిర్మాత కామ్రేడ్ నందూరి ప్రసాదరావు సతీమణి కామ్రేడ్ సుమిత్ర (92) సోమవారం వనస్థలిపురంలో మృతి చెందారు. ఈ మేరకు ఆమె మృతిపై సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. గత 6 నెలలుగా ఆమె అస్వస్థతకు గురయ్యారని, కరోనా కాలంలో ఆమెకు కరోనా సోకిన తర్వాత నుంచి అస్వస్థతగానే ఉంటున్నారన్నారు. కాగా, కామ్రేడ్ సుమిత్ర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కూడా పాల్గొన్నారని గుర్తు చేశారు. పోరాటం విరమణ తరువాత ఆమె చదువుకొని హైదరాబాద్, నారాయణగూడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేశారన్నారు. కామ్రేడ్ ప్రసాదరావు 2021లో మరణించగా, ఆమె అప్పటినుంచి సీఐటీయూను ఎప్పుడూ విస్మరించలేదన్నారు. అన్ని సందర్భాల్లోనూ సీఐటీయూ సభలు, సమావేశాల్లో పాల్గొనేవారని, ఆమె మృతి బాధాకరమని సీఐటీయూ నేతలు అన్నారు. అనంతరం



కామ్రేడ్ సుమిత్ర భౌతిక కాయానికి సీఐటీయూ రాష్ట్ర ప్రతినిధి బృందం, సీఐటీయూ సీనియర్ నాయకులు పి. రాజారావు, ఉపాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ నాయకులు నివాళులర్పించారు.

## కార్మిక చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సర్కార్

- ఏకపక్షంగా కనీస వేతనాల సలహా మండలి సభ్యుల ఎంపిక
- ఈనెల 23న లేబర్ ఆఫీస్ ముందు ధర్నా
- బీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య వెల్లడి




**విశ్వంభర, బాగ్ లింగంపల్లి:** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏకపక్షంగా, ఇతర యూనియన్ల ప్రాతినిధ్యం లేకుండా బోర్డు సభ్యులను నియమించడాన్ని వ్యతిరేకిస్తూ నేడు అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలోపై నిర్ణయించారు. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశంలో బిఆర్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని, కనీస వేతనాలు జీఓలు తగ్గించి తీయడానికి కుట్రకు చేస్తున్నారని, రాష్ట్రంలోని అన్నీ రకాలా కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కోటి 80 లక్షలు మంది కార్మికులున్న శాఖకు సంవత్సర కాలంగా మంత్రి లేకపోవటం సిగ్గు చేటన్నారు. ఐక్య పోరాటాలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సాయిబాబా, వీఎస్ రావు, భూపాల్, షరీఫ్, ఐఎఫ్టియు ఎం.శ్రీనివాస్, వి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## తొలి తెలంగాణ తల్లి విగ్రహం పెట్టింది మేమే..

- ఆ హక్కు బీఆర్ఎస్ పార్టీకి ఎక్కడున్నది?
- మాజీ ఎంపీ, కాంగ్రెస్ మహిళా నేత విజయశాంతి



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ తల్లి విగ్రహంపై రాజకీయ దుమారం రేగుతోంది. ఈనెల 9న సీఎం రేవంత్ సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉద్యమ సమయంలో ఉన్న విగ్రహానికి భిన్నంగా కొత్త విగ్రహం తయారు చేయించారు. అయితే కొత్త విగ్రహం అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. గతంలో ఉన్న విగ్రహం కేసీఆర్ కూతురు కవిత రూపంలో ఉందని విమర్శిస్తుండగా.. కొత్త విగ్రహం కాంగ్రెస్ తల్లి విగ్రహం అని బీఆర్ఎస్ నేతలు ప్రతి విమర్శలు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో ఉద్యమ సమయంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలు ఏర్పాటు చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు.ఈ నేపథ్యంలో తాజాగా.. మాజీ ఎంపీ, కాంగ్రెస్ మహిళా నేత విజయశాంతి స్పందించారు. తెలంగాణ తల్లి రూపం, మార్పుపై కొట్లాడే హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదని చెప్పారు. తెలంగాణ తల్లి మొదటి విగ్రహాన్ని ఆవిష్కరించింది తామేనని చెప్పారు. తల్లి తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో 2007లో విగ్రహాన్ని ఆవిష్కరించినట్లు ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నా.. విగ్రహానికి అధికారిక హోదా, గౌరవం ఇవ్వలేదని అన్నారు. '2007 సంవత్సరంలో మొదటి తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ జరిగింది. తల్లి తెలంగాణ పార్టీ కార్యాచరణలో భాగంగా బడుగు, బలహీన, సబ్బండ వర్గాల తల్లి ప్రతిరూపంగా బీఎస్ రాములు గారి ఆధ్వర్యంలో విగ్రహం రూపుదిద్దుకుంది. అప్పటికి నాటి టీఆర్ఎస్, నేటి బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన బహుశా జరగలేదు. తదనంతరం టీఆర్ఎస్ (బీఆర్ఎస్), వారి టీఆర్ఎస్ ఆఫీస్‌లో ఒక తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ చేసిర్రు. కానీ, వారు అధికారంలో ఉన్న 10 సంవత్సరాల్లో ఎన్నడూ నాటి సీఎం కేసీఆర్.. తెలంగాణ తల్లి రూపానికి ఒక అధికార పూర్వక హోదా, గౌరవం, ప్రభుత్వ నిర్దేశ విధానాలు కల్పించలేదు.బీఆర్ఎస్ వంటి రాజకీయ పార్టీ ఆవిష్కరించిన తెలంగాణ తల్లి రూపం మార్పుపై ఆ పార్టీ కొట్లాడితే... ఆ హక్కు వారికి ఎక్కడున్నది? తల్లి తెలంగాణ విగ్రహ రూపాన్ని బీఆర్ఎస్ మార్చిందని నాటి మన తెలంగాణ ఉద్యమకారులు కూడా కొట్లాడవచ్చు. మన బోనాలు, బతుకమ్మ సంస్కృతి తరతరాలుగా నిలిచే ఉన్నవి, ఉంటవి. అందుకు రాజకీయ పార్టీల ప్రయోజనార్థ ప్రమేయం ఎన్నడు ఒక ఆవశ్యకత కాదు. పానమెత్తుగా ప్రజలు కాపాడుకుంటూనే బతుకుతారు, బతికించుకుంటారు. జై తెలంగాణ' అని విజయశాంతి ట్వీట్ చేశారు.

## నేటి నుంచి ధనుర్మాస వేడుకలు

**విశ్వంభర, మహబూబాబాద్:** హిందూ ఆచార ప్రకారం డిసెంబర్ 16 నుంచి ఈ మాసంలో ధనుర్మాసానికి విశిష్ట స్థానం ఉంది. ఈ నెలలో నిర్వహించే తిరుప్పావై వ్రతానికి ప్రాధాన్యత ఇస్తారు. తిరుప్పావై అనేది ఒక గ్రంథ కలియుగంలో మానవ కన్యగా జన్మించిన గోదాదేవి భగవంతుడిని భర్తగా భావించి ఆయనను చేపట్టడానికి సంకల్పించిన వ్రతమే తిరుప్పావై వ్రతం ధనుర్మాసంలో ఈ వ్రతం నిర్వహిస్తుండడంతో ధనుర్మాసం వ్రతంగా పేరు వచ్చింది. సంక్రాంతికి ముందు 30 రోజుల కాలాన్ని ధనుర్మాసంగా వ్యవహరిస్తుండగా ఈ నెల అంతా ఆలయాలలో భగవంతుని కొలవడంతో పాటు ఇళ్లల్లో సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది దీనిలో భాగంగా నేడు మహబూబాబాద్ కేంద్రంలో నాగేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు పూజ నిర్వహించారు.



## హైదరాబాద్ గజగజ!

**ఆరేళ్ల తర్వాత మళ్లీ విజృంభిస్తున్న చలిపులి!**



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. అల్పపీడన ప్రభావంతో ఉదయం, రాత్రి వేళల్లో చలిపంజా విసురుతోంది. గత ఆరేళ్లలో ఎన్నడూ లేనంతంగా కనిష్టానికి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. చలితీవ్ర వల్ల రాత్రి 9 గంటల తర్వాత హైదరాబాద్ నగరంలో చాలా వరకు రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 7 గంటల తర్వాతగానీ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 10 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో అత్యల్పంగా 6.3 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఆ తర్వాత స్థానంలో నిర్మల్ జిల్లా తాంద్రలో 6.6, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 6.7, సంగారెడ్డి 6.8, కామారెడ్డి 7.6, నిజామాబాద్ 7.7, మెదక్ 8, జగిత్యాల 8, వికారాబాద్ 8.2, రాజన్నసిరిసిల్ల 8.6, సిద్దిపేట 8.6, రంగారెడ్డి 8.9, పెద్దపల్లిలో 9.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ వెల్లడించింది. ఇలా పలు జిల్లాల్లో 15 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక హైదరాబాద్ నగరంలోనూ పలు చోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హెచ్‌సీయూ, మౌలాలీలో అత్యల్పంగా 7.1 డిగ్రీలు నమోదవగా ఉప్పల్ 13.4, మల్లాపూర్ 13.5, ఆదర్శనగర్ 13.5, తిరుమలగిరి, చర్లపల్లి 13.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బీహెచ్‌ఈఎల్‌లో 7.4, గచ్చిబౌలి 9.3, శివరాంపల్లి 10.3, జీడిమెట్ల 11.4, బాలానగర్ 11.5, పటాన్‌చెరు 11.7, లింగంపల్లి 11.8, బోయిన్‌పల్లి 11.9, బేగంపేట 12, ఆసిఫ్‌నగర్ 12, నేరేడ్‌మెట్ 12.1, లంగర్‌హౌస్ 12.2, మోండా మార్కెట్ 12.4, చందానగర్ 12.7, షేక్‌పేట 12.8, మాదాపూర్ 12.8, కూకట్‌పల్లి 13.1, గోల్కొండ 13.2, సఫిల్‌గూడ, హయత్‌నగర్ 13.3 చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావతంతో చలిగాలులు విజృంభిస్తున్నాయి. దీంతో గత ఆరేళ్లలో ఎన్నడూలేని విధంగా ఉష్ణోగ్రతలు గరిష్టంగా నమోదవుతున్నాయి. ఉత్తరాది నుంచి ఈదురుగాలులు, శీతల పవనాలు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు మరింత పడిపోతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు.

## విద్యార్థులను అభినందించిన చెస్ అకాడమీ కోచ్ వానరసి జగన్




**విశ్వంభర, షాద్ నగర్:** హైదరాబాద్ లో ఎల్ బీ స్టేడియంలో జరిగిన తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ 50 సంవత్సరాల గోల్డెన్ జూబ్లీ సందర్భంగా నిర్వహించిన ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ లో షాద్ నగర్ పట్టణానికి చెందిన షాద్ నగర్ చెస్ అకాడమీ కోచ్ వానరసి జగన్ అధ్యర్యంలో పట్టణానికి చెందిన చదరంగం క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 07, 09, 11, 13 విభాగలో ఈశాని, సుమీత్ కుమార్, దియాంషి రెడ్డి, చార్విక్ శౌర్యా, కార్తికేయ, శ్రీహర్షిత్, సాత్విక్, నిఖిల్ వీర వెంకటేష్, ఆదిదేవ రెడ్డి, భవీన్ రాథోడ్, ప్రణీత్ తేజ, ఉష శ్విని, దివ్య శ్రీ, సాయి సుశాంత్, సాత్విక్ గౌడ్, రిత్విక్ గౌతమ్, శ్రీలిఖిత్, ధనిష్ సాయి తేజ్, శ్రీ రోహన్, వేదన, వేధిత, సుగంధన్ చందరగా క్రీడాకారులు అందరూ అద్భుతమైన ప్రదర్శన కనబర్చి మెరిట్ సర్టిఫికెట్ లు,గోల్డ్ మెడల్స్, ట్రోఫీస్ సాధించారు. ఈ సందర్భంగా కోచ్ జగన్ మాట్లాడుతూ మెదడుకు పదును చేయాలంటే చెస్ ఆడాలని దీనితో జ్ఞాపకశక్తి పెరుగుతుందని పిల్లలు చురుకుగా తయారు అవుతారని తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## ఐకెపి ధాన్యపు కేంద్రం తనిఖీ

**అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి**



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ మండలం శనిగపురం గ్రామంలోని ఐకెపి, కంబాలపల్లి ప్రాథమిక, వ్యవసాయ సహకార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని, రైతుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి డబ్బులు పడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల లో ఇప్పటివరకు వచ్చిన ధాన్యం వివరాలు, ఇంకా రావాల్సి ఉన్న ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారము ధాన్యం కొనుగోలు చేయాలని సంబంధిత కేంద్రాల నిర్వహకులను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, కేంద్రాల నిర్వహకులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



**విశ్వంభర, ఆమనగల్:** ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు నుచ్చుగుట్ట తండా లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుదారులు, సర్వే అధికారులను సహకరించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన 6గ్యారెంటీ పథకాల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ వసంత తెలిపారు. ఈకార్యక్రమంలో చైర్మెన్ రాంపాల్,వైస్ చైర్మన్ దుర్గయ్య ,కాంగ్రెస్ జిల్లా నాయకుడు కృష్ణ నాయక్,అధికారులు శంకర్,ఇందిరమ్మ కమిటి సభ్యులు,లక్ష్మి,చందు నాయక్, రఘు నాయక్,రజిత భాస్కర్, కుమార్, కిషన్, శాంతి, చిన్న, సురేష్, పాల్గొన్నారు.

## ఘనంగా ద్వారక ప్రారంభోత్సవం



**విశ్వంభర, వరంగల్:** శ్రీ ద్వారక అపార్ట్మెంట్ ప్రారంభోత్సవ వేడుకలు ఆదివారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. వరంగల్ ఉర్సు గుట్ట బైపాస్ రోడ్, ముకుంద కాలనీలో సత్యం గ్రూప్ నిర్మించిన శ్రీ ద్వారక గృహ సముదాయాలకు ప్రారంభోత్సవం చేశారు. మూడు ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి నూతనంగా గృహాలు కొనుగోలు చేసిన వారు అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించి, వారికి ఇంటి తాళంచెవులు అందజేశారు. ఈరోజు తెల్లవారుజాము నుంచి గణపతి, నవగ్రహ, మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. అలాగే భూ వరాహ సహిత జయలక్ష్మి, నరసింహ మూల మంత్ర హవనము, దశమహావిద్య హవనము బ్రహ్మ శ్రీ యల్లంభట్ల సీతారామ శాస్త్రి ఆధ్వర్యంలో విశిష్ట పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం, తీర్థ ప్రసాద, భోజన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఆహ్వాన వేడుకులకు పెద్ద ఎత్తున సత్యం గ్రూప్ కస్టమర్లు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు హాజరై అభినందించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన గృహ సముదాయము, విల్లాలను తిలకించి, గృహ ప్రత్యేకతలు తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల పరిధిలోని అన్మాస్ పల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జర్పుల రాధకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీటీసీలు ఉప్పల వెంకటేష్, జర్పుల దశరథ్ నాయక్, పిఏసిఎస్ చైర్మన్ వెంకటేష్ గుప్త హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. కామినేని హాస్పిటల్ సహకారంతో డా. ఉప్పల అఖిల్ బృందం 255 గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి తగిన మందులు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనంద్,జోగు విరయ్య, కృష్ణయ్య, గ్రామ అధ్యక్షుడు మహేష్ యాదవ్,కంబాల రమేష్,ప్రేమ్ కుమార్,శ్రీను,కొప్పు కృష్ణ, పాండు, వగ్గు మహేష్, కృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

## గట్టు ఇప్పలపల్లిని మండలం చేయాలని కలెక్టర్‌కు వినతి



**విశ్వంభర, తలకొండపల్లి :** తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రజా ధర్బార్ లో గట్టిప్పలపల్లి జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ వినతి పత్రంలో గట్టు ఇప్పలపల్లి నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి. గ్రామ సెక్రెటరీ ని నియమించాలని, నూతన రోడ్లు , ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయాలి మరియు గట్టు ఇప్పలపల్లి గ్రామానికి అను సంబంధం ఉన్న చౌదర్పల్లి, బొమ్మరాజు పల్లి,వీరన్న పల్లి , దస్య తండా, బోడె తండా,మెదక్ పల్లి నూతన రోడ్లు మరియు జూలపల్లి నుండి మాచర్ల కు రోడ్డు మరమ్మతులు వెంకట్రావుపేట్ నుండి గడ్డ తండకు, గర్మే తండకు, మరియు కల్వకుర్తి నుంచి తలకొండపల్లి బస్సు కొరకు వినతి పత్రాలు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మోకురాల అశోక్ గౌడ్ , ఆంజనేయులు గౌడ్, జేఏసీ సెక్రెటరీ ఎదుల అనిల్, మాజీ ఎంపీటీసీ ఏదుల వెంకటయ్య, చంద్రశేఖర్, మోకురాల మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో ప్రమాణ సెక్రటేరియట్ ప్రారంభం



**విశ్వంభర, సంగారెడ్డి:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో సోమవారం ప్రమాణ -2025 సచివాలయాన్ని గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు ప్రారంభించారు. గీతంలో ప్రతి యేటా సాంకేతిక-సాహిత్య-నిర్వహణల మేలుకలయికగా నిర్వహించే మూడు రోజుల పండుగకు సన్నాహకంగా ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక శిక్షణ, ఉపన్యాసాలు, పోటీలతో పాటు ర్యాంప్ వాక్, సింఫోనీ, కన్సర్ట్, బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్, కార్నివాల్, పలు యాజమాన్య మెళకువలను నేర్పే పోటీల సమాహారంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ప్రమాణ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ప్రొఫెసర్ డీ.ఎస్.రావు మాట్లాడుతూ, నూతన సాంకేతికత మేళవింపుతో కార్యక్రమాలను ఎంపిక చేసి, ఇతర కళాశాలల విద్యార్థులు విరివిగా పాల్గొనేలా వాటిని రూపొందించమని సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

– జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి పక్క ఇండ్లు నిర్మించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే సర్వే నిర్వహించడం జరుగుతుందని, ప్రతిరోజు సర్వే నివేదికలు ప్రభుత్వానికి ఆన్లైన్ విధానం ద్వారా సమర్పించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం ఖచ్చితమైన సమాచారం క్షేత్రస్థాయిలో సేకరించాలని, సిబ్బందిని ఆదేశించారు. సర్వే వివరాలను నిత్యం ఉదయం, సాయంత్రం పర్యవేక్షిస్తూ తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో ఇందిర ఇండ్ల సర్వే జరుగుతుందని అన్నారు. కురవి మండల కేంద్రం, మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని సంబంధిత నిర్వాహకులను ఆదేశించారు. ధాన్యానికి సంబంధించి రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి వెంటనే డబ్బులు పడేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చింది, ఎంత ధాన్యం కొనుగోలు చేశారు, ఇంకా ఎంత ధాన్యం రావాల్సి ఉంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరిపెడ మండలం, అబ్బాయిపాలెం గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు మున్సిపల్ కమిషనర్ రవీందర్, డిప్యూటీ ఇంజనీర్ ఉపేందర్, కురవీ ఎంపీడీవో, తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



**విశ్వంభర, భూపాలపల్లి:** హుజరాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు భూపాలపల్లి జిల్లా మహదేవ్పూర్ మండలంలోని కాళేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్లో, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల లో పరీక్ష ప్యాడ్ లను విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్ కాళేశ్వరం ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ మాట్లాడుతూ కన్నతల్లి పేరు మీద ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించడం అభినందనీయం అని అన్నారు. విద్యార్థులు అందరూ బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు చేసే అంతగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి అన్నపూర్ణ, ట్రైబల్ స్కూల్ ఇన్చార్జ్ పి.సునీత, జిల్లా పరిషత్ హై స్కూల్ గర్ల్స్ మహదేవ్పూర్ హెచ్ పి సరిత, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# వృద్ధులకు అండ.. లయన్స్ క్లబ్ ఆమనగల్లు

**లయన్స్ క్లబ్ బ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి**




**విశ్వంభర, ఆమనగల్లు :** జిల్లా అంధత్వ నివారణ సంస్థ, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు,రామ్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు లయన్ పసుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే ఉచిత కంటి ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి చూపు మందగించిన వారికి మరియు వృద్ధులకు ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వారికి సేవానందించి వారికి కొండంత అండగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఉంటుందని ఆయన అన్నారు. నియోజకవర్గస్థాయిలో కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఒకరి నేత్రదానం ఇద్దరికి చూపు కల్పిస్తుందని తెలిపారు.కంటి వైద్యులు యం చంద్రశేఖర్ 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 15 మందికి శస్త్రచికిత్సల నిమిత్తం రామ్ రెడ్డి కంటి ఆసుపత్రికి పంపించినట్లు క్లబ్ పి ఆర్ ఒ పాష తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పరిక్షిత్ నరేంద్ర, క్లబ్ కార్యదర్శి దోనాదుల మహేష్, జిల్లా చైర్మన్ జూలూరి రమేష్, జిల్లా చైర్మన్ లయన్ యం చంద్రశేఖర్ హెచ్ఈఓ తిరుపతి రెడ్డి, గోపాల్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ వల్లే సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు

**డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి**



**విశ్వంభర, కడ్తాల్:** రాష్ట్రంలో సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల పాపం గత బీఆర్ఎస్ సర్కార్ దేనని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు సర్పంచ్ ల పెండింగ్ బిల్లుల గురించి పట్టించుకోని అప్పటి ఆర్థిక మంత్రి హరీశ్ రావు, ఇప్పుడు అసెంబ్లీలో సర్పంచ్ ల పెండింగ్ బిల్లులపై మొసలి కన్నీరు కార్చడం, వాకౌట్ చేయడం హస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ ల పెండింగ్ బిల్లుల పాపం ముమ్మాటికి బీఆర్ఎస్ దే నని, బీఆర్ఎస్ పాలనలో సర్పంచ్లు చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకుండా, పెండింగ్ లో పెట్టి, సర్పంచ్ ల ఆత్మహత్యలకు కారణమైంది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను కూడ దారి మళ్లించి, సర్పంచ్లను ఇబ్బందులకు గురిచేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు సర్పంచ్ల సమస్యలు పట్టని బీఆర్ఎస్ నేతలు, అధికారం కోల్పోయాక మొసలి కన్నీరు కార్చడం, దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం, అవాకులు చేవాకులు పేలడం మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సర్పంచ్ల పెండింగ్ బిల్లుల సమస్యలను పరిష్కరిస్తుందని తెలిపారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ అద్దాల రాములుగౌడ్, నాయకులు రాములు ఉన్నారు.

## గ్రూప్ 2 పరీక్ష కేంద్రాల తనిఖీ



**విశ్వంభర, భూపాలపల్లి :** జిల్లా కేంద్రంలోని మాంటిసోరి, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న గ్రూప్ 2 పరీక్షా కేంద్రాలను భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 17 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టిజిపిఎస్సి నిబంధనలు మేరకు పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్ అనుమతి లేనికారణంగా నిబంధనలు పాటిస్తూ, కలెక్టర్ పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు తీసుకురావద్దన్న నియమాన్ని ఆయన పాటించారు. తన సెల్ ఫోన్‌ను వాహనంలోనే వదిలి వెళ్లి పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పర్యవేక్షణ, సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని ఇన్విజిలేటర్స్, చీఫ్ సూపరింటెండెట్లుకు సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్ష సజావుగా, సక్రమంగా జరిగేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్ష పూర్తి అయ్యే వరకు అభ్యర్థులను బయటికి పంపొద్దని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరాటంకంగా సరఫరా చేస్తున్నామని తెలిపారు.

## యువతదే భవిష్యత్ రాజకీయాలు

- తుక్కుగూడ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ సంబురాలు
- హేశ్వరం ఎస్సీ సెల్ నాయకులతో కిచ్చెన్న భేటీ



**విశ్వంభర, తుక్కుగూడ:** దళితులకు అసైన్డ్, సీలింగ్ భూములు ఇచ్చిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీకే దక్కుతుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి గుర్తు చేశారు. ఇటీవల యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా క్యారగారి శ్రీధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా కేఎల్ఆర్ ను యూత్ కాంగ్రెస్ నాయకులు తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో కలిసి సన్మానించారు.భవిష్యత్ రాజకీయాల్లో యువరక్తం నింపేందుకే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని కిచ్చెన్న తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకుని ప్రభుత్వానికి, పార్టీకి వారధిగా పని చేయాలని యూత్ కాంగ్రెస్ నేతలకు లక్ష్మారెడ్డి సూచించారు.

## అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ



**విశ్వంభర, భూపాలపల్లి:** జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో కాళేశ్వరం ఆలయానికి వచ్చే భక్తులకు మహాదేవపూర్ అటవీ శాఖ అధికారి రవి, కాళేశ్వరం అటవీ సెక్షన్ అధికారి ఆనంద్ మామిడి మొక్కలు పంపిణీ చేశారు. భక్తులు అడవిలో వంటలు చేసుకుంటూ ఉండడంతో అడవిలో నిప్పు పెట్టవద్దని భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరం ముక్తివనం పార్క్ అధికారి తిరుపతి, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిర్యాదులకు పరిష్కరించాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రజల పిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి, చట్ట ప్రకారం పరిష్కారానికి చొరవ చూపాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించి,వారితో ముఖాముఖి మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఇవాల్టి ప్రజాదివాస్ కార్యక్రమంలో 16 మంది బాధితులు పిర్యాదు చేయగా, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఎస్పి అదేశించారు.ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పి కిరణ్ ఖరే ఆదేశించారు.

## వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కీలక పదవి



**విశ్వంభర, వరంగల్:** జాతీయ సహాయ పునరుత్పత్తి, సాంకేతికత బోర్డ్ సభ్యురాలిగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లోక్ సభ సభ్యులు ఇరువురు సభ్యులుగా ఉండే ఈ బోర్డుకు ముగ్గురు సభ్యులు నామినేషన్ వేయగా అందులో ఒకరు ఉపసంహరించుకున్నారు. డాక్టర్ కావ్యతో పాటు భార్తీ పార్ధీ కూడా గెలుపొందారు. డాక్టర్ కావ్య ఇప్పటికే ఆరోగ్య మంత్రిత్వశాఖ కు అనుబంధంగా పనిచేసే ఆరోగ్య కుటుంబ సంక్షేమ సబ్ కమిటీ, స్కిల్ డెవలప్ మెంట్ సబ్ కమిటీలోనూ సభ్యురాలిగా కొనసాగుతున్నారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతి



**విశ్వంభర, భూపాలపల్లి:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మహాదేవపూర్ ఎంఈఓకు ఎడపల్లి గ్రామంలో ఉన్నటువంటి ప్రైమరీ స్కూల్ సమస్యలు వివరించి వారి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు మాట్లాడుతూ మహదేవపూర్ మండలంలోని ఎడపల్లి గ్రామంలో ప్రైమరీ స్కూల్ లో విద్యార్థులు 29 మంది ఉండగా వారికి ఒక్కరే టీచర్ బోధిస్తున్నారని అన్నారు. వాస్తవానికి ఆ పాఠశాలలో మూడు ఉపాధ్యాయ పోస్టులు ఉండగా ఒకరు నాలుగు నెలల కాలంగా మెటర్నిటీ లీవ్ లో ఉన్నారని, ఒక పోస్టు ఖాళీగా ఉందని దానివల్ల ఒక్కరే అక్కడ భోజనం చేయాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు.

## సంక్షేమానికే పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్



**విశ్వంభర, వర్ధన్నపేట:** ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు ఆదేశాల మేరకు నల్లబెల్లి గ్రామంలోని లోని ప్రజలు మార్పు కోరుకుని ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వంలో సంక్షేమానికే పెద్దపీట వేసి కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు, బిర్రు రాజు అన్నారు. సోమవారం రోజు మండలంలోని నల్లబెల్లి గ్రామంలో యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు బిర్రు రాజు ఆయన స్వంత నిధులతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ , జిల్లా నాయకులు పోశాల వెంకన్న గౌడ్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో చిద్రమైన గ్రామీణ వ్యవస్థను పునరుజ్జీవింపజేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని బాద్యత కలిగిన పార్టీ కార్యకర్తలు సైతం అందులో బాగస్వాములుగా మారి గ్రామాన సర్వతో మఖాభివృద్ధికి పాడుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం లాగ కేవలం మాటలకే పరిమితం కాకుండా గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడంలో చేతల ప్రభుత్వంగా కాంగ్రెస్ ముందుకు పోతున్నదని అన్నారు. రాష్ట్రంలో ఎడాది పాలన పూర్తి చేసుకున్న ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన కీలక హామీలను అమలు చేసే దిశగా పాలన సాగిస్తూనే ప్రజలకు అవసరమై సంక్షేమాన్ని సాగిస్తున్నదని అన్నారు.

## వందశాతం ఫలితాలు సాధించాలి

**డీఈఓ రవీందర్ రెడ్డి**



**విశ్వంభర, నెల్లికుదురు :** దాతల ఔదార్యం పాఠశాలకు, స్టూడెంట్స్ కు ఎంతో ఉపయుక్తమని డీఈఓ ఎ.రవీందర్ రెడ్డి దాతల సేవానిరతిని కొనియాడారు. స్థానిక జెడ్ పి హెచ్ ఎస్ టెన్త్ విద్యార్థులకు మాలోతు బాలోజీ నాయక్ ఆల్ ఇన్ వన్ మెటీరియల్, స్థానిక పిడి చెడు పల్లి ఐలయ్య నాన్న స్మారకార్థం విద్యార్థులకు హాకీ స్టిక్స్, 2005-6 సం.పూర్వ విద్యార్థులు 20 కుర్చీలు వితరణ చేయగా డీఈఓ చేతుల మీదగా సోమవారం హెచ్ఎం మిట్టకోలు రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. దాతలు అందజేసిన సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని, టెన్త్ లో వంద ఫలితాలు సాధించి జిల్లాను సింగిల్ డిజిట్ లో నిలపాలని సూచించారు.

# సిటీ కళాశాల ప్రొఫెసర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణ**



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీకృష్ణ యాదవ్‌ను ప్రభుత్వ సిటీ కళాశాల ప్రొఫెసర్లు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని రకాల బెనిఫిట్స్‌ను పొందే విధంగా వివిధ రూపాలలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సభ్యుల సమస్యలను పరిష్కరిస్తామని కృష్ణ యాదవ్ పేర్కొన్నారు. సిటీ కళాశాల ప్రొఫెసర్లు తమకు ఉన్నటువంటి సమస్యలు పిఆర్సి ఏరియాస్. సిపిఎస్ రద్దు, మెడికల్ రియంబర్స్మెంట్ తదితర మానిటరి బెనిఫిట్స్ పైన ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే పరిష్కరించేటట్లు టీజీవో పనిచేస్తుందని అధ్యక్షుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రొఫెసర్ ఏలూరు యాదయ్య గారు, ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే. భాస్కర్ గారు నాయకత్వంలో నిర్వహించడం జరిగింది. యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కృష్ణ గారి పాత్ర అద్భుతమైనది వారు అధ్యక్షుడిగా కావడం గర్వంగా ఉందని కొనియాడారు డాక్టర్ భాస్కర్ కృష్ణ యాదవ్ గారు అనేక సమస్యల పైన పోరాటం చేశారని పోరాటం చేసిన నాయకుడు అధ్యక్షుడిగా కావడం ఒక వరం లాంటిదని ముందు ముందు కృష్ణతో సిటీ కళాశాల ప్రొఫెసర్లందరూ సహాయ సహకారాలు అందించి వారి చేసేటువంటి అనేక రకాల కార్యక్రమంలో భాగం పాలుపంచుకుంటామని పేర్కొన్నారు, డాక్టర్ శంకర్ నాయక్ 2003 జేఎల్ నోటిఫికేషన్ ద్వారా రిక్రూట్ అయిన అధ్యాపకులకు పాత పెన్షన్ కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం దానిని ఆచరించడం జరగడంలేదని రాష్ట్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తెచ్చి దీనిని తొందరగా సాధించాలని పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శుక్ల గారు కృష్ణ యాదవ్ తెలంగాణ ఉద్యమ పాత్రని కొనియాడారు.మహిళ ప్రొఫెసర్లు అవధానం సుజాత గారు ప్రభుత్వం నుంచి మాకు రావలసిన బెనిఫిట్స్ని తొందరగా ఇప్పించాలని వేడుకున్నారు. సభ్యులందరూ టిజిఓకు ఎప్పుడు కూడా మా వంతు సహకారాలు ఉంటాయని మా సమస్యలను సాధించాలని కృష్ణ యాదవ్ గారిని కోరారు. సన్మాన కార్యక్రమంలో చిత్తరంజన్ నాగరాజు, తిరుపతి, రవికుమార్, ఆనంద్ , కోటేశ్వరరావు, రాజేందర్ పర్వతాలు, రతన్ కుమార్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## గ్రూప్-2 పరీక్షా కేంద్రాల పరిశీలన



**విశ్వంభర, మహబూబ్ బాద్:** గ్రూప్ – 2 రాత పరీక్షలకు సంబంధించి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ శ్రీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ పరిశీలించారు. పరీక్ష సరళిని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పరిశీలించారు.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మరియు పాఠశాల, ఫతిమా హై స్కూల్ తదితర పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పోలీసు అధికారులు, సిబ్బంది అందరు బాధ్యతగా పని చేయాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష పత్రాలు స్ట్రాంగ్ రూముకు చేరే వరకు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.

## గంగారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే సబితా



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆర్కే పురం డివిజన్ మార్గదర్శి కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు గంగారెడ్డి సతీమణి సత్యమ్మ ఇటీవల మరణించింది. సమాచారం తెలిసిన మాజీమంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సోమవారం వారి నివాసానికి వెళ్లి గంగారెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్కే పురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, కంచర్ల శేఖర్ ,న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, జగన్మోహన్ రెడ్డి, జాహిద్, శ్యాం గుప్తా, అనురాధ, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పునీత ఆంథోనీ చర్చిలో చిల్డ్రన్స్ క్రిస్టస్ వేడుకలు



**విశ్వంభర, వరంగల్:** రెండవ డివిజన్ వంగపాడు లోనీ పునీత ఆంథోనీ చర్చిలో చిల్డ్రన్స్ వేడుకలు జెరోం ఫాదర్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జెరోం ఫాదర్ మాట్లాడుతూ చిన్న పిల్లలు అంటే బాల యేసుకు చాలా ఇష్టమని అన్నారు చిన్నపిల్లలకు చిన్నతనం నుండి బైబిల్ ప్రకారం నడిచే విధంగా తల్లిదండ్రులు నేర్పించాలని అన్నారు. పిల్లలకు ఆట పాటలతో పాటు విద్య ఎంతో ముఖ్యమని అన్నారు. కార్యక్రమానికి సంఘ కాపరి ఫాదర్ జెరోమ్ ఫాదర్ ప్రవీణ్ కుమార్ బ్రదర్స్ సిస్టర్స్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు



**విశ్వంభర, దోమ:** మండలం పరిధిలోని ఎంకేపల్లి గ్రామంలో గల సంజీవ స్వామి దేవా లయంలో స్వామివారికి సోమవారం పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరుశురాం రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వామివారి కరుణ కటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు.

## విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన మెట్టు సాయికుమార్



**విశ్వంభర, సిద్దిపేట :** మిట్టపల్లి సాంఘిక సంక్షేమ బాలికల విద్యాలయంలో విద్యార్థులతో కలిసి ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ మధ్యాహ్న భోజనం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు పౌష్టికాహారం మెనూ అమలవుతున్న విధానం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు మెనూ అందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని వారు అన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పూజల హరికృష్ణ గారు, కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర చైర్మన్ గూడూరి శ్రీనివాస్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థులకు అండగా బండారు సుబ్బారావు



**విశ్వంభర, హైదరాబాద్:** వివిధ బ్యాంకులకు చెందిన ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల వేదిక అయిన అవోపా బ్యాంక్ మెన్ చాప్టర్, హైదరాబాద్ గత రెండు దశాబ్దాల నుండి పలు సేవాకార్యక్రమాలు స్వచ్ఛందంగా చేపడుతోంది. కుటీర్ గా పేరొందిన వృద్ధాశ్రమాన్ని నిర్వహించడం, ఎమ్ సెట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించడం, వివాహ పరిచయ వేదికలను నిర్వహించడం, పేద వైశ్యవిద్యార్థులను ఆర్థికంగా ప్రోత్సహించడం ఈ సంస్థ సేవల్లో ప్రముఖంగా పేర్కొనవచ్చు.ఆ సంస్థ అధ్యక్షులు శ్రీ పి. వి. రమణయ్య గారి అభ్యర్థన మేరకు – ప్రముఖ పారిశ్రామికవేత్త, వితరణశీలి, సంఘసేవకుడు, సీల్ వెల్ కార్పొరేషన్ అధినేత అయిన బండారు సుబ్బారావు ఒక విద్యార్థికి రూ 50,000 ఆర్థిక సహాయం అందజేశారు. సుబ్బారావు సహకారంతోతో జంటనగరాల్లో ఇంజనీరింగ్ విద్యనభ్యసిస్తున్న, కళాశాల ఫీజు చెల్లించుకోలేని పది మంది పేద విద్యార్థులు ఒక్కొక్కరికి 25,000 చొప్పున గత రెండు సంవత్సరములు ఆర్థికంగా చేయూత నందించారు. నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం భూరి విరాళం ప్రకటించిన దాత శ్రీ బండారు సుబ్బారావు గారికి పి.వి.రమణయ్య గారు, బ్యాంక్ మెన్ చాప్టర్ పత్రికాముఖంగా కృతజ్ఞతలు తెలియ జేసుకుంటోంది.

# నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలం పట్టణంలో ఐటిడిఏ వెనుక రాజీవ్ నగర్ కాలనీలోని మనుబోతుల చెరువు నందు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం సందర్భంగా అక్కడ నివాసం ఉంటున్న 14 కుటుంబాలకు చెందిన ఇండ్లను తొలగించి నిర్మాణం చేపట్టారని, తొలగించిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయిస్తామని ఆనాడు బాధ్యతల్లో ఉన్న జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఆర్ డి ఓ శివన్నారాయణ రెడ్డి, ఎంఆర్ఓ రామకృష్ణ ఐ.టి.డి.ఏ.ఏ ఈ గోపాల్ లు ఆనాటి ఎమ్మెల్యే సున్నం రాజయ్య సమక్షంలో చర్చించి ఇల్లు కోల్పోతున్న వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం పూర్తయ్యాక మొదటగా మీకే ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు ప్రభుత్వ అధికారులు ఇండ్లు మొత్తం తొలగించి ఆ స్థానంలో డబుల్ బెడ్ రూమ్ఇండ్లు నిర్మించారని, కానీ నిర్వాసితులను ఇండ్లు కేటాయించలేదని నిర్వాసితులు సిపిఎం ఆధ్వర్యంలో భద్రాచలం ఎమ్మార్వో కు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు మాట్లాడుతూ గత తొమ్మిది ఏండ్లుగా అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులకు నిర్వాసితులు వినతి పత్రాలు అందించినా వారికి ఇండ్లు కేటాయించకపోవడం దారుణమని అన్నారు.

## మూసీ అభివృద్ధికి అండగా ఉంటాం

**ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మూసి అభివృద్ధి పేరుతో పేద, మధ్య తరగతి ఇండ్లు కులగొడతాము అంటే ఊరుకునేది లేదని ఎల్ బినగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం చైతన్యపురి డివిజన్ పరిధిలోని భవానినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ముందుగా నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే మూసినది ప్రక్షాళనలో భాగంగా మూసి అభివృద్ధికి మేము ఎప్పుడు అండగా ఉంటామని, అలాగే మూసి అభివృద్ధి పేరుతో పేద, మధ్య తరగతి ఇండ్లు కులగొడతాము అంటే ఊరుకునేది లేదని అన్నారు.ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.

# చట్టాలపై అవగాహన, న్యాయ సలహా శిబిరం




**విశ్వంభర, రంగారెడ్డి :** చేగూరు ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రంగారెడ్డి జిల్లా వారి సహకారంతో భాస్కర్ లా కాలేజ్ వారి ఆధ్వర్యంలో చట్టాల పట్ల అవగాహన , న్యాయ సలహా శిభిరము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ డి (ఎల్ హెచ్ ఎ) సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి, భాస్కర్ లా కాలేజ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి హెచ్ .సంజయ్, భాస్కర్ లా కాలేజ్ ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం .భగవద్గీత ముఖ్య అతిథిలుగా పాల్గొని, వారి ఉపన్యాసాలతో ఇప్పుడున్న చట్టాల పట్ల అవగాహన కల్పించారు.ఇట్టి కార్యక్రమంలో (డిఎల్ఎస్ఎ) పారా లీగల్ వాలంటీర్లు సంజీవ, బాల్.రెడ్డి మరియు భాస్కర్ లా కాలేజ్ అధ్యాపకులు డాక్టర్ అనిల్ సింగ్, డాక్టర్ ఎస్ .స్నేహలత, విజేత రాణి, హృషికేష్ మరియు పటాన్ ఖాన్ మరియు జెడ్పి హెచ్ ఎస్ హెడ్ మాస్టర్ రాజురెడ్డి పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన గ్రూప్ - 2 పరీక్షలు



**విశ్వంభర, భూపాలపల్లి :** రెండు రోజుల పాటు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్ -2 పరీక్షల ను జిల్లాలో 17 పరీక్ష కేంద్రాల లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగిశాయి అని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే తెలిపారు. రెండవ రోజు గ్రూప్ -%శ్రీశ్రీ% పరీక్షల సందర్భంగా జిల్లా ఎస్పీ సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు.

**విశ్వంభర, మహబూబ్ బాద్:** గ్రూప్ – 2 రాత పరీక్షలకు సంబంధించి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ శ్రీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ పరిశీలించారు. పరీక్ష సరళిని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పరిశీలించారు.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మరియు పాఠశాల, ఫతిమా హై స్కూల్ తదితర పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పోలీసు అధికారులు, సిబ్బంది అందరు బాధ్యతగా పని చేయాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష పత్రాలు స్ట్రాంగ్ రూముకు చేరే వరకు అప్రమత్తంగా ఉండాలని ఎస్పి సూచించారు.

## సీతారామచంద్రస్వామి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు సంధర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ , కమిషనర్ శ్రీధర్ చేతులు మీదుగా వాల్ పోస్టర్స్, ఇన్విటేషన్ కార్డులు ప్రారంభించి వారిని ఈఓ రమాదేవి ఆహ్వానించారు.

## ఘనంగా శశి యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహేశ్వరం నియోజకవర్గం ఆర్ కెపురం డివిజన్ యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు శశి యాదవ్ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి లు శశి యాదవ్ ను శాలువాతో సత్కరించారు. ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆశీర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు తాలటి రమేష్ నేత, గట్ల రవీంద్ర, జ్ఞానేశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు అన్నదాన వితరణ



**విశ్వంభర, షాద్ నగర్ :** పట్టణంలోని శ్రీ శివ మారుతి అయ్యప్ప గీతా మందిరంలో అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం వైభవంగా జరిగింది. మాజీ శాసనసభ్యులు ఎలగనమోని అంజయ్య యాదవ్ దంపతులు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు జరిగాయి.ఈ కార్యక్రమం లో అన్నదాత కుటుంబసభ్యులు షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ కొందుటి నరేందర్,రాజవర ప్రసాద్ స్వామి,నడికూడ రఘునాథ్ యాదవ్,సాయి,నవీన్,సత్యం స్వాములు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి



**విశ్వంభర, మహబూబ్ నగర్:** మూసాపేట మండలం జాన%శీ%పేట గ్రామానికి చెందిన సాకలి శాంతి (25) పుట్ట రాజు (18) జాన%శీ%పేట్ గ్రామం నుంచి మూసాపేట కు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గమధ్యలో పెట్రోల్ బంక్ దగ్గర గుర్తు తెలియని వాహనం ఢీకొని సాకలి శాంతి అక్కడికక్కడే మృతి చెందగా పుట్టరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై శ్రీనివాస్ ఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్ లో పంపించారు.

## గాంధీ భవన్‌లో కాంగ్రెస్ సమావేశం



**విశ్వంభర, గాంధీ భవన్ :** గాంధీ భవన్ లో కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం ఏర్పాటు చేసారు. సమీక్ష సమావేశానికి భారీగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలి వచ్చారు. సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , ఏఐసీసీ ఇంచార్జ్ లు దీపాదాస్ మున్షి , మంత్రి పొన్నం ప్రభాకర్ ,విష్ణు నాథ్ , ఇంచార్జ్, మాజీ టీపీసీసీ వి. హనుమంతు రావు, మేయర్ విజయ లక్ష్మి, డిప్యూటీ మేయర్, జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు, ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్,మాజీ ఎంపీ అజారుద్దీన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, తదితరులు ఉన్నారు.

## స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం

**విశ్వంభర, హైదరాబాద్ :** స్పీకర్ ఛాంబర్ లో బీఏసీ సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆరెస్ నుంచి హాజరైన హరీష్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ పక్ష నేత కూనమనేని సాంబశివరావు, బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరయ్యారు.

## బాపునగర్‌లో పర్యటన

**విశ్వంభర, అంబర్ పేట్ :** బాపునగర్ లో అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానిక బస్తి ప్రజలతో కలిసి స్థానికంగా ఉన్నటువంటి సమస్యలని రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు, వినియోగంలో లేనటువంటి చేతిపంపును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సంబంధిత అధికారులు సిబ్బందితో మాట్లాడుతూ వినియోగంలో లేనటువంటి చేతిపంపును వెంటనే మరమ్మతులు చేసి స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చేయాలని తెలియజేశారు. అలాగే వీలైనంత త్వరలో రోడ్ ప్యాచ్ వర్క్ పనులను చేపిస్తానని తెలియజేశారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**విశ్వంభర, అంబర్ పేట:** ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ , కార్పొరేటర్ శ అమృత తో కలిసి, నల్లకుంట డివిజన్ డాక్టర్ చారీ లేన్ లో 20. లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జిహెచ్ఎంసి అధికారులతో కలసి స్థానిక ప్రజల సమస్యలను పాదయాత్ర చేసి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు , ప్రజలు, బిఆర్ఎస్, భాజపా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్డీవో ఆధ్వర్యంలో సమావేశం

**విశ్వంభర, అచ్చంపేట :** నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం వటవర్లపల్లి పునరావాసంలో భాగంగా రెవెన్యూ ఫారెస్ట్ అధికారులు రీ లొకేషన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఎస్ డి ఎల్ సి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వటవర్లపల్లి గ్రామంలో పునరావాసం కోరుకున్న 663 కుటుంబాలను గుర్తించి సబ్ డి ఎల్ సి ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో ఆర్డీవో మాధవి ఎఫ్ డి ఓ రామ్మూర్తి దోమలపెంట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గురుమూర్తి రీ లొకేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ఏపీ నుంచి ముగ్గురు రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం

**దిల్లీ:** ఏపీ నుంచి ఎన్నికైన ముగ్గురు నేతలు రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం చేశారు. రాజ్యసభలో ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వారి చేత ప్రమాణం చేయించారు. రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ నుంచి బీద మస్తాన్‌రావు, సానా సతీష్ బాబు, బీజేపీ నుంచి ఆర్.కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే..

## రాజధాని రైతుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం: మంత్రి నారాయణ



**విశ్వంభర, మంగళగిరి:** రాజధాని రైతుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. నీరుకొండలో ఎంజీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం అమరావతిని నాశనం చేయాలని ఆర్ 5 జోన్ తీసుకొచ్చిందని ఆరోపించారు. ఆర్ 5 జోన్‌లో పట్టాలిచ్చిన పేదలకు గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో స్థలాలిస్తామని చెప్పారు. సుప్రీంకోర్టులో రాజధానిపై ఉన్న కేసులు పరిష్కరించేలా ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు . మరో 9 నెలల్లో అమరావతిలో అధికారులకు నివాసాలు అందుబాటులోకి తెస్తామన్నారు. గతంలో చెప్పిన విధంగానే రాజధానిని తప్పకుండా పూర్తిచేస్తామని.. మూడేళ్లలో ఇది సాధ్యం కానుందన్నారు. ఇప్పటికే రూ.20 వేల కోట్ల పనులకు సంబంధించిన టెండర్లకు సీఆర్‌డీఏ ఆమోదం లభించిందని.. నాలుగైదు రోజుల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి నారాయణ చెప్పారు.

## చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురు



**విశ్వంభర, అమరావతి:** పోక్సో చట్టం కింద తనపై పోలీసులు నమోదు చేసిన కేసు కొట్టివేయాలని వైసీపీనేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 24కు వాయిదా వేసింది. క్వాష్ పిటిషన్‌లో అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పిటిషనర్‌కు హైకోర్టు స్పష్టం చేసింది.

## గ్రూప్-2 రాస్తుండగా అభ్యర్థికి గుండెపోటు!

**విశ్వంభర, పటాన్‌చెరు:** మరోగంటలో గ్రూప్ 2 పరీక్ష ముగిస్తుందనగా పరీక్ష రాస్తున్న ఓ అభ్యర్థికి గుండెపోటు వచ్చింది. తక్షణమే స్పందించిన ఎస్సై అతడిని వెంటనే ఆస్పత్రిలో చేర్చి ప్రాణాపాయం తప్పించారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంగారెడ్డి జిల్లా పుల్కల్ గ్రామం లక్ష్మీనగర్‌కు చెందిన ఎల్. నగేశ్ గ్రూప్ 2 పరీక్షకు హాజరయ్యారు. నాలుగో పేపర్ రాస్తుండగా.. అతడికి గుండెపోటు వచ్చింది. దీంతో నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.
108 వాహనం వచ్చే సమయం లేకపోవడంతో పరీక్ష కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఆసిఫ్ వెంటనే స్పందించారు. మూడో అంతస్తులో ఉన్న నగేశ్‌ను భుజంపై మోసుకుంటూ కిందకి తీసుకొచ్చి.. వాహనంలో ఎక్కించుకొని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. దీంతో బాధితుడికి ప్రాణాపాయం తప్పింది. అయితే, అతడికి మూర్ఛ వ్యాధి ఉందని, గుండెపోటు కాకపోవచ్చని వైద్యులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం వేరే ఆస్పత్రికి తరలించామన్నారు.

## 70 గంటలు పనిచేస్తేనే పేదరికం కనుమరుగు

**- ఇన్ఫోసిస్ నారాయణమూర్తి**

**న్యూదిల్లీ :** దేశం పురోగతి సాధించాలంటే యువత 70 గంటలు పనిచేయాల్సిందేనని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి పేర్కొన్నారు. కోల్‌కతాలో జరిగిన ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 70 గంటల పని విధానంపై గతంలో తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. ఇన్ఫోసిస్‌ను ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ కంపెనీలతో పోల్చినప్పుడు భారతీయులు చేయాల్సింది చాలానే ఉందని అనిపిస్తుందని చెప్పారు. దేశంలో ఇంకా 80 కోట్ల మంది ఉచిత రేషన్ అందుకుంటున్నారని, దీనిని బట్టి వారంతా పేదరికంలో ఉన్నట్టేనని పేర్కొన్నారు. కాబట్టి మన ఆకాంక్షలను ఉన్నతంగా ఉంచుకోవాలని సూచించారు. మనం కాకపోతే ఇంకెవరు కష్టపడతారని ప్రశ్నించారు.



# జాకిర్ హుస్సేన్ 'వాహ్ తాజ్' కథ ఇదే..



**దిల్లీ:** తబలా మైస్ట్రో జాకిర్ హుస్సేన్.. ఆరు దశాబ్దాల తన సుదీర్ఘ సంగీత ప్రయాణంలో ఎంతోమంది సంగీతప్రియులకు ఆరాధ్యనీయుడైన విద్వాంసుడు. శాస్త్రీయ సంప్రదాయాలను ప్రపంచ సంగీతంతో మిళితం చేసి సాంస్కృతిక ఐక్యతకు చిహ్నంగా నిలిచిన కళాకారుడు. అయితే, చాలా మందికి జాకిర్ హుస్సేన్ అనగానే చటుక్కున గుర్తుకొచ్చే మరో పదం 'వాహ్ తాజ్ '. దీంతో ఆయన సంగీతప్రియులకే కాకుండా యావత్ దేశంలోని ప్రతీ ఇంటికీ చేరువయ్యారు. అదే 1990ల్లో ఆయన నటించిన తాజ్‌మహల్ టీ ప్రకటన. అసలీ యాడ్ వెనక స్టోరీ ఏంటి? దీని గురించి ఆయన ఏమన్నారు? ఓసారి గుర్తుచేసుకుందాం..!

**వాహ్ తాజ్ అనాలి..**

జాకిర్ హుస్సేన్ తబలా వాయిస్తుంటే ఆహ్లాదంగా ఉంటుందంటారు సంగీతప్రియులు. వర్షపు చినుకుల సవ్వడి నుంచి పరమశివుడి ఢమరుకం ధ్వని వరకు ప్రతి శబ్దాన్ని తన తబలాపై ఆయన పునఃసృష్టి చేసేవారు. అందుకే ఆయన ప్రదర్శనను తిలకించే వీక్షకులంతా 'వాహ్ ఉస్తాద్' అంటూ కొనియాడేవారు. దీన్ని ఆధారంగా చేసుకొనే హిందుస్థాన్ థాంప్సన్ అసోసియేట్స్ కంపెనీ ఓ యాడ్ రూపొందించింది. అదే 'తాజ్ మహల్ టీ' ప్రకటన.
ఇందులో ఆగ్రాలోని ప్రఖ్యాత కట్టడం తాజ్‌మహల్ ముందు జాకిర్ హుస్సేన్ కూర్చుని తబలా వాయిస్తుంటారు. తన కళను ఉత్తమంగా తీర్చిదిద్దుకునేందుకు సాధన చేస్తుంటారు. అప్పుడే ఈ టీని కూడా ఉత్తమంగా అందించేందుకు ఎన్నో రకాల నాణ్యతా పరీక్షలు చేశాం అంటూ బ్యాక్‌గ్రౌండ్‌లో వాయిస్ వినిపిస్తుంటుంది. వీడియోలో చివరగా ఆయన వాయిద్యానికి మైమర్చిపోయిన ఓ అమ్మాయి జాకిర్‌కు ఓ కప్పు టీ అందిస్తూ 'వాహ్ ఉస్తాద్' అని అంటుంది. దానికి ఆయన బదులిస్తూ 'వాహ్ ఉస్తాద్ కాదు.. వాహ్ తాజ్ అనండి' అని అంటారు.
మరో యాడ్‌లో ఓ బాలుడితో కలిసి తబలా వాయిస్తూ ఉంటారు. బాలుడి ప్రతిభను మెచ్చి జాకిర్ 'వాహ్ ఉస్తాద్' అంటారు. దీనికి ఆ బాలుడు 'అరె హుజూర్, వాహ్ ఉస్తాద్ కాదు.. వాహ్ తాజ్ అనాలి' అనడంతో వారిద్దరూ నవ్వులు చిందిస్తారు. ఈ యాడ్ అప్పటికీ, ఇప్పటికీ ప్రత్యేకమే!

**సొంత ఖర్చులతో ఆగ్రాకు వచ్చి..**

1966లో ఈ తాజ్‌మహల్ టీని కంపెనీ కోల్‌కతాలో ప్రారంభించింది. తొలుత దీని ప్రచారం కోసం జాకిర్ హుస్సేన్‌ను అనుకోలేదట. నటీనటులు జీనత్ అమన్, మాళవిక తివారీ వంటి వారు దానిలో కన్పించారు. అయితే అప్పట్లో కేఎస్ చక్రవర్తి అనే వ్యక్తి హిందుస్థాన్ థాంప్సన్ అసోసియేట్స్‌లో కాపీరైటర్‌గా పని చేసేవారు. ఆయనకు తబలా అంటే చాలా ఇష్టం. ఓసారి జాకిర్ హుస్సేన్ ప్రదర్శనను తిలకిస్తుంటే.. తమ టీ యాడ్‌కు ఆయన సరిగ్గా సరిపోతారని అనిపించిందట. అదే విషయాన్ని యాజమాన్యానికి చెప్పగా వారు జాకిర్‌ను సంప్రదించారు. ఈ యాడ్ కాన్సెప్ట్ ఆయనకూ నచ్చడంతో సొంత ఖర్చులతో శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ఆగ్రాకు వచ్చినట్లు అప్పట్లో కథనాలు వచ్చాయి.

**కనిపించింది 30 సెకన్లే అయినా..**

ఈ ప్రకటనలో నటించడం గురించి గతంలో జాకిర్ హుస్సేన్ ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. ''నా పేరు వినగానే 'వాహ్ తాజ్' అని చాలామంది చెబుతారు. సాధారణంగా బాలీవుడ్ మ్యూజిక్‌తో పోలిస్తే శాస్త్రీయ సంగీతానికి ఆదరణ కాస్త తక్కువే. శాస్త్రీయ కళాకారులను కూడా అంతగా ఎవరూ గుర్తుపెట్టుకోరు. ప్రజలకు చేరువయ్యేందుకు మాలాంటి వారికి ఏదో ఒక వేదిక కావాలి. 'తాజ్ టీ' నాకు అలాగే ఉపయోగపడింది. ఆ యాడ్‌లో నేను కన్పించింది 30 సెకన్లే అయినా.. నన్ను చాలామంది గుర్తుపట్టేలా చేసింది. నేను ఎవరనే ఆసక్తిని మరింత పెంచింది'' అని జాకిర్ నాడు చెప్పారు.

# కుటుంబం కోసం రాజ్యాంగాన్ని మార్చివేశారు

**కాంగ్రెస్‌పై సీతారామన్ విమర్శలు**



**దిల్లీ:** భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా రాజ్యసభలో సోమవారం ప్రత్యేక చర్చ జరుగుతోంది. అధికార పక్షం తరఫున కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ చర్చను ప్రారంభించారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కుటుంబం కోసం రాజ్యాంగాన్నే మార్చివేశారని దుయ్యబట్టారు.
''రెండో ప్రపంచయుద్ధం తర్వాత దాదాపు 50 దేశాలకు స్వాతంత్ర్యం లభించింది. అవి రాజ్యాంగాన్ని రచించుకున్నాయి. కాలక్రమంలో పలు దేశాలు తమ రాజ్యాంగం అసలు ఉద్దేశాన్ని మార్చివేశాయి. కానీ మన రాజ్యాంగం మాత్రం కాలపరీక్షలను తట్టుకొని నిలబడింది. వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేసేందుకు కాంగ్రెస్ సవరణలు చేసింది. ఇప్పుడు మాత్రం రాజ్యాంగ పరిరక్షణ గురించి ప్రసంగాలు చేస్తోంది'' అని సీతారామన్ మండిపడ్డారు.
ఇందిర హయాంలో విధించిన ఎమర్జెన్సీ, 42వ రాజ్యాంగ సవరణ గురించి ఆమె ప్రస్తావించారు. ''కాంగ్రెస్ చేసిన సవరణలు రాజ్యాంగం బలోపేతానికి కాదు. అధికారంలో ఉన్నవారిని రక్షించుకోవడానికి.. కుటుంబం కోసం ఈ ప్రక్రియను ఉపయోగించారు'' అని వ్యాఖ్యలు చేశారు. ఇందిర అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని నిలిపివేయాలని ప్రయత్నించారని భాజపా చీఫ్, కేంద్రమంత్రి జేపీ నడ్డా విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నుంచి అభ్యంతరం వ్యక్తమైంది.

# సీఎం అయ్యాక మీ వైఖరి ఎందుకు మారింది

**- ఒమర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ అభ్యంతరం**



**శ్రీనగర్:** కాంగ్రెస్ పార్టీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎంలను) నిందించడాన్ని వదిలేసి ఫలితాలను అంగీకరించాలని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ అభ్యంతరం తెలిపారు. ఎన్నికల్లో ఈవీఎంలను ఉపయోగించడం వల్ల అవకతవకలు జరిగినట్లు ఆరోపించినది ఇండియా మిత్రపక్షాలైన సమాజ్‌వాదీ పార్టీ, ఎన్సీపీ (ఎస్పీ), శివసేన (యూబీటీ) నేతలే అని ఆయన పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ తీర్మానం ఎన్నికల కమిషన్ గురించి మాత్రమే ప్రస్తావించిందని అన్నారు. ఒమర్ అబ్దుల్లా తాను ఎదుర్కొన్న వాస్తవాలను గుర్తుంచుకొని మాట్లాడాలని.. తన వైఖరిని మార్చుకోవాలని సూచించారు. ఇన్నాళ్లు కూటమిలో ఒకరిగా ఉన్న ఒమర్ ముఖ్యమంత్రి అయ్యాక భాగస్వాములతో ఈవిధంగా ఎందుకు ప్రవర్తిస్తున్నారు అని ప్రశ్నించారు.
ఇటీవల జరిగిన హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం పొందిన అనంతరం ఇండియా కూటమి నేతలు మాట్లాడుతూ ఓటింగ్ ప్రక్రియలో ఈవీఎంల వినియోగం వల్ల అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఎన్నికల్లో ఇకపై బ్యాలెట్ పేపర్‌ను ఉపయోగించాలని డిమాండ్ చేశారు. వారి ఆరోపణలను ఖండించిన భాజపా మీరు గెలిస్తే ఈవీఎంలు మంచివి.. ఓడిపోతే కాదా అంటూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ మిత్రపక్షానికి చెందిన ఒమర్ అబ్దుల్లా ఆ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటం గమనార్హం. దీంతో ఇండియా కూటమిలో తలెత్తుతున్న చీలికలు మరోసారి బయటపడ్డాయని భాజపా నేతలు పేర్కొంటున్నారు.
ఆదివారం పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ..'పార్లమెంటులో వందమందికి పైగా సభ్యులు అదే ఈవీఎంలతో మీ పార్టీ తరఫున నెగ్గినప్పుడు దానిని ఘన విజయంగా తీసుకున్నారు. ఇప్పుడు మీరు అనుకున్న ఫలితాలు రాకపోయేసరికి ఈవీఎంలను నిందిస్తున్నారు. పక్షపాతంతో కాకుండా సిద్ధాంతాల ఆధారంగానే నేను మాట్లాడుతున్నా. ఓటింగు విధానంపై విశ్వాసం లేనప్పుడు ఎన్నికల్లో పోటీ చేయకూడదు. ఈవీఎంలతో ఏదైనా సమస్య ఉంటే దానిపై పోరాటం చేయాలి. ఫలితాలకు ఈవీఎంలతో సంబంధం లేదు. ఓటర్లు ఒకసారి మనల్ని ఎన్నుకుంటారు. మరోసారి ఎన్నుకోరు. నేనే దీనికి ఉదాహరణ. లోక్‌సభ ఎన్నికల్లో నేను ఓడిపోయాను. సెప్టెంబరులో అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ సాధించాను. యంత్రాలను నేనెప్పుడూ ఆడిపోసుకోలేదు'' అని అన్నారు.

## ఈవీల ఛార్జింగ్ అవసరాలకు రూ.16 వేల కోట్లు అవసరం

**ముంబయి:** భారత్ తన ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ అవసరాలను తీర్చడానికి ఇప్పుడిప్పుడే సిద్ధమవుతోందని, 2030 నాటికి 30% విద్యుదీకరణ సాధించడానికి రూ.16,000 కోట్ల మూలధన వ్యయం అవసరమని ఫిక్కీ సోమవారం తన నివేదికలో తెలిపింది. అధిక ఈవీ డిమాండ్ ఉన్న టాప్ 40 నగరాలకు ప్రాధాన్యత ఇవ్వడం చాలా కీలకమని ఫిక్కీ గుర్తించింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా ఈవీల వృద్ధికి తోడ్పడుతున్నాయి. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, మూడు చక్రాల వాహనాలు, బస్సులకు ఆర్థిక ప్రోత్సాహకాలను అందించే పీఎం ఈడ్రైవ్ పథకంతో సహా ఈవీ వృద్ధిని పెంచడానికి భారత్ అనేక ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టింది.
పీఎం ఈడ్రైవ్ పథకం..భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేయడానికి ప్రజలకు డిస్కౌంట్లు, ఆర్థిక సహాయం వంటి ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఫేమ్ 2 పథకం 202324లో ముగిసిన తర్వాత, పీఎం ఈడ్రైవ్ పథకం 202526 వరకు కొనసాగుతుంది. దీనిపై బ్యాటరీ సామర్థ్యం ఆధారంగా ప్రోత్సాహకాలు లభిస్తాయి. అదనంగా, ఈవీలు.. సంప్రదాయ వాహనాలకు వర్తించే 2850%తో పోలిస్తే తక్కువ(5%) జీఎస్టీ రేటు నుంచి ప్రయోజనం పొందొచ్చు. స్థానిక ఉత్పత్తిని ప్రోత్సహించడానికి, దిగుమతి చేసుకున్న ఈవీ భాగాలు, వాహనాలపై ప్రభుత్వం అధిక పన్నులు విధిస్తోంది.



## యాచకులకు డబ్బులిస్తే జైలుకే

**ఇండోర్‌లో కొత్త చట్టం**
**నిషేధం ఇప్పటికే అమలు**
**పైలట్ ప్రాజెక్టుగా కేంద్ర పథకం**



**ఇండోర్ :** మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరాన్ని యాచకులు లేని నగరంగా మార్చాలని సంకల్పించిన జిల్లా యంత్రాంగం ఈ దిశలో మరో అడుగు ముందుకేసింది. ఇప్పటికే ఇక్కడ భిక్షాటనపై నిషేధం ఉండగా, తాజాగా యాచకులకు డబ్బులు ఇచ్చేవారిపైనా కఠినంగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించారు. అలాంటి వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. కొత్త ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి ఈ కొత్త చట్టం అమలులోకి రానున్నట్టు జిల్లా కలెక్టర్ ఆశిష్ సింగ్ తెలిపారు. పుణ్యం కోసం దానం చేసి కష్టాలు పాలు కావద్దని కలెక్టర్ ప్రజలను హెచ్చరించారు. అయితే కలెక్టర్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయంపై విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. పేదవాడికి కప్పు చాయ్ కొనివ్వడం కూడా నేరమేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా 10 నగరాలను యాచకులు లేని నగరాలుగా మార్చాలన్నది కేంద్ర ప్రభుత్వ సంకల్పం. ప్రయోగాత్మకంగా ఈ పథకాన్ని ఇండోర్‌లో అమలు చేయాలని నిర్ణయించారు.



## అమ్రాబాద్ మాదిరిగా కవ్వాల్‌లోనూ ప్రత్యేక చర్యలు: మంత్రి కొండా సురేఖ

విశ్వంభర, హైదరాబాద్: అమ్రాబాద్ మాదిరిగా కవ్వాల్‌లోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. ఆ ప్రాంతంలో విద్య, ఉపాధి దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. పులి దాడుల్లో చనిపోతే రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు.అంతకు ముందు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. కవ్వాల్‌లో ఇటీవల పులులు దాడులకు పాల్పడుతున్నాయని చెప్పారు. అమ్రాబాద్ మాదిరిగా కవ్వాల్‌లోనూ చర్యలు తీసుకోవాలన్నారు. అడవి బిడ్డలు అడవిని ధ్వంసం చేయకుండా జీవిస్తున్నారని భారాస ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ చెప్పారు. పులి దాడుల్లో మరణించిన వారికి రూ.20 లక్షలు ఆర్థిక సాయం అందజేయాలని కోరారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఉచిత వైద్య శిబిరం



**విశ్వంభర, కల్వకుర్తి :** కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండల పరిధిలోని అన్మాస్ పల్లి గ్రామంలో ఉప్పల చారిట్రబుల్ ట్రస్ట్, జర్పుల రాధకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేశారు. డా.ఉప్పల అఖిల్ బృందం కామినేని హాస్పిటల్ సహకారంతో 255 మంది గ్రామస్తులు వైద్య పరీక్షలు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం వల్ల నిర్వాహకులకు, వైద్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేష్, కడ్తాల్ మండల మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, వైస్ ఎంపీపీ బావాండ్లపల్లి ఆనంద్, జోగు విరయ్య, కృష్ణయ్య, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు మహేష్ యాదవ్, కంబాల రమేష్, ప్రేమ్ కుమార్, శ్రీను, కొప్పు కృష్ణ, పాండు, వగ్గు మహేష్, కృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

**వసతి గృహంలో**

## కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

**మెనూ పాటించని సిబ్బంది సస్పెండ్!**

**విశ్వంభర,భువనగిరి :** భువనగిరి పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్న భోజనంలో కొత్త మెనూ పాటించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు స్వయంగా మధ్యాహ్న భోజనాన్ని వడ్డించిన కలెక్టర్.. గుడ్లు నాణ్యతతో లేకపోవడం, పిల్లలతోనే పనిచేయించడం, విద్యార్థులకు పెరుగుకు బదులుగా మజ్జిగ సరఫరా చేయడం, డైనింగ్ హాలులో అపరిశుభ్రతను గుర్తించి.. సిబ్బంది తీరుపై మండిపడ్డారు. కేర్ టేకర్ రమేశ్‌ను సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.





## చాంపియన్ ట్రోఫీతో స్వదేశంలో అడుగుపెట్టిన గుకేశ్

**చెన్నై:** ప్రపంచ చెస్ చాంపియన్‌గా 18 ఏళ్ల గుకేశ్ అవతరించిన విషయం తెలిసిందే. సింగపూర్‌లో జరిగిన ఫిడే వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌లో చైనా క్రీడాకారుడు డింగ్ లిరెన్‌ను ఓడించి అతను విశ్వ విజేతగా నిలిచాడు. ఆ టైటిల్‌ను అందుకున్న అతిపిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. ఈ నేపథ్యంలో గుకేశ్ తాజాగా స్వదేశానికి చేరుకున్నారు.సోమవారం ఉదయం తమిళనాడు రాజధాని చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయ్యారు. ఈ సందర్భంగా గుకేశ్‌కు ఘన స్వాగతం లభించింది. పాఠశాల విద్యార్థులు, అధికారులు గుకేశ్‌ను ఘనంగా స్వాగతించారు. భారత జెండాలు ప్రదర్శిస్తూ పూల వర్షంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుకేశ్ మాట్లాడుతూ.. తనకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## ప్లేయర్లే తెలుసుకోవాలి.. ఇక్కడెవరూ ఆడించరు

**- పృథ్వీ షా కెరీర్‌పై శ్రేయస్ అయ్యర్**



**ముంబయి:** అత్యంత ప్రతిభావంతుడిగా పేరొందిన యువ క్రికెటర్‌కు అవకాశాలు మాత్రం ఆమడదూరంలో ఉంటున్నాయి. ఇటీవల జరిగిన ఐపీఎల్ మెగా వేలంలోనూ ఏ ఫ్రాంచైజీ కూడా అతడిని తీసుకొనేందుకు ఆసక్తి చూపించలేదు. అతడే భారత యువ ఆటగాడు పృథ్వీ షా . దేశవాళీ క్రికెట్‌లోనూ చోటు దక్కడం కష్టంగా మారింది. అయితే, పంజాబ్ కింగ్స్ రూ. 26.75 కోట్లు వెచ్చించి మరీ దక్కించుకున్న శ్రేయస్ అయ్యర్ డొమిస్టిక్ క్రికెట్‌లో మెరిసి జాతీయ జట్టులోకి రావాలనే పట్టుదలతో ఉన్నాడు. గతంలో పృథ్వీతో కలిసి ఆడిన అనుభవం శ్రేయస్‌కు ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పృథ్వీ కెరీర్‌పై శ్రేయస్ ఆసక్తి వ్యాఖ్యలు చేశారు.

''వ్యక్తిగతంగా నాకు పృథ్వీ షా బాగా తెలుసు. అతడు గాడ్ గిఫ్టెడ్ ప్లేయర్. షా నైపుణ్యాలు చాలా సహజంగా ఉంటాయి. కానీ, పని నిబద్ధత అత్యంత కీలకం. అతడు దానిని మెరుగుపర్చుకోవాలి. ఇదే విషయాన్ని గతంలో నేను చాలా ఇంటర్వ్యూల్లో చెప్పా. అవకాశాలకు, ఆటకు ఆకాశమే హద్దు. నేర్చుకోవడానికీ అంతే. నిరంతరం క్రికెట్‌లో టెక్నిక్స్ అందిపుచ్చుకోవడంతోపాటు ప్రవర్తనను మార్చుకోవాలి. ఆటపట్ల ప్యాషన్‌తో ఉండాలి.మీరు ఎవరైనా మారమని పృథ్వీని బలవంతం చేశారా? అని అడగొచ్చు. కానీ, మేం చేయలేదు. ఎందుకంటే ఇప్పటికే పృథ్వీ చాలా క్రికెట్ ఆడిన అనుభవం కలిగిన క్రికెటర్. ప్రతి ఒక్కరూ అది చేయ్... ఇది చేయ్‌మని చెప్పే ఉంటారు. కానీ, వాటన్నింటినీ బేరీజు వేసుకొని అనుసరించాల్సింది పృథ్వీనే. ఇక్కడెవరూ పిల్లలను ఆడించి జోలపాడటానికి ఉండరు. ఈ స్థాయిలో ఆడే ప్రతి ప్రొఫెషనల్ ప్లేయర్‌కు ఏం చేస్తున్నాం? ఏం చేయాలనేదానిపై అవగాహన ఉండాలి. తప్పనిసరిగా తెలుసుకోవాలి. గతంలో ఇలాంటి పరిస్థితులను ఎన్నోసార్లు ఎదుర్కొన్నాడు. ప్రశాంతంగా కూర్చొని ఏం చేయాలి అనే విషయాన్ని ఆలోచించాలి. సమాధానం తప్పకుండా దొరుకుతుంది. అదే చేయాలని ఎవరూ బలవంతపెట్టరు'' అని శ్రేయస్ అయ్యర్ వెల్లడించాడు.

# కోహ్లీ.. సచిన్ ఆట తీరుని గుర్తు చేసుకో!



**ముంబయి:** క్రికెట్‌లో అత్యంత కళాత్మకమైన ఓ షాట్ కింగ్ కోహ్లీ కెరీర్‌ను కబళిస్తోంది. ప్రత్యర్థులు వేస్తున్న ఉచ్చులో పడేట్లు చేస్తోంది. అదే కవర్ డ్రైవ్. సాధారణంగా క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాటర్లు ఆడే కవర్ డ్రైవ్ చూడడానికి రెండు కళ్లూ చాలవు. భారత క్రికెట్‌లో సచిన్, ద్రవిడ్ , లక్ష్మణ్.. ప్రస్తుత తరంలో విరాట్ అద్భుతంగా ఆడగలరు. కానీ, ఈ షాట్ ఆడాలంటే ఆఫ్‌సైడ్ వెళ్లే బంతులను లక్ష్యంగా చేసుకోవాల్సి ఉంటుంది. బ్యాటర్లను ఊరించేందుకు బౌలర్లు వాటినే ఆయుధాలుగా వాడుతుంటారు. లెజెండ్ సచిన్ కూడా ఓ సారి ఆసీస్ టూర్‌లో ఈ ఉచ్చులో చిక్కినా.. చాలా ఓర్పుగా దాని నుంచి బయటపడి ఏకంగా 241 పరుగులు చేశాడు.

**కోహ్లీ పదే పదే.. టెస్ట్ సగటుపై కూడా ఎఫెక్ట్..**

తాజాగా కోహ్లీ ఇప్పుడు బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో మూడు సార్లు ఇలాంటి షాట్‌కే యత్నించి వికెట్ పోగొట్టుకొన్నాడు. అడిలైడ్ టెస్ట్‌లో ఒకేరకంగా అవుట్ కావడం ఆసీస్ శిబిరంలో ఉత్సాహాన్ని పెంచుతోంది. గబ్బా టెస్ట్‌కు ముందు కోహ్లీ ఈ బలహీనత అధిగమించేందుకు మైదానంలో శ్రమించాడు.. కానీ, నేడు తొలి ఇన్నింగ్స్‌లో హేజిల్ ఆఫ్‌సైడ్ వేసిన బంతిని ఆడేందుకు ప్రయత్నించి కీపర్ అలెక్స్ కేరీకి దొరికిపోయాడు. వాస్తవానికి ఆఫ్‌సైడ్ బంతులను కదిలించే అలవాటు కోహ్లీకి ఉంది. దీని కారణంగా అతడి టెస్ట్‌మ్యాచ్‌ల సగటు కూడా దెబ్బతిందని వ్యాఖ్యాత, మాజీ క్రికెటర్ మంజ్రేకర్ పేర్కొన్నాడు. 50+గా ఉన్న సగటు కాస్తా 48కి చేరిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల బంగ్లాదేశ్ సిరీస్‌లో కొత్త బౌలర్ హసన్ మహమూద్ కూడా కోహ్లీని కవర్ డ్రైవ్ కోసం కవ్వించి వికెట్ తీసుకొన్నాడంటే ప్రత్యర్థులు దానిని ఎలా వాడుకొంటున్నారో అర్థం చేసుకోవచ్చు. కోహ్లీ చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ కూడా 2022లో ఓ యూట్యూబ్ ఛానెల్‌తో మాట్లాడుతూ కోహ్లీ ఆఫ్‌స్టంప్‌నకు దూరంగా వెళ్లే బంతులను ఇబ్బంది పడుతూ ఆడటాన్ని గమనించినట్లు వెల్లడించారు.

**సీనియర్లు ఏం చెబుతున్నారు..?**

కోహ్లీ అవుటైన తీరుపై భారత మాజీ సునీల్ గావస్కర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా స్పందిస్తూ.. గతంలో సచిన్ తెండూల్కర్ ఈ బలహీనతను ఎలా అధిగమించాడో కోహ్లీ పరిశీలించాలన్నాడు. 2004లో లిటిల్‌మాస్టర్ ఇలాంటి సమస్య నుంచి బయటపడటం కోసం ఏకంగా కవర్ డ్రైవ్ ఆడటమే మానేశాడని గుర్తు చేశాడు. ''నెట్స్‌లో సాధన చేయడం వేరు.. మ్యాచ్‌లో ఆడటం వేరు. మైండ్‌సెట్ పూర్తిగా మారిపోతుంది. ప్రాక్టీస్‌లో ఏమి జరుగుతుందో నీకు తెలుసు. కానీ, మ్యాచ్‌లో అలా కాదు.. వికెట్ పోతే.. మైదానం వీడాల్సిందే.

2004లో ఇలాంటి పరిస్థితిలో సచిన్ ఏం చేశాడో కోహ్లీ పరిశీలించాలి. నాడు ఆసీస్ పర్యటన తొలి మూడు మ్యాచ్‌ల్లో సచిన్ ఆఫ్ స్టంప్‌నకు దూరంగా వెళ్లే బంతులకే స్లిప్, షార్ట్ గల్లీలో క్యాచ్‌లు ఇచ్చి ఔటయ్యాడు. ఇక సిడ్నీ టెస్ట్‌లో కవర్స్ వైపు అసలు ఆడకూడదని నిర్ణయించుకొన్నాడు. బౌలర్ ఫాలోత్రూ మధ్యలో ఆడాడు. మిడాఫ్ ఫీల్డర్ పైన ఆడాల్సిన షాట్లను వదిలేశాడు. మ్యాచ్ మొత్తంలో ఒక్క కవర్ డ్రైవ్ ఆడాడు. అది కూడా అతడి వ్యక్తిగత స్కోర్ 200 220 మధ్యలో ఉన్నప్పుడు. మనసుపై ఆ స్థాయి నియంత్రణ నీకుండాలి'' అని సునీల్ గావాస్కర్ సూచించాడు.

**సచిన్ అసాధారణ నిర్ణయం..**

సచిన్ ట్రేడ్‌మార్క్ షాట్లలో కవర్ డ్రైవ్ ఒకటి. తన కెరీర్‌లో ఆ షాట్‌కు ప్రయత్నించి పలు మార్లు వికెట్ సమర్పించుకొన్నాడు. చివరికి అదే భారంగా మారింది. బ్రెట్‌లీ, ఆండీ బికెల్, జాసన్ గిలెస్పీ వంటి వారికి అయాచిత వరంగా మారింది. దీంతో సిడ్నీ టెస్ట్‌లో ఆ షాట్‌నే ఆడకూడదని సచిన్ అసాధారణ నిర్ణయం తీసుకొన్నాడు. దీనికి అనుగుణంగా టెక్నిక్, ఆలోచనాతీరులో మార్పులు చేసుకొన్నాడు. లెగ్‌సైడ్ ఆటపై దృష్టిపెట్టాడు. దీంతో ఆసీస్ బౌలర్ల ఆశలపై నీళ్లు చల్లాడు. ఈ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో అభేద్యంగా 241 పరుగులు చేశాడు. ఈ క్రమంలో 436 బంతులను ఎదుర్కొన్నాడు. ప్రత్యర్థికి ఒక్క ఛాన్స్ కూడా ఇవ్వలేదు. ఫలితంగా భారత్ 705/7 పరుగులకు డిక్లేర్ చేసింది. వాస్తవానికి అప్పటికే వరుసగా 13 ఇన్నింగ్స్‌ల్లో సచిన్ శతకం చేయలేకపోయాడు.

**కోహ్లీకి ఇంకా అవకాశాలున్నాయి..**

కోహ్లీ ఈ సిరీస్‌లో పెర్త్ మైదానంలోని శతకం మినహా మరే ఇన్నింగ్స్‌లో 20 పరుగులు కూడా చేయలేదు. అతడికి ఇప్పటికీ పుంజుకొని మైదానంలో విజృంభించడానికి సమయం ఉందని గావస్కర్ వంటి సీనియర్లు బలంగా విశ్వసిస్తున్నారు. ''మనసుపై నియంత్రణ లేకుండానే కోహ్లీ టెస్ట్‌ల్లో 9 వేల పరుగులు, 32 శతకాలు చేయడం సాధ్యం కాదు. ఇంకా సెకండ్ ఇన్నింగ్స్, రెండు టెస్టులు ఉన్నాయి. స్లిప్‌లో ఇద్దరు, గల్లీలో ఇద్దరిని ఫీల్డింగ్‌లో ఉంచినా.. సచిన్ ఆడాడు. కోహ్లీ తాను గతంలో భారీ స్కోర్లు చేసిన ఇన్నింగ్స్ వీడియోలు కూడా చూసుకోవచ్చు'' అని గావస్కర్ పేర్కొన్నాడు.

## మూడో రోజు ఆటలో భారత్‌ను విసిగించిన వరుణుడు!

**పైచేయి సాధించిన ఆసీస్, 51పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన భారత్**



**గబ్బా:** గబ్బా టెస్టులో ఆసీస్ బౌలర్లతోపాటు భారత బ్యాటర్లను వరుణుడు కూడా విసిగించాడు. వర్షం కారణంగా సోమవారం 33 ఓవర్ల ఆట మాత్రమే సాగింది. అందులోనూ టీమ్ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 17 ఓవర్లను ఎదుర్కొని 51/4 స్కోరుతో నిలిచింది. క్రీజ్‌లో కేఎల్ రాహుల్ (33*), కెప్టెన్ రోహిత్ శర్మ ఉన్నారు. వర్షం అంతరాయం కలిగించడంతోనే భారత్ మరిన్ని వికెట్లను చేజార్చుకోలేదని మరోవైపు క్రికెట్ అభిమానులు కామెంట్లు చేస్తుండటం గమనార్హం. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ఇంకా 394 పరుగులు వెనకబడి ఉంది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

**అవేం షాట్లు?**

ఆస్ట్రేలియాను 445 పరుగులకు ఆలౌట్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌ను బౌండరీతో ప్రారంభించింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (4) మొదటి బంతినే ఫోర్ కొట్టాడు. అంతా ఓకే అనుకొనేలోపే రెండో బాల్‌కు యశస్వి దొరికిపోయాడు. ఈసారి మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లోనే ఔట్ కావడం గమనార్హం. గత టెస్టులో మాదిరిగా ఎల్బీ కాకుండా.. షార్ట్ మిడాఫ్‌లో మిచెల్ మార్ష్ చేతికి యశస్వి క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన శుభ్‌మన్ గిల్ (1) మూడో బంతికే ఆఫ్‌సైడ్ షాట్‌కు యత్నించి స్లిప్‌లో మార్ష్‌కు దొరికిపోయాడు. ఇక విరాట్ కోహ్లీ (3) తన బలహీనతను మరోసారి బయటపెట్టాడు. ఆఫ్ సైడ్ పడిన బంతిని ఆడి కీపర్‌కు విరాట్ క్యాచ్ ఇచ్చాడు. ఈ దశలో రెండుసార్లు వర్షం రావడంతో మ్యాచ్ సాగలేదు. మళ్లీ ఆట ప్రారంభమైన కాసేపటికే రిషభ్ పంత్ (9)ను కమిన్స్ బోల్తా కొట్టించాడు. ఇది కూడా వికెట్ కీపర్ అలెక్స్ కేరీ చేతుల్లోనే పడింది.

**కేఎల్ ఒక్కడే..**

వరుణుడు అంతరాయం కలిగిస్తూ ఓ వైపు విసిగించాడు. మరో వైపు ఆసీస్ బౌలర్ల దెబ్బకు వికెట్లుపడ్డాయి. అయినా సరే కేఎల్ రాహుల్ మాత్రం తన ఏకాగ్రతను కోల్పోలేదు. హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో తాను ఎదుర్కొన్న రెండో బంతే ఎడమ చేయి మణికట్టు వద్ద బలంగా తాకింది. వైద్యచికిత్స చేయించుకుని.. మరింత సాధికారికంగా ఆడాడు. చూడచక్కని షాట్లతో అలరించాడు. నాలుగు బౌండరీలు బాదాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 2.. జోష్ హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్ చెరో వికెట్ తీశారు. ఇప్పటికే భారత్ బాగా వెనకబడి ఉంది. ఈక్రమంలో క్రీజ్‌లో ఉన్న రోహిత్ కేఎల్ రాహుల్‌తో పాటు బ్యాటర్లు నితీశ్ రెడ్డి, రవీంద్ర జడేజాపైనే అంతా భారం ఉంది. ఫాలోఆన్ గండం నుంచి తప్పించుకోవాలంటే కనీసం 246 పరుగులు చేయాలి. దీంతో టీమ్ఇండియా ఇంకా 195 రన్స్ చేయాలి.

## గబ్బా టెస్ట్‌లో బుమ్రా డబుల్ ఫీట్..

**ఆస్ట్రేలియా టూర్‌లో 50 టెస్ట్ వికెట్లు..!**

గబ్బా: ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులో మూడోరోజు భారత స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా డబుల్ ఫీట్ సాధించాడు. బ్రిస్బేన్‌లోని గబ్బా వేదికగా జరుగుతున్న బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బుమ్రా 76 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. ఈ సిరీస్‌లో టీమిండియా సక్సెఫుల్ బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. పెర్త్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో జట్టు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.

మూడో టెస్ట్‌లో రెండోరోజు ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్ జోడీ నాలుగో వికెట్‌కు భారీ భాగస్వామ్యం నెలకొల్పింది. ఈ భాగస్వామ్యానికి బుమ్రా బ్రేక్ వేస్తూ.. ఇద్దరిని పెవిలియన్‌కు పంపాడు. కొత్త బంతితో తొలి సెషన్‌లో ఆస్ట్రేలియాను ఇబ్బందులకు గురి చేశాడు. ఉస్మాన్ ఖవాజా, నాథన్ మెక్‌స్వీనీలను అవుట్ చేసి షాక్ ఇచ్చాడు. ఆ తర్వాత ట్రావిస్ హెడ్, స్మిత్ జోడీ నాలుగో వికెట్‌కు 242 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయగా.. ఇద్దరిని వరుసగా ఔవుట్ చేశాడు. స్మిత్‌ను రోహిత్ శర్మ క్యాచ్ పట్టగా.. వికెట్ కీపర్ రిషబ్ పంత్ చేతికి హెడ్ చిక్కాడు. అలాగే, మిచెల్ మార్ష్ ఇచ్చిన క్యాచ్ బుమ్రా ఒడిసిపట్టాడు.

ప్రసన్నను అధిగమించిన మిస్టరీ బౌలర్..

మూడోరోజు సైతం బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మిచెల్ స్టార్క్.. బుమ్రా బౌలింగ్‌లో పంత్‌కి క్యాచ్ అవుట్ అయ్యాడు. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు బుమ్రా అత్యధికంగా వికెట్లు తీశాడు. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు 18 వికెట్లు తీశాడు. మిస్టరీ బౌలర్ స్పెల్ బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానంలో టీమిండియా బౌలర్ అత్యుత్తమ ప్రదర్శన ఇదే. ఇంతకు ముందు జనవరి, 1968లో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 104 పరుగులకు ఆరు వికెట్లు తీసిన ఎరపల్లి ప్రసన్నను అధిగమించాడు.

ఆస్ట్రేలియా గడ్డపై 50 వికెట్లు..

ఆస్ట్రేలియా పర్యటనలో జస్ప్రీత్ బుమ్రా 50 టెస్ట్ వికెట్ల ఫీట్‌ను అందుకున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై బుమ్రా కంటే ఉమేశ్ యాదవ్ ఎక్కువ వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా ఘనత సాధించాడు. ఉమేశ్ 17 మ్యాచ్‌ల్లో 53 వికెట్లు తీశాడు. బుమ్రా కేవలం 10 మ్యాచ్‌ల్లోనే 50 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నిలిచాడు. ఈ ఫాస్ట్ బౌలర్ సగటు 17.62 కాగా.. కపిల్‌దేవ్ రికార్డును సైతం అధిగమించే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా పర్యటనలో కపిల్ దేవ్ 51 వికెట్లు పడగొట్టాడు. ఈ మూడో టెస్ట్‌లోనే ఉమేశ్, కపిల్ దేవ్‌ను అధిగమించే ఛాన్స్ ఉన్నది.



# రోహిత్ నా సోదరుడు.. మరింత శక్తితో దూకుడుగా ఆడాలి

**- ఆసీస్ మాజీ కెప్టెన్ మాథ్యూ హేడెన్**



**సిడ్నీ:** కొంతకాలంగా టెస్టుల్లో పేలవ ప్రదర్శన చేస్తున్న టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మకు ఆసీస్ మాజీ సారథి మాథ్యూ హేడెన్ కీలక సూచన చేశాడు. గబ్బా వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత టాప్ ఆర్డర్ విఫలమైంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 51/4 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో ఉంది. కేఎల్ రాహుల్ (33*), రోహిత్ శర్మ (0*) క్రీజులో ఉన్నారు. భారత్ తిరిగి పుంజుకోవడానికి రాహుల్, రోహిత్ భాగస్వామ్యం కీలకమని హేడెన్ పేర్కొన్నాడు. రోహిత్ మరింత శక్తితో దూకుడుగా ఆడాలని సూచించాడు. అతను ఈ అవకాశాన్ని స్వదినియోగం చేసుకుని బ్యాటర్‌గా, కెప్టెన్‌గా తనపై వస్తున్న విమర్శలకు సమాధానం చెప్పాలన్నాడు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆసీస్ 445 పరుగులు భారీ స్కోరు సాధించిన సంగతి తెలిసిందే.

'రోహిత్ శర్మ స్వేచ్ఛగా ఆడుతూ పరుగులు రాబడతాడు. అతను వన్డే క్రికెట్‌లో సాధించిన డబుల్ సెంచరీలు, పొట్టి ఫార్మాట్‌లో నెలకొల్పిన రికార్డులే ఇందుకు నిదర్శనం. కానీ, ఈ మధ్యకాలంలో రోహిత్ బాగా ఆడలేదు. చాలాగ్యాప్ తర్వాత ఇక్కడ (ఆస్ట్రేలియా) ఆడుతుండటంతో అడిలైడ్ టెస్టులో నెమ్మదిగా ఆడాడని అనుకున్నా. ఇప్పుడు రోహిత్ తన కోసమైనా మరింత శక్తితో దూకుడుగా ఆడాలి. నేను అతని బ్యాటింగ్ పార్ట్‌నర్ అయితే 'ఇక్కడ నువ్వు నెమ్మదిగా ఆడటం నాకు నిజంగా ఇష్టం లేదు' అని చెబుతా. రోహిత్ దూకుడుగా ఆడాలని కోరుకుంటున్నా. నిజంగా అతను పోరాటానికి సిద్ధంగా ఉన్నాడు. శక్తి, బాగా ఆడాలనే సంకల్పం అతడిని ముందుకు నడిపిస్తాయి. రోహిత్ నా సోదరుడు.. అతను గొప్ప శక్తి, సంకల్పంతో ఆడాలని కోరుకుంటున్నా' అని మాథ్యూ హేడెన్ పేర్కొన్నాడు.

గబ్బా టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత టాపార్డర్‌లో యశస్వి జైస్వాల్ (4), శుభ్‌మన్ గిల్ (1), విరాట్ కోహ్లీ (3), రిషభ్ పంత్ (9) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. దీంతో భారమంతా రాహుల్, రోహిత్‌పై పడింది. నాలుగో రోజు ఈ జోడీ భారీ భాగస్వామ్యం నెలకొల్పితేనే భారత్ తిరిగి పుంజుకుంటుంది. రాహుల్, రోహిత్ రాణిస్తే తర్వాత వచ్చే రవీంద్ర జడేజా, నితీశ్ కుమార్‌పై కూడా ఒత్తిడి తగ్గుతుంది. మరోవైపు, మ్యాచ్‌కు నాలుగో రోజూ వరుణిడి ముప్పు పొంచి ఉంది. వర్షం కారణంగా మూడో రోజు 33 ఓవర్ల ఆట మాత్రమే సాగింది.

**ఎంపీ రాఘవ్ చద్దా బౌలింగ్‌లో..**

## సిక్సర్‌తో సెంచరీ పూర్తి చేసిన అనురాగ్ ఠాకూర్..



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన ఎంపీలు.. ఆదివారం క్రికెట్ మ్యాచ్ ఆడాడు. ఢిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ స్టేడియంలో ఆ మ్యాచ్ జరిగింది. 2025 నాటికి టీబీ విముక్తి భారత్ లక్ష్యంతో ఆ మ్యాచ్‌ను నిర్వహించారు. 20 ఓవర్ల క్రికెట్ మ్యాచ్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన లోక్‌సభ స్పీకర్ లెవన్ జట్టు భారీ స్కోర్ చేసింది. మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్.. 111 రన్స్ స్కోర్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో ఆ జట్టు 73 రన్స్ తేడాతో నెగ్గింది.అయితే అనురాగ్ ఠాకూర్ సిక్సర్‌తో తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. రాఘవ్ చద్దా బౌలింగ్‌లో అతను సిక్సర్ కొట్టి వంద మైలురాయి అందుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతున్నది. కెప్టెన్ అనురాగ్ ఠాకూర్ 59 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. లోక్‌సభ స్పీకర్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసిన 250 రన్స్ స్కోర్ చేసింది. అయితే చైర్మెన్ లెవన్ జట్టు ఆ లక్ష్యాన్ని అందుకోలేకపోయింది. ఆ జట్టు కేవలం 178 రన్స్ మాత్రమే చేసింది. దాంట్లో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ అత్యధికంగా 74 రన్స్ చేశాడు. అనురాగ్ ఠాకూర్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

## బిలియనీర్ల సంపదలో తగ్గుదల



**ముంబయి:** ప్రపంచ కుబేరులైన ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ సంపద తగ్గిపోయింది. వారు 100 బిలియన్ డాలర్ల క్లబ్ నుంచి ఔట్ అయ్యారని బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ వెల్లడించింది. వ్యాపారపరంగా వారు ఎదుర్కొంటున్న పరిస్థితులే ఇందుకు కారణమని తెలిపింది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ సంపద ఈ ఏడాది జులైలో 120.8 బిలియన్ డాలర్లు ఉండగా.. డిసెంబర్ 13 నాటికి 96.7 బిలియన్ డాలర్లకు పడిపోయినట్లు వెల్లడించింది. ఇక అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ సంపద 122.3 బిలియన్ డాలర్ల నుంచి 82.1బిలియన్ డాలర్లకు తగ్గిపోయినట్లు తెలిపింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన రిటైల్, ఎనర్జీ విభాగాలు ఆశించిన మేర రాణించకపోవడంతో అంబానీ వ్యక్తిగత సంపదలో క్షీణత కనిపించింది. ఇక అదానీ విషయానికొస్తే.. సౌరశక్తి సరఫరా ఒప్పందాలు పొందేందుకు భారత్‌లో పెద్దఎత్తున లంచాలు ఇచ్చారని అదానీ గ్రూప్ అనుబంధ సంస్థలపై ఇటీవల అమెరికాలో కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఆ వార్తలు వచ్చిన వెంటనే అదానీ సంస్థల షేర్లు భారీగా పతనమయ్యాయి.

అంతకుముందు అమెరికా షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ కూడా అదానీ సంస్థపై ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. కంపెనీల షేర్ల విలువను కృత్రిమంగా పెంచేందుకు అవకతవకలకు పాల్పడిందని, కంపెనీల ఖాతాల్లోనూ మోసాలు చేస్తోందని ఆరోపిస్తూ గతేడాది జనవరిలో హిండెన్‌బర్గ్ నివేదిక వెలువరించిన సంగతి తెలిసిందే. ఆ ఆరోపణలతో షేర్లు పతనమైనా.. తర్వాత మళ్లీ పూర్వస్థితికి వచ్చింది. ఇదిలా ఉంటే.. ఎలాన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీస్ సంస్థ స్టార్ లింక్ భారత ఎంట్రీకి మార్గం సుగమైనట్లు వార్తలు వస్తున్నాయి. దేశంలో శాటిలైట్ ఆధారిత వాయిస్, డేటా కమ్యూనికేషన్ సేవల ప్రారంభం కోసం ఎప్పటి నుంచో ఆ సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. అదే జరిగితే ఎయిర్‌టెల్, జియోకు ఈ విభాగంలో గట్టి పోటీ ఎదురుకానుంది.

**ఐటీ షేర్లు పడేశాయ్..**

## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు



**ముంబయి:** దేశీయ మార్కెట్లు సోమవారం నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాలకు తోడు దేశీయంగా వెలువడనున్న ద్రవ్యోల్బణ గణాంకాలపై దృష్టి సారించిన మదుపర్లు అప్రమత్తత పాటించారు. మరోవైపు ఐటీ, లోహ రంగ షేర్లలో అమ్మకాలు సూచీలను ఒత్తిడిలో పడేశాయి. దీంతో నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ (Sensex) 380 పాయింట్లకు పైగా కుంగింది. నిఫ్టీ 100 పాయింట్ల నష్టంతో 24,700 మార్క్ దిగువకు పడిపోయింది.

ఆద్యంతం ఒడుదొడుకులే..

క్రితం సెషన్ ముగింపు (82,133)తో పోలిస్తే ఈ ఉదయం 82,000 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైన సెన్సెక్స్.. రోజంతా అదే ఒరవడి కొనసాగించింది. ఏ దశలోనూ కోలుకోని సూచీ చివరకు 384.55 పాయింట్లు దిగజారి 81.748.57 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ 100.05 పాయింట్లు కుంగి 24,668.25 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరింత పతనమైంది. 8 పైసలు క్షీణించి 84.88 వద్ద జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది.రంగాల వారీగా ఐటీ, లోహ, చమురు, గ్యాస్ రంగ సూచీలు 0.51.0 శాతం మేర కుంగాయి. అటు రియల్టీ సూచీ 3శాతం పెరిగింది. నిఫ్టీలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేర్లు లాభ పడగా.. టైటాన్ కంపెనీ, టీసీఎస్, హిందాల్కో ఇండస్ట్రీస్, అదానీ పోర్ట్స్, భారత్ పెట్రోలియం షేర్లు నష్టపోయాయి.

**దేశీయ సోలార్ ప్రాజెక్టుల్లో**

## కోల్ ఇండియా భారీ పెట్టుబడులు



**ముంబయి:** 661 మెగావాట్ల 'గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ పవర్ ప్రాజెక్టులలో..కోల్ ఇండియా లిమిటెడ్(CIL) రూ. 1,209 కోట్లు పెట్టుబడి పెట్టిందని ప్రభుత్వం సోమవారం తెలిపింది. అంతేకాకుండా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 211 మెగావాట్లు(, 2026లో 697 మెగావాట్లు, 2027లో 1,235 మెగావాట్లు, 2028 ఆర్థిక సంవత్సరంలో 785 మెగావాట్లతో కలిపి మొత్తంగా 3 వేల మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని సాధించడానికి ఈ సంస్థ ప్రణాళికలను కలిగి ఉంది. సోలార్ ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యేలా చూసేందుకు, రోజువారీ ప్రాతిపదికన ప్రాజెక్టు కార్యకలాపాలను సమర్థవంతంగా పర్యవేక్షించడం కోసం సోలార్ ప్రాజెక్ట్ సైట్‌లో సీఐఎల్ అనేక మంది ఇంజనీర్లతో కూడిన యంత్రాంగాన్ని నియమించింది. ఇంకా, సోలార్ ప్రాజెక్టులపై సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ రూ.1,182 కోట్లు, ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ రూ.6,723 కోట్ల పెట్టుబడి పెట్టాయి.



## 27న 'ఓ తండ్రి తీర్పు' విడుదల

ఏవీకే ఫిలిమ్స్ బ్యానర్‌పై లయన్ ఆరిగపూడి విజయ్ కుమార్ సమర్పణలో లయన్ శ్రీరాం దత్తి నిర్మాతగా, రాజేంద్ర రాజు కాంచనపల్లి రచన దర్శకత్వ పర్యవేక్షణలో ప్రతాప్ భీమవరపు దర్శకత్వంలో వివ రెడ్డి హీరోగా 'ఓ తండ్రి తీర్పు' సినిమా సెన్సార్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా ద్వారా వివ రెడ్డి హీరోగా పరిచయం అవుతున్నారు. ప్రతాప్ భీమవరపు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాకు రచన పర్యవేక్షణ రాజేంద్రరాజు కాంచనపల్లి. కుటుంబ విలువలతో ఓ తండ్రి తీర్పు సినిమాను నిర్మించారు. తల్లిదండ్రుల ఆస్తులపై ఉన్న ప్రేమ తల్లిదండ్రులపై లేకపోవటం ఎంతటి మానసిక క్షోభకు గురిచేస్తుందో ఇతివృత్తంగా ఈ సినిమా ఉంటుంది. ఓ తండ్రి తీర్పు పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి అయ్యాయి. ఈ చిత్రంలో కొడుకుగా వివ రెడ్డి పాత్ర చాలామంది కొడుకులకు కనువిప్పు కలిగించేదిగా ఉంటుందని, ఒక మంచి కుటుంబ కథా చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు గర్వంగా ఉందని నిర్మాత శ్రీరామ్ దత్తి అన్నారు. ఈ సినిమా డిసెంబర్ 27న థియేటర్స్ లో ప్రేక్షకుల ముందుకు రానుంది. కీ.శే లయన్స్ ఆరిగపూడి కృష్ణ కుమారి, కీ.శే డా. ఆరిగపూడి విజయ్ కుమార్ లకు ఈ చిత్రాన్ని అంకితం చేస్తున్నారు. నటీనటులు: వివ రెడ్డి, రాజేంద్ర, ప్రతాప్, శ్రీరామ్, కునాల్, కుషాల్, చిత్రం బాషా, అనురాధ, రారాజు, సురభి శ్రావణి, పునర్వి, రమ్య,శివాజీ, రామకృష్ణ, మంజుల, స్వాతి, జ్యోతి, కెవిఎల్ నరసింహారావు, లక్ష్మీనారాయణ, కెవిఎన్ .రాజు, పేరిణి శ్రీకాంత్, గుండు బ్రదర్స్, జబర్దస్త్ నాగరాజు, లక్ష్మీ కిరణం, వాసు, సాధనాల వెంకటస్వామి నాయుడు, మిమిక్రి రాజు, రాము, అయ్యప్ప, ప్రమీల, అమృత వర్షిణి, సాయి చరణ్, సాయి తేజ తదితరులు.

## అన్నదమ్ములతో రొమాన్స్ చేయనున్న శ్రీలీల !

టాలీవుడ్ యంగ్ బ్యూటీ శ్రీలీల ప్రస్తుతం ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా మారింది. వరుసగా స్టార్ యాక్టర్లతో సినిమాలు చేస్తూ బిజీగా ఉంటూనే.. 'పుష్ప2'లో 'కిస్సిక్' అంటూ స్పెషల్ సాంగ్ లో మెరిసింది. ఈ పాటతో ఒక్కసారిగా ఈ అమ్మడి క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. అయితే, ఒకేసారి సినిమాలు ఇప్పుడు ఇద్దరు బ్రదర్స్ లో చేసేందుకు శ్రీలీల సిద్ధమవుతోన్నట్లు తెలుస్తోంది. తన నెక్స్ట్ ప్రాజెక్టులుగా సైన్ చేసిన రెండు మూవీస్ లో అక్కినేని బ్రదర్స్ నటించబోతున్నారట.

అక్కినేని నాగ చైతన్య తన పుట్టినరోజు సందర్భంగా ఓ ఆసక్తికరమైన అప్డేట్ వచ్చింది. ప్రస్తుతం ఆయన నటించిన తండేల్ సినిమా రిలీజ్‌కు ముస్తాబు అవుతుండగా తర్వాత నటించబోయే కొత్త సినిమాను ప్రకటించి ప్రేక్షకులకు మంచి సర్‌ప్రైజ్ ఇచ్చారు. 'NC24'గా వస్తున్న ఈ చిత్రం మైథలాజికల్ నేపథ్యంలో తెరకెక్కనుండగా.. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ నిర్మాణ సంస్థ సుకుమార్ రైటింగ్స్, ఎస్వీసీసీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. విరూపాక్ష, కాంతారా సినిమాలకు మ్యూజిక్ అందించిన అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించబోతున్నారు. ముందుగా మీనాక్షి చౌదరిని అనుకున్నప్పటికీ చివరకు శ్రీలీలను కథానాయికగా ఎంపిక చేసినట్లు సమాచారం. అలాగే.. అక్కినేని హీరో అఖిల్‌తో శ్రీలీల రొమాన్స్ చేయబోతున్నది. ఆదివారం ఈ సినిమా అఫీషియల్‌గా లాంచ్ అయినట్లు సమాచారం. ఏజెంట్ తర్వాత దాదాపు ఏడాది పాటు సినిమాలకు దూరంగా ఉన్న అఖిల్ తాజాగా ఓ లవ్‌స్టోరీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడు. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ మూవీలో అఖిల్‌కు జోడీగా శ్రీలీల హీరోయిన్‌గా నటించనుంది. అఖిల్, శ్రీలీల మూవీకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నట్లు సమాచారం. గతంలో కిరణ్ అబ్బవరంతో వినరో భాగ్యము విష్ణుకథ సినిమా చేశాడు మురళీ కిషోర్. ఈ చిత్రానికి లెనిన్ అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ప్రచారంలో ఉంది. ప్రస్తుతం తెలుగులో నితిన్ రాబిన్‌హుడ్, రవితేజ మాస్ జాతర సినిమాలు చేస్తోంది శ్రీలీల.



## 'UI' షాకింగ్‌గా ఉంటుంది - సూపర్ స్టార్ ఉపేంద్ర

సూపర్ స్టార్ ఉపేంద్ర మచ్ ఎవైటెడ్ ఫ్యూచరిస్టిక్ ఎక్స్‌ట్రావగంజా 'UI ది మూవీ' తో అలరించడానికి సిద్ధంగా వున్నారు. లహరి ఫిల్మ్స్, జి మనోహరన్ & వీనస్ ఎంటర్‌టైనర్స్ కేపీ శ్రీకాంత్ ఈ చిత్రాన్ని హై బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. నవీన్ మనోహరన్ సహ నిర్మాత. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని తెలుగులో గ్రాండ్ గా రిలీజ్ చేయనున్నారు. సెన్సేషనల్ ప్రమోషనల్ కంటెంట్ తో ఈ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసిన ఈ చిత్రం డిసెంబర్ 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. స్టార్ డైరెక్టర్ బుచ్చిబాబు సాన, నిర్మాత ఎస్ కే ఎన్ అతిథులుగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ స్టార్ ఉపేంద్ర మాట్లాడుతూ.. ఇండియానే కాదు.. వరల్డ్ నే షేక్ చేస్తుంది టాలీవుడ్. 1000 కోట్లు, 2000 కోట్లు సినిమాలతో బ్లాక్ బస్టర్ హిట్స్ కొడుతున్నారు. అయినప్పటికీ ఒక చిన్న టాలెంట్‌ని చూసి కూడా గొప్పగా ఆదరిస్తున్నారు. దానికి నేనే నిదర్శనం. మీ ప్రేమను చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. బుచ్చిబాబు ఉప్పెన సినిమా చూసి షాక్ అయ్యాను. ఆయన ఫస్ట్ సినిమాల అనిపించలేదు. రామ్ చరణ్ తో నెక్స్ట్ ఫిల్మ్ చేస్తున్నారు. ఐ విష్ హిం ఆల్ ద వెరీ బెస్ట్. బేబీ సినిమా నాకు చాలా నచ్చింది. అలాంటి ఆలోచన దర్శక నిర్మాతలకు ఎలా వచ్చిందో అని ఆశ్చర్యపోయాను. నిర్మాత ఎస్ కేఎన్ కి ఆల్ ది వెరీ బెస్ట్. వారు ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. తెలుగు ఆడియన్స్ కి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. నేను 20 ఏళ్ల క్రితం చేసిన సినిమాల్ని ఇంకా గుర్తుపెట్టుకుని నన్ను ఇంత గొప్పగా ఆదరిస్తున్నారు. మీ అందరి ప్రేమ, ప్రోత్సాహం చూస్తుంటే ఇంకా అద్భుతమైన సినిమాలు తీయాలని తపన కలుగుతుంది. ఈ గొప్పతనం అంతా ప్రేక్షకులదే. నిర్మాత కేపీ శ్రీకాంత్‌కి ఈ సినిమా ఐడియా చెప్పాను. ఆయన లహరి లాంటి గొప్ప సంస్థని తీసుకొచ్చారు. ఇలా అందరూ కలిసి ఈ సినిమాని ఒక అద్భుతంగా మార్చారు. ఇది రెగ్యులర్ ఫిల్మ్ లాగా ఉండదు. ఒక కొత్త సినిమాని ఎక్స్పీరియన్స్ చేస్తారు. ఇది ఒక ఇమేజినరీ వరల్డ్ లా ఉంటుంది. మ్యూజిక్ డైరెక్టర్ అజినీస్, ఆర్ట్ డైరెక్టర్ శివకుమార్, కెమెరామెన్ వేణు, ప్రజ్వల్, ఫైట్ మాస్టర్స్ రవివర్మ థ్రిల్లర్ మంజు ఇలా అందరూ వచ్చి నా విజన్‌కి హెల్ప్ చేశారు. రేష్మ ఎక్స్ట్రార్డినరీగా పెర్ఫార్మ్ చేసింది. తనకి చాలా మంచి ఫ్యూచర్ ఉంటుంది. రాంబాబు అన్ని సాంగ్స్ బ్రహ్మాండంగా రాశారు. పార్థసారథి గారు ఈ సినిమాని ఒక తెలుగు సినిమాలాగే ప్రజెంట్ చేశారు. నేను చూసుకున్నప్పుడు కన్నడ ఒరిజినలా తెలుగు ఒరిజినలా అనే డౌట్ వచ్చింది. నాకు మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీతో




30 ఏళ్లుగా అనుబంధం ఉంది. ఆయనతో ఒక సినిమా చేయాలని వన్ ఇయర్ ట్రావెల య్యాను. అప్పుడే తెలుగు ఇండస్ట్రీ స్పెషాలిటీ అర్థమైంది. ఇక్కడ చాలా కష్టపడి ఎన్నో వెర్షన్స్ రాసి ఒక సీను తీస్తారు. అల్లు అరవింద్ గారు ఈ సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. యు ఐ సినిమా ఒక మెటఫరికల్ గా ఉంటుంది. ఇందులో సింబాలిజం ఉంటుంది. ఆడియన్స్ మీద కాన్ఫిడెన్స్ తో ఈ సినిమాని చేశాను. ఈ సినిమాని మీరందరూ డీకోడ్ చేస్తారు. కల్ట్ అనేది ఆడియన్స్ లోనే ఉంది. సినిమా ఓపెనింగ్ నుంచే షాక్ అవుతారు. మీరు మైథలాజికల్ కల్కి చూశారు. ఇందులో సైకలాజికల్ కల్కి చూస్తారు. ఖచ్చితంగా ఈ సినిమా ఆడియన్స్ కి ఓ కొత్త ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది. అందరికీ థాంక్ యూ' అన్నారు.

## ఫియర్ స్పందన సంతృప్తినిస్తోంది




### - డైరెక్టర్ డా.హరిత గోగినేని

హీరోయిన్ వేదిక లీడ్ రోల్ లో నటించిన సినిమా "ఫియర్". ఈ సినిమాను దత్తాత్రేయ మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ డా. వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మించారు. సుజాత రెడ్డి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు. సస్పెన్స్ థ్రిల్లర్ కథతో దర్శకురాలు డా. హరిత గోగినేని ఫియర్ మూవీని రూపొందించారు. అరవింద్ కృష్ణ ఓ స్పెషల్ రోల్‌లో కనిపించారు. ఈ సినిమా విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక ఫిలిం ఫెస్టివల్స్ లో 70కి పైగా అవార్డ్స్ లను గెల్చుకుని కొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ నెల 14న ఈ సినిమా రిలీజై అన్ని సెంటర్స్ లో సూపర్ హిట్ టాక్ తో రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో "ఫియర్" సినిమా సక్సెస్ మీట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డా. హరిత గోగినేని మాట్లాడుతూ.. "ఫియర్" సినిమాకు ప్రేక్షకులు, మీడియా నుంచి వస్తున్న పాజిటివ్ రెస్పాన్స్ చూస్తుంటే హ్యాపీగా ఉంది. ఈ సినిమా గురించి ఇప్పటి దాకా చెప్పని కొన్ని విషయాలు రివీల్ చేయాలనుకుంటున్నా... సినిమాను 16 రోజుల్లో కంప్లీట్ చేశాం. ఆ తర్వాత ఇంటర్నేషనల్ అవార్డ్స్ కు అప్లై చేశాం. 39 ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్స్ లో 70కి పైగా అవార్డ్స్ వచ్చాయి. సినిమా స్టార్ట్ చేసిన 7 నెలల్లో ఫస్ట్ కాపీ రెడీ చేశాం. ఇవన్నీ "ఫియర్" సినిమా విషయంలో మేము సాధించిన విజయాలుగానే భావిస్తాం. ఒక చిన్న చిత్రాన్ని ఇంత తక్కువ టైంలో మంచి ప్యాడింగ్ ఆర్టిస్టులతో అన్ని హంగులతో రూపొందించి రిలీజ్ చేయడం మామూలు విషయం కాదు. అందుకు మా టెక్నీషియన్స్, ఆర్టిస్టులు ఎంతో కోపరేట్ చేశారు. ఒక సెలబ్రిటీ ఎవరైనా ఒక అవార్డ్ గెల్చుకుంటే ఎంతో ప్రచారం దక్కుతుంది. కానీ మేము కొత్తవాళ్లం కాబట్టి పెద్దగా ఎవరూ ఇన్ని అవార్డ్స్ వచ్చినా ఫోకస్ చేయడం లేదు. మా సినిమాలో కొన్ని విషయాలను రివ్యూయర్స్ కూడా అబ్జర్వ్ చేయలేదు. "ఫియర్"లో ఒక కలర్ ప్యాట్రన్ యూజ్ చేశాం. అలాగే సీన్ మూడ్‌కు తగిన కలర్ కాస్ట్యూమ్స్ ఉపయోగించాం. ఇప్పటిదాకా మన ఇండస్ట్రీలో ఇలా ఒక యూనిక్ కలర్ ప్యాట్రన్ లో సినిమా రాలేదు. ఇది సైకలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్ విత్ హారర్ కాన్సెప్ట్ అని ముందే చెప్పాం. ఎక్కడా కథను డీవియేట్ చేస్తూ అనవసర ఎలిమెంట్స్ పెట్టలేదు. చిన్న చిత్రంలో అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ పెట్టడం కుదరదు. బడ్జెట్ సరిపోదు. నాకున్న బడ్జెట్‌లో క్వాలిటీ మూవీ చేశాం. మా కథకు, పాత్రకు ఏం కావాలో ఆలోచించే వేదికని తీసుకున్నాం. ఆమె చాలా బాగా పర్ఫార్మ్ చేశారు. దర్శకురాలిగా నాకు రివ్యూస్ తోపాటు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వస్తున్నాయి. నిర్మాతగా అభి ఎంతో కష్టపడ్డారు. రివ్యూస్ రాసిన వాళ్లు, సినిమా చూసిన ప్రేక్షకులు కూడా నేను ఇప్పుడు చెప్పిన విషయాలన్నీ గమనించి మరోసారి సినిమా చూడండి. మంచి సౌండింగ్ ఉన్న థియేటర్‌లో చూస్తే "ఫియర్" సినిమా ప్రతి సీన్ ఎంజాయ్ చేస్తారు. ఇది ఫ్యామిలీ ఆడియెన్స్ తో కలిసి చూడగలిగే సినిమా. ఈ మూవీ తప్పకుండా థియేటర్స్ కు వెళ్లండి. పైరసీని ఎంకరేజ్ చేయొద్దని కోరుతున్నా అన్నారు.

## కన్నప్ప నుంచి మోహన్ లాల్ లుక్ రిలీజ్..

విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప' చిత్రం రాబోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే చిత్ర యూనిట్ చేపట్టిన ప్రమోషన్ కార్యక్రమాలతో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. టీజర్‌తో ఒక్కసారిగా కన్నప్ప టీం హైప్ పెంచేసింది. ఆ తర్వాత కన్నప్ప నుంచి ఒక్కో పాత్రను రివీల్ చేస్తూ ఇస్తున్న అప్డేట్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్ లాంటి స్టార్లు భాగమవుతున్నారు.

ఇటీవలి కాలంలో చిత్ర ప్రమోషన్స్ వేగవంతం చేసిన యూనిట్.. తాజాగా మాలీవుడ్ సూపర్ స్టార్ మోహన్ లాల్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సినిమాలో మోహన్ లాల్, కిరాట అనే పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు తెలుపుతూ.. ఈ పోస్టర్ రిలీజ్ చేశారు. గంభీరమైన మోహన్ లాల్ లుక్ చూస్తుంటే చిత్ర మేజర్ హైలైట్స్ లో ఈయన క్యారెక్టర్ కూడా ఒకటని స్పష్టమవుతోంది.

విష్ణు మంచు టైటిల్ రోల్‌లో కనిపించనున్న కన్నప్ప అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌గా రాబోతోంది. ప్రీతి ముకుందన్ కథానాయికగా నటిస్తోంది. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ఏప్రిల్ 25, 2025న ఈ సినిమా గ్రాండ్ గా విడుదల కానుంది.

కన్నప్ప మూవీ ఏ తరానికి అయినా కొత్తగానే ఉంటుందని.. భక్తి భావం, ధూర్జటి మహాకవి ఎలా రాశారు? శ్రీకాళహస్తి మహత్యం ఏంటి? అన్నది ఈ చిత్రంలో చూపించనున్నాం అని మోహన్ బాబు చెప్పారు. ఎంతో వ్యయప్రయాసతో, భారత దేశంలోని నాలుగు మూలల ఉన్న మహా నటుల్ని ఈ చిత్రంలో తీసుకున్నాం. ఇది కేవలం భక్తి చిత్రమే కాదు. అన్ని రకాల అంశాలుంటాయి. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే ఈ సినిమా తీశాం అన్నారు మోహన్ బాబు. ఈ సినిమాతో విష్ణు మంచు తనయుడు అవ్రామ్ భక్త మంచు ఆరంగేట్రం చేస్తుండటం విశేషం.



## డైరెక్టర్సే నాకు గురువులు

మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ అరసాడ సంగీతాన్ని అందించిన పీరియాడిక్ వెబ్ సిరీస్ వికటకవి నవంబర్ 28 నుంచి జీ5లో స్ట్రీమింగ్ అవుతూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఈ సందర్భంగా అజయ్ అరసాడతో స్పెషల్ చిట్ చాట్.

**నేపథ్యం..?**

అజయ్ : వైజాగ్‌లో పుట్టి పెరిగాను. గీతం యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుకున్నాను. టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా 2011 నుంచి 2018వరకు జాబ్ చేశాను. ఉద్యోగం మానేసిన సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చాను. ఈ క్రమంలో నాకు మా ఫ్యామిలీ నుంచి చాలా మంచి సపోర్ట్ వచ్చింది.

**మ్యూజిక్ అంటే ఆసక్తి ఎందుకు?**

అజయ్ : మా ఇంట్లో అత్తలు, అక్క వీణ వాయిస్తూ ఉండేవారు. అది చిన్నప్పటి నుంచి గమనించేవాడిని. అలా ఆసక్తి పెరుగుతూ వచ్చింది. అలా నిశితంగా గమనించటంతోనే సంగీతాన్ని నేర్చుకుంటూ వచ్చాను. అందుకని శరత్ మాస్టర్ దగ్గర రెండున్నర నెలల పాటు బేసిక్స్ నేర్చుకున్నాను. తర్వాత నాకు నేనుగా సొంతంగా ప్లే చేస్తూ నేర్చుకోవటం స్టార్ట్ చేశాను. గీతం యూనివర్సిటీలో ఇంజనీరింగ్ జాయిన్ అయిన తర్వాత కొన్ని సందర్భాల్లో కాలేజీలకు బంకులు కొట్టి అక్కడ మ్యూజిక్ బ్యాండ్స్‌తో కలిసి తిరగటం వల్ల మ్యూజిక్‌పై కాస్త పట్టు పెరిగింది.

**సినీ రంగంలోకి ఎలా ఎంట్రీ ఇచ్చారు?**

అజయ్ : 2011 నుంచి 2018 వరకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూనే షార్ట్ ఫిల్మ్‌స్‌కు వర్క్ చేసేవాడిని. ఇలా చేయటం వల్ల నాకు మంచి ప్రాక్టీస్ దొరికినట్లయ్యింది. ఈ క్రమంలో ప్రదీప్ అద్వైత్ నన్ను జగన్నాటకం డైరెక్టర్ ప్రదీప్‌కు పరిచయం చేశారు. నేను అంతకు ముందు చేసిన ఓ ముప్పై సెకన్ల మ్యూజిక్ బిట్ విని నాకు జగన్నాటకం మూవీలో చాన్స్ ఇచ్చారు. అలా సినీ ఇండస్ట్రీలోకి నా తొలి అడుగు పడింది. నా చిన్ననాటి స్నేహితుడు.. మ్యూజిక్ డైరెక్టర్ శ్రీచరణ్ పాకాల నన్ను గూఢచారి సినిమాలో కీ బోర్డ్ ప్రోగ్రామింగ్ కోసం వర్క్ చేయమని అడగటంతో వర్క్ చేశాను. ఆ తర్వాత క్షీర సాగర మథనం, నేడే విడుదల, మిస్సింగ్, శ్రీరంగనీతులు సినిమాలకు వర్క్ చేశాను. సినిమాలతో వెబ్ సిరీస్‌లైన సేవ్ ది టైగర్స్ సీజన్1, సీజన్2లకు సంగీతాన్ని అందించాను. రీసెంట్‌గా వికటకవి సిరీస్‌కు వర్క్ చేశాను.

**ఆయ్ సినిమాలో అవకాశం ఎలా వచ్చింది?**

అజయ్ : నేను సంగీతాన్నందించిన మిస్సింగ్ మూవీలో ఓ బీజీఎం బిట్ విన్న నిర్మాత బన్నీవాస్‌గారికి అది బాగా నచ్చింది. ఆయన ఆ సినిమాకు సంబంధించి ఓ ఈవెంట్‌కు వచ్చినప్పుడు ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. తప్పకుండా కలిసి పని చేద్దామని ఆ సందర్భంలో బన్నీవాస్ చెప్పారు. అన్నట్లుగానే ఆయ్ సినిమాకు వర్క్ చేసే అవకాశాన్ని కల్పించారు. అయితే ముందుగా అమ్మలాలో రామ్ భజన సాంగ్‌తో పాటు ఓ ఐటెమ్ సాంగ్‌కు సంగీతాన్ని ఇవ్వమని బన్నీవాస్ చెప్పారు. నేను కూడా ఆ రెండు పాటలు కంపోజ్ చేసిచ్చాను. వారికి అవి బాగా నచ్చేశాయి. దాంతో మిగిలిన పాటలతో పాటు బీజీఎం వర్క్ కూడా చేయమని అన్నారు. అలా ఆయ్ సినిమాకు వర్క్ చేశాను.



**పీరియాడిక్ సిరీస్ వికటకవి వర్కింగ్ ఎక్స్‌పీరియెన్స్ ?**

అజయ్ : డైరెక్టర్ ప్రదీప్ మద్దాలికి ఏం కావాలనే దానిపై పక్కా క్లారిటీ ఉంది. అందువల్ల నేను వికటకవి సిరీస్‌కు వర్క్ చేసేటప్పుడు ఎక్కువగా కష్టపడలేదు. డైరెక్టర్సే నాకు గురువులు. అందువల్ల డైరెక్టర్ ప్రదీప్ మద్దాలికి కావాల్సిన ఔట్‌పుట్ ఇస్తూ వెళ్లానంతే. ఆయ్ సినిమాకు వర్క్ చేసేటప్పుడే వికటకవి సిరీస్‌లో మూడు ఎపిసోడ్స్‌కు మ్యూజిక్ చేశాను. ఆయ్ రిలీజ్ తర్వాత మరో మూడు ఎపిసోడ్స్‌ను కంప్లీట్ చేశాను. వికటకవికి వర్క్ చేయటం ఓ డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్. నేను డైరెక్టర్స్ టెక్నీషియన్.. వాళ్లకి కావాల్సిన ఔట్‌పుట్ ఇవ్వటమే నా ప్రయారిటీ.. అది ఏ జోనర్ సినిమా అయినా, సిరీస్ అయినా మ్యూజిక్ చేయటానికి సిద్ధమే.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com